ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 26.05.2025 | సంపుటి :11 సంచిక : 307 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




యూనస్.. బంగ్లాదేశ్‌ను

## అమెరికాకు అమ్మేస్తాడు

**షేక్ హసీనా ఆరోపణలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక సారథి ముహమ్మద్ యూనస్‌పై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బంగ్లా అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించడాన్ని తీవ్రంగా ఖండించిన

మిగతా 2లో..



## కుమారుడిపై లాలూ వేటు

**పార్టీ నుంచి బహిష్కరణ**

**పాట్నా(జనంసాక్షి):** రాష్ట్రీయ జనతా దళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు

మిగతా 2లో..

# ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం ఏకమైంది



## ‘ఆపరేషన్‌సిందూర్’లో మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు అమోఘం

- వారి సాహసం,ధీరత్వం అవి ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయి
- ఇది సైనిక చర్య మాత్రమే కాదు.. దేశభక్తితో నిండిన నవభారతానికి నిదర్శనం
- దేశంలో మావోయిస్టుల హింసాత్మక చర్యలు క్రమంగా తగ్గుతున్నాయి
- దంతెవాడ ఆపరేషన్‌లో జవాన్ల సాహసాలు హర్షణీయం
- సంగారెడ్డి మహిళలు వ్యవసాయంలో డ్రోన్ల వినియోగించడం అద్భుతం
- 122వ మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఆపరేషన్ సిందూర్ సమయంలో మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 122వ కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి మోదీ మన్‌కీ బాత్‌లో ప్రసంగించారు.‘ఉగ్రవాదనికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఆపరేషన్ సిందూర్ కొత్త ఉత్సాహాన్ని నింపింది. మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయి. దేశ ప్రజలను ఇది ఎంతగానో ప్రభావితం చేసింది. అనేక కుటుంబాలు దీనిని తమ జీవితాల్లో భాగం చేసుకున్నారు. ఆపరేషన్ సమయంలో జన్మించిన చిన్నారులకు పలువురు సిందూర్ అని నామకరణం చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైంది. నేడు ప్రతి భారతీయుడు

మిగతా 2లో..

## ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో ప్రధాని భేటీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో సమావేశమయ్యారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కేంద్రమంత్రులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. కుల గణన, మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతుండడం, కేంద్ర ప్రభుత్వం

మిగతా 2లో..



కలం యోధునికి

# కన్నీటి వీడ్కోలు

## మందమర్రిలో ముగిసిన మునీర్ అంత్యక్రియలు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కేసీఆర్ సహా ప్రముఖుల సంతాపం
- నివాళులర్పించిన ఎమ్మెల్సీ కోదండరాం, ఎంపీ వంశీకృష్ణ తదితరులు
- సానుభూతి తెలిపిన మంత్రులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు
- బరువెక్కిన హృదయాలతో సింగరేణి ప్రజలు, పాత్రికేయ లోకం





స్వగ్రామం మందమర్రిలో ఎండి మునీర్ అంత్యక్రియలు.. పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

**హైదరాబాద్/మంచిర్యాల ప్రతినిధి, మే 25 (జనంసాక్షి)** తెలంగాణ ఉద్యమకారుడు, సింగరేణి సకల జనుల సమ్మె కన్వీనర్ ఎండి మునీర్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. గచ్చిబౌలిలోని ఓమేగా ఆసుపత్రి నుంచి ఆదివారం తెల్లవారు జామున మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గౌతమ్‌నగర్‌కు మునీర్ భౌతికకాయాన్ని తరలించారు. అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచి, అనంతరం మునీర్ స్వగ్రామమైన మందమర్రికి తీసుకెళ్లారు. ప్రత్యేక

మిగతా 2లో..

### అంకితభావం గల వ్యక్తి - సీఎం రేవంత్

ఎండి మునీర్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా సంతాపం తెలియజేశారు. వృత్తి పట్ల నిబద్ధత, సామాజిక ఉద్యమాల పట్ల అంకితభావం కలిగిన మునీర్ గారి మరణం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. వివిధ పత్రికల్లో పనిచేసిన

మిగతా 2లో..




# ఇప్పుడేంచేద్దాం?

**కేసీఆర్‌తో కేటీఆర్ భేటి • కవిత లేఖపై సమాలోచనలు**

**సిద్దిపేట(జనంసాక్షి):** భారాస అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ప్రత్యేకంగా కలిశారు. ఎమ్మెల్సీ కవిత లేఖ, అనంతర వ్యాఖ్యలు, సంబంధిత పరిణామాలు, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండో తేదీన నిర్వహించబోయే కార్యక్రమాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఇటీవల కేసీఆర్‌కు, ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత అంతర్గతంగా లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆ లేఖ బహిర్గతం కావడం, ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ ‘ కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి’ అంటూ వ్యాఖ్యానించడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్, కేటీఆర్ భేటీ అయినట్లు సమాచారం.


మిగతా 2లో..



మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై

## తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశం

**దేశ పరువు, ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కావడంతో నేరుగా ఎప్పటికప్పుడు విచారణ వివరాలను అడిగి తెలుసుకుంటున్న సీఎం రేవంత్**



**హైదరాబాద్(జనంసాక్షి):** మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖా గోయల్, ఐపీఎస్ రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టింది.మిస్ వరల్డ్ కంటిస్టెంట్‌లను అడిగి పోటీల నిర్వహణ తీరు, ఏమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణల్లో ఏ మేరకు నిజం ఉందన్న వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. వీడియోలను సైతం రికార్డు చేస్తుండటం గమనార్హం. దేశ పరువు, ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కావడంతో సీఎం

మిగతా 2లో..

### మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై దర్యాప్తు చేయించాలి: కేటీఆర్

వార్త 2లో

# విద్య, ఆరోగ్యానికి పెద్దపీట

**తెలంగాణను సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం**

- వైద్యులకు అన్ని విధాలా అండగా ఉంటాం
- ‘తానాకాన్’ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

**కరీంనగర్ బ్యూరో, మే 25 (జనంసాక్షి)** :తెలంగాణను సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించిన 11వ వార్షిక సదస్సు ముగింపు కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైద్యం సేవా దృక్పథంతో కూడినదని, వైద్యులు సమాజ శ్రేయస్సు కోరుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో వైద్య రంగ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని అన్నారు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సదస్సులో

మిగతా 2లో..




# బీఆర్ఎస్ మునిగిపోతున్న నావ..

- ఆ పార్టీతో ఎట్టిపరిస్థితుల్లో కలిసే ప్రసక్తే లేదు
- కేసీఆర్ కుటుంబ కలహాలు వాళ్లే తేల్చుకోవాలి
- రెండు పార్టీలు ఒప్పందం మేరకు దాడి చేస్తున్నాయ్
- కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఎన్ని తిట్టినా పోయేదేమీ లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్(జనంసాక్షి):** మేము ఆ రెండు పార్టీలకి జవాబు దారి కాదని కాంగ్రెస్, బీఆర్ఎస్‌ని ఉద్దేశించి కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఎన్ని తిట్టినా తమకు పోయేదేమీ లేదని స్పష్టం చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రెండు పార్టీలో ఒకరి కొకరు ఒప్పందం కుదుర్చుకొని బీజేపీపై దాడి చేస్తున్నాయని ఆరోపించారు.. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ దోచుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్- బీజేపీ పొత్తు అంశంపై కిషన్‌రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్

మిగతా 2లో..

# బాంబుల వర్షం

## ఉక్రెయిన్ నగరాలపై డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడి

**కీవ్(జనంసాక్షి):** ఉక్రెయిన్-రష్యాల మధ్య ఓవైపు యుద్ధ ఖైదీల మార్పిడి జరుగుతున్నప్పటికీ ఇరుదేశాల మధ్య దాడులు మాత్రం ఆగడం లేదు. ఆదివారం వందలాది మంది సైనికులు, పౌరులను విడిచిపెట్టిన రష్యా.. ఉక్రెయిన్‌పై భీకర దాడులకు తెగబడింది. దాదాపు 367 డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయగా.. వీటిల్లో 12 మంది మృతిచెందారు. మూడేళ్ల యుద్ధంలో ఒకేసారి ఈ స్థాయిలో డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయడం ఇదేతొలిసారి అని ఉక్రెయిన్ సైనిక వర్గాలు వెల్లడించాయి. యుద్ధ ఖైదీల అప్పగింతలో భాగంగా శుక్రవారం ఇరుపక్షాలు 390 మంది చొప్పున మార్పిడి చేసుకోగా శనివారం 307 మందిని ఇరుదేశాలు మార్పిడి చేసుకున్నాయి. తాజాగా మరో 303 సైనికులను పరస్పరం అప్పగించుకున్నట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ ప్రకటన రాకముందు కీవ్‌తో పాటు ఇతర ప్రాంతాలపై మాస్కో భీకర దాడులు చేసింది. ఒకేరోజు 69 క్షిపణులతో పాటు 298 డ్రోన్లలో విరుచుకుపడింది. వీటిలో ఇరాన్ రూపొందించి షాహెద్ డ్రోన్లు కూడా ఉన్నట్లు సమాచారం. మొత్తంగా ఈ దాడుల్లో 12 మంది చనిపోగా.. అనేకమంది గాయాలపాలయ్యారు. ఉక్రెయిన్‌లోని 30 నగరాలు, గ్రామాలపై ఉద్దేశపూర్వక దాడులు జరిగాయని అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రష్యాపై ఆంక్షలు విధించాలని పాశ్చాత్య దేశాలను అభ్యర్థించారు. రష్యా నాయకత్వంపై బలమైన ఒత్తిడి తీసుకువస్తే తప్పితే ఈ దారుణాలకు అడ్డుకట్ట వేయలేమన్నారు.



3 రోజుల పాటు తెలంగాణలో

## వర్ష సూచన

**హైదరాబాద్(జనంసాక్షి):** నైరుతి రుతుపవనాలు ఇవాళ దేశంలోని పలు ప్రాంతాలకు విస్తరించాయి. పశ్చిమ మధ్య, తూర్పు మధ్య అరేబియా సముద్రంతో పాటు కొన్ని ప్రాంతాలకు, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు, గోవా అంతటా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, మిజోరాంలోని కొన్ని ప్రాంతాలు, మణిపూర్, నాగాలాండ్‌లోని కొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలకు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరఠ్వాడ, ఉత్తర అంతర్గత కర్ణాటక వద్ద ఉన్న అల్పపీడనం

మిగతా 2లో..



## ఉగ్రవాదం ప్రపంచానికి ఉన్న అతిపెద్ద సమస్య



**దీనిని సహించరాదు • అమెరికాలో శశిథరూర్ బృందం**

**వాషింగ్టన్(జనంసాక్షి):** ఉగ్ర దాడులపై భారత్ మౌనంగా ఉండదని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పష్టం చేశారు. ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు శశిథరూర్ నాయకత్వంలోని బృందం అమెరికాకు వెళ్లింది. ఈక్రమంలోనే న్యూయార్క్‌లోని 9/11 మెమోరియల్‌ను బృందం సందర్శించింది. ఈ సందర్భంగా

మిగతా 2లో..

### పాక్‌కు గూఢచర్యం.. రాజస్థాన్‌లో వ్యక్తి అరెస్టు

2లో



## కొచ్చి తీరంలో లైబీరియా నౌక మునక

**సముద్రంలో కలిసిన ప్రమాదకర రసాయనాలు..!**

**కొచ్చిలో హై అలర్ట్..**

**కొచ్చి(జనంసాక్షి):** లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం ప్రమాదానికి గురైంది. తాజాగా అది పూర్తిగా సముద్రంలో మునిగిపోయినట్లు ఇండియన్ కోస్ట్ గార్డ్ ప్రకటించింది. నౌకలో 640 కంటైనర్లు ఉండగా.. వాటిలో 13 కంటైనర్లలో

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
26.05.2025



# పుష్కరస్నానమాచరించిన గవర్నర్ దంపతులు

### స్వాగతం పలికిన మంత్రి శ్రీధర్ బాబు

మంథని, (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు ఆదివారం సరస్వతీ పుష్కరాల్లో పాల్గొన్నారు. గవర్నర్ దంపతులకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అధికారులతో కలిసి సాదరంగా స్వాగతం పలికారు. త్రివేణి సంగమంలో ఆయన కుటుంబసమేతంగా పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సరస్వతి మాతను దర్శించుకున్నారు. అక్కడి నుంచి నేరుగా కాళేశ్వరం ముక్తేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మంత్రి శ్రీధర్ బాబు తో పాటు అధికారులు గవర్నర్ దంపతులను శాలువాలతో సన్మానించి సరస్వతి చిత్రపటాన్ని అందజేశారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం పటిష్ట బందోబ స్తు ఏర్పాటు చేసింది. కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు రేపటితో ముగుస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున నుండే భక్తుల రద్దీ పెరిగి, పెద్ద ఎత్తున భక్తులు కాళేశ్వరం చేరుకుంటూ పుష్కరస్నా నాలను ఆచరిస్తున్నారు. త్రివేణి సంగమం నదీ తీరంలో పవిత్ర పుణ్య స్నానాలు చేసి, భక్తులు స్వామి వారి దర్శనానికి చేరుకుంటున్నారు. ఆదివారం ఒక్కరోజే సుమారు 5 లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలకు వచ్చారు.

నవరత్న మాల హారతి హైలెట్

త్రివేణి సంగమంలో ప్రతిరోజు రాత్రి నిర్వ హించే సరస్వతి నవరత్న మాలా హారతి పు ష్కరాలకి హైలెట్ గా నిలిచింది. కార్యక్రమం నిర్వహణకు కాశీ నుండి ప్రత్యేకంగా పండితు లను రప్పించారు. కాశీ పూజారులు పుష్కరా లు ప్రారంభం రోజు రోజు రాత్రి నుండి త్రివేణి సంగమ తీరాన నిర్వహిస్తున్న హారతి తంతు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. రోజూ రాత్రి గంటకు పైగా నిర్వహించే హారతిని వీ క్షించేందుకే పెద్ద ఎత్తున భక్తులు కాళేశ్వరంలో ఉండిపోతున్నారు.

# బీఆర్ఎస్ మునిగిపోతున్న నావ..



మునిగిపోతున్న నావ.. ఆ పార్టీతో కలిసే ప్రసక్తే లేదని తేల్చేశారు. కేసీఆర్ కుటుంబ కలహాలు వాళ్ళు తేల్చుకోవాలని ఎవరు ఎక్కువ దోచుకొన్నారు దోచుకున్నది పంచోవడం పైనే ఆ కుటుంబంలో ఘర్షణ మొదలైందని ఎద్దేవా చేశారు. బీజేపీ పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారని.. కవిత చిప్ప మాకు అవసరం లేదు%ఱ% ఆమె గురుంచి మాట్లాడాల్సిన అవసరం లేదని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఆమె ఏందో తెలుసన్నారు.హరీష్ రావు కాంగ్రెస్ దగ్గరగా ఉన్న వ్యక్తి అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్య చేశారు. "విభజన సమయంలో పోలవరానికి జాతీయ హోదా ఇస్తుంటే ఎందుకు అడగలేదు. కేసీఆర్ చెప్పాలి.. ఎందుకు విభజన చట్టంలో తెలంగాణ ప్రాజెక్ట్ పెట్టాలని డిమాండ్ చేయలేదు.. సోనియా దేవత అని పోయి కాళ్ళు పట్టుకున్నారు కదా%ఱ% తెలంగాణ బిడ్డగా తెలంగాణ కోసం పని చేస్తాం.. తెలంగాణ ప్రయోజనాలు కాపాడుతాం. హరీష్ రావు నీ సూచనలు కేటీఆర్, కవిత లకు చెప్పుకో.. అప్పుడు ఎందుకు చేతులు ముడుచుకొని కూర్చున్నారు. కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పట్టిన అవినీతి పార్టీ%ఱ% దమ్ము ధైర్యం ఉంటే కాళేశ్వరంపై సీబీఐ విచారణకు కోరాలని సీఎం రేవంత్ ను డిమాండ్ చేస్తున్న." అని వ్యాఖ్యానించారు.ఆపరేషన్ సిందూర్ విషయంలో బాధ్యత రహితంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని కిషన్‌రెడ్డి తెలిపారు. పాకిస్థాన్ సైనికుల మాట కాంగ్రెస్ మాట్లాడుతుందని%ఱ% కేసీఆర్ హయంలో జరిగిన అవినీతిని ఈటెల రాజేందర్ కాళేశ్వరం కమిషన్ ముందుకు వెళ్ళాలి చెప్పాలన్నారు. అవినీతి కి వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేస్తుందని ఈటెల రాజేందర్ కాళేశ్వరం విషయంలో ఏమీ తెలిసిన చెప్పాలని ఆదేశించారు.

# కుమారుడిపై లాలూ వేటు

బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. తమ కుమారుడు వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించేలా చేస్తున్న చర్యలు.. సామాజిక న్యాయం కోసం పార్టీ చేస్తున్న సమష్టి పోరాటాన్ని బలహీనపరుస్తున్నాయని లాలూ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. తేజ్ ప్రతాప్ ప్రవర్తన కుటుంబ విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా లేదని అన్నారు. ఈ కారణాల వల్ల అతడిని పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇకపై తేజ్ ప్రతాప్‌కు ఆర్జేడీ పార్టీలో, తమ కుటుంబంలో స్థానం లేదని స్పష్టం చేశారు. శనివారం తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానంటూ పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో లాలూ ప్రసాద్ ఈ చర్యలు తీసుకున్నారు.

అసలేమయ్యిందంటే?

శనివారం తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు ప్రత్యక్షమైంది. ఆయన ఒక మహిళతో ఉన్న ఫొటో దానిలో ఉంది. ఆమె పేరు అనుష్క యాదవ్ అని, గత 12 ఏళ్లుగా తాము రిలేషన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇది కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అనంతరం దీనిపై ఆయన ఎక్స్ వేదికగా వివరణ ఇస్తూ.. తన సోషల్ మీడియాను ఎవరో హ్యాక్ చేశారని తెలిపారు. తన కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసేందుకే ఎవరో ఇలాంటి పోస్టు చేశారని ఆరోపించారు. ఆ ఫొటో సైతం ఎడిట్ చేసిందని వెల్లడించారు. ఇలాంటి పుకార్లను నమ్మవద్దని తన అభిమానులను కోరారు.

# ఇప్పుడేం చేద్దాం?

జూన్ 1న అమెరికాలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కేటీఆర్ ఈ నెల 28న వెళ్లనున్నారు. ఈలోగా పార్టీ పరంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణపై కార్యాచరణ రూపొందించేందుకు వీలుగా కేసీఆర్‌తో ఆయన చర్చించే అవకాశముంది.

# 3 రోజుల పాటు తెలంగాణలో వర్ష సూచన

ఇవాళ ఐఎస్‌టీ వద్ద కొనసాగుతోందని పేర్కొంది.ఇది రాబోయే 24 గంటల్లో నెమ్మదిగా తూర్పు వైపునకు కదిలి క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దీని ప్రభావంతో రాగల మూడు రోజులు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ మూడు రోజులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని వివరించారు.

# కలం యోధునికి కన్నీటి వీడ్కోలు





తెలంగాణ ఉద్యమసమయంలో సింగరేణి కార్మికులతో సమావేశంలో మునీర్(ఫైల్)

ప్రార్థనల అనంతరం సాయంత్రం వేళ మునీర్ అంత్యక్రియలు నిర్వహించారు. సింగరేణి కార్మికులు, రాష్ట్రనలుమూలల నుంచి పాత్రికేయులు తరలివచ్చి మునీర్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

### మునీర్ సేవలను స్మరించుకున్న కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సింగరేణి కార్మికుల నడుమ జీవిస్తూ, వారి సమస్యలను వెలుగులోకి తెస్తూ, నిబద్ధత కలిగిన పాత్రికేయునిగా సుదీర్ఘ కాలం పనిచేసిన మునీర్ కృషి గొప్పదన్నారు. టీజేఎఫ్ నేతగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటంలో సింగరేణి ప్రాంత ప్రజా సంఘాలను ఉద్యమ శక్తులను సమన్వయం చేయడంలో వారిని చైతన్యపరచడంలో జర్నలిస్టుగా ఎండీ మునీర్ సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. మునీర్ కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### ప్రజల మనిషి మునీర్
### - మంత్రి దామోదర రాజనర్సింహా

తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ మృతిపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజల కోసం పరితపించే మునీర్ ఇంత త్వరగా వెళ్లిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మునీర్ మృతిపట్ల సం తాపం వ్యక్తం చేసిన మంత్రి, ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. కుటుం బ సభ్యులకు సానుభూతి తెలిపిన మంత్రి, వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

### తెలంగాణ ఉద్యమాలకు వెన్నుదన్ను : కేటీఆర్

ప్రజల జర్నలిస్ట్ ఎండీ మునీర్ అకాల మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. సింగరేణి, ఉత్తర తెలంగాణలో జరిగిన అనేక ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచిన మునీర్ మరణం తీరని లోటు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి సకల జనుల సమ్మె కన్వీనర్‌గా మునీర్ పోషించిన పాత్ర చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. మునీర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### సమాజహిత ఉద్యమాల్లో మునీర్
### - ఎన్ బలరాం, సింగరేణి సీఎండి

సింగరేణి మాజీ ఉద్యోగి, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమ సమయంలో సకలజనుల సమ్మెలో సింగరేణి విభాగానికి కన్వీనర్‌గా, పలు సమాజ హిత ఉద్యమాలలో కీలక భూమిక పోషించిన మునీర్ మరణం పాత్రికేయ రంగానికే గాక తెలంగాణ సమాజానికి తీరని లోటని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. పాత్రికేయుడిగా పనిచేస్తూ, కార్మిక పక్షపాతిగా అనేక సింగరేణి కార్మిక సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారని, చివరి వరకు పాత్రికేయులుగానే కొనసాగుతూ అనేక సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ప్రజాసేవ చేశారన్నారు. ఆయన అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

### అంకితభావం గల వ్యక్తి : సీఎం రేవంత్

మునీర్ సింగరేణికి సంబంధించి ఎన్నో విషయాల్లో ప్రజలను చైతన్య పరిచారన్నారు. ఆయన మరణం పాత్రికేయ లోకానికి తీరని లోటు అని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఉగ్రవాదులకు వ్యతిరేకంగా దేశం ఏకమైంది

ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే సంకల్పంతో ఉన్నాడు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదు.. మన ధైర్యం, దేశభక్తితో నిండిన నవభారతానికి నిదర్శనం. అనేక నగరాలు, గ్రామాలు, పట్టణాలో తిరంగ యాత్రలు నిర్వహించారు. పౌర రక్షణ వాలంటీర్లుగా మారేందుకు అనేక నగరాల నుంచి యువత ముందుకు వచ్చారు' అని మోదీ పేర్కొన్నారు.

### ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో ప్రధాని భేటీ

చేపట్టిన సుపరిపాలన అంశాలు ఈ సమావేశంలో ప్రధాన ఎజెండాగా ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి ఈ సమావేశాన్ని నిర్వహిస్తుండడంతో దానికి సంబంధించిన వివరాలను సీఎంలు, డిప్యూటీ సీఎంలకు కేంద్ర మంత్రులు వివరించారు. తమ తమ రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు వివరించారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా ఈ సమావేశంలో రెండు తీర్మానాలు ఆమోదించారు.ఆపరేషన్ సిందూర్‌లో ప్రధాని మోదీ నాయకత్వాన్ని, సాయుధ దళాల పరాక్రమాన్ని అభినందిస్తూ ఒక తీర్మానం తీసుకురాగా.. దేశవ్యాప్తంగా కుల జనగణన చేపట్టడంపై మరో తీర్మానం చేశారు.సమావేశంలో భాగంగా.. ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ సహా విపక్షాలు చేసిన విమర్శలను తిప్పికొట్టే అంశంపై చర్చలు జరగనున్నట్లు సమాచారం. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రధాని సాయుధ దళాలకు అధికారాను ఇచ్చి.. ముందుకు నడిపించారని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులకు, వారిని పోషిస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పిందని అన్నారు.

# ఉగ్రవాదం ప్రపంచానికి ఉన్న అతిపెద్ద సమస్య

శశిథరూర్ మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదం ప్రపంచానికి ఉన్న పెద్ద సమస్యన్నారు. దీనిపై మనం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకొన్న చర్యలను ఆయన భారత కాన్సులేట్‌లో వివరించారు. "పహల్గాంలో మతం ఆధారంగా పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడితో భారత్‌లో మతపరమైన అల్లర్లు సృష్టించాలనేది వారి ప్రయత్నంగా తెలుస్తోంది. ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థ ఈ దారుణానికి ఒడిగట్టింది. లష్కరే తయ్యిబాకు అనుబంధ సంస్థ ఇది. దీన్ని ఉగ్ర సంస్థగా ప్రకటించాలని భారత్ ఇప్పటికే ఐరాసను అభ్యర్థించింది. నేను ప్రభుత్వంలో కాకుండా.. ప్రతిపక్ష పార్టీలో ఉన్నాను. ఈ దాడి తర్వాత పాక్‌పై తీసుకోవాల్సిన అంశాలను ఉద్దేశిస్తూ నేను ఒక వ్యాసం రాశాను. భారత బలగాలు పాక్‌ను బలంగా, తెలివితో దెబ్బతీశాయి.పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై భారత బలగాలు కచ్చితమైన దాడులు చేసి.. వాటిని నేలమట్టం చేశాయి. మేము ఉగ్రస్థావరాలపై దాడి చేస్తే.. పాక్ సైన్యం స్పందించింది. మాపై ప్రతిదాడులకు దిగింది. వాటిని సమర్థమంతంగా తిప్పికొట్టాం. ఈ ఆపరేషన్‌తో ఉగ్రచర్యలను భారత్ సహించదనే గట్టి సందేశం ఇచ్చింది. ఇది పహల్గాం దాడికి ప్రతిస్పందన మాత్రమే తప్ప.. పాక్‌తో యుద్ధం చేయాలనేది మా ఉద్దేశం కాదు. దాన్ని మేము కోరుకోవడం లేదు. దేశ ప్రజల రక్షణే మాకు ముఖ్యం" అని శశిథరూర్ పేర్కొన్నారు.

# కొచ్చి తీరంలో లైబీరియా నౌక మునక

ప్రమాదకరమైన రసాయనాలు, 12 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్, మిగిలిన వాటిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ ఉన్నట్లు తెలిపింది.ఇవి లీకైతే సముద్ర జలాలు తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదం ఉండడంతో అధికారులు కొచ్చి తీరంలో హై అలర్ట్ ప్రకటించారు. కంటైనర్లను, అందులోంచి బయటకు వచ్చిన ఇంధనం తీరంవైపునకు వస్తే తాకొద్దని ప్రజలను కేరళ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం లీకై ఎంత మేరకు వ్యాపించిందనే విషయాన్ని తెలుసుకోవడానికి 'ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ' వినియోగించే విమానం సముద్రంపై చక్కర్లు కొడుతోందని అధికారులు తెలిపారు. ఈ ఘటన కారణంగా తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### ప్రమాదంలో లైబీరియా నౌక

లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక శనివరం కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో తొలుత ఓ వైపునకు ఒరిగిపోయింది. దీంతో అందులోని కొన్ని కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. విఝింజమ్ పోర్టు నుంచి శుక్రవారం బయల్దేరిన 184 మీటర్ల పొడవున్న ఎంఎస్‌సీ ఎల్సా-3 నౌక శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ చేరుకోవాల్సి ఉండగా.. కంటైనర్ నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన ఇండియన్ కోస్ట్ గార్డ్ వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. అందులో ఉన్న మొత్తం 24మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

# విద్యా, ఆరోగ్య రంగాలకు పెద్దపీట

వైద్యులు ఇచ్చిన సూచనలు సలహాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రిదామోదర్‌రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి సమస్యలపై సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేలా చూస్తానని అన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, అనుమతులు, లైసెన్స్ తదితర పరిపాలన సంబంధిత సమస్యలపై వైద్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. వైద్యులు సమాజంలో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారో ప్రభుత్వానికి బాగా తెలుసని, వైద్యులకు అండగా నిలబడడం తమ బాధ్యత అని అన్నారు. తానాకాన్ పదకొండవ రాష్ట్ర సదస్సు ద్వారా వైద్యులు తమ సమస్యలను సమగ్రంగా చర్చించుకోవడం హర్షణీయమని, ఇలాంటి వేదికల ద్వారా ప్రభుత్వానికి చక్కటి సూచనలు అందించే అవకాశం కల్పిస్తాయని పేర్కొన్నారు. వైద్యులు సూచించిన సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు కలెక్టర్లతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దిశగా విద్యా, ఆరోగ్యరంగాలకు ప్రాధాన్యత ఇస్తూ భారీ స్థాయిలో మార్పులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి మార్గంలో తీసుకెళ్లే విద్య, వైద్యరంగాల పై ప్రత్యేక దృష్టి సారించమన్నారు. విద్యారంగ అభివృద్ధికి సంబంధించి అన్ని వర్గాలకు విద్యాసదుపాయాలు అందేలా పలు నూతన విధానాలను అమలు చేస్తున్నామని ,ఇప్పటికే వాటి అమలులో స్పష్టమైన పురోగతి కనిపిస్తోందని అన్నారు. వైద్యరంగంలో కూడా ప్రజల ఆరోగ్యాలు కాపాడేలా అవసరమైన మార్పులను చేపట్టామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచి నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కు మార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ హరిష్‌బాబు(సిర్పూర్ ఎమ్మెల్యే) , డాక్టర్.సంజయ్ కుమార్ (జగిత్యాల ఎమ్మెల్యే) డాక్టర్.సంజయ్(కోరుట్ల ఎమ్మెల్యే) మాట్లాడుతూ సామాన్యలకు అతి తక్కువ ధరలో వైద్యం అందిస్తున్న చిన్న, మధ్యతరగతి ఆస్పత్రులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి సమస్యలును పరిష్కరించాలని కోరారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సదస్సులో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, తానాకాన్ రాష్ట్ర అధ్యక్షులు అరుణ్‌కతారి, ఆర్గన్కెజింగ్ చైర్మన్ ఎలగందుల శ్రీనివాస్, కార్యదర్శి చాట్ల శ్రీధర్, ఆర్గన్కెజింగ్ ట్రెజరర్, డాక్టర్ రాజకుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎనమల్ల నరేష్ పాల్గొన్నారు.

# జపాన్‌ను అధిగమించిన భారత్

### నాలుగో ఆర్థిక శక్తిగా అవతరించింది :నీతి ఆయోగ్ సీఈఓ




న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. పదో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు.దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటి చర్యలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్ద కాలంలో భారత చాలా కీలకమన్నారు.మరోవైపు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇదే విషయాన్ని 'ఎక్స్' వేదికగా తెలిపారు. వికసిత్ భారత్ వైపు ఇది అతిపెద్ద అడుగు అని పేర్కొన్నారు. దీన్ని సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లలోనే భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# యూనస్.. బంగ్లాదేశ్‌ను అమెరికాకు అమ్మేస్తాడు

ఆమె.. అది రాజ్యాంగ విరుద్ధమ న్నారు. ఉగ్రవాద సంస్థల సాయం తో పాలనను కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో బంగ్లాను అమెరికాకు అమ్మేసేందుకు కుట్ర జరుగుతుందని పేర్కొంటూ ఓ ఆడియోను విడుదల చేశారు."సెయింట్ మార్టిన్ ద్వీపం కోసం అమెరికా చేసిన డిమాండ్లకు మా నాన్న (షేక్ ముజిబుర్ రహ్మాన్) అంగీకరించలేదు. అందుకు ఆయన ప్రాణాలను కూడా అర్పించాల్సి వచ్చింది. అధికారంలో ఉండేందుకు దేశాన్ని విక్రయించాలని నేను ఎప్పుడూ భావించలేదు కాబట్టే నా దుస్థితి ఇలా నెలకొంది. దేశంలోని ఒక్క అంగుళం భూభాగాన్ని ఎవ్వరూ వదులుకోరు. కానీ, ఈ రోజు ఏమిటీ దౌర్భాగ్యం. దేశంతో పాటు ప్రపంచం మెచ్చిన వ్యక్తికి.. అధికారాన్ని చేపట్టిన తర్వాత ఏమయ్యింది?" అని ప్రస్తుత సారథి యూనస్‌ను ఉద్దేశిస్తూ షేక్ హసీనా ప్రశ్నించారు. ఉగ్రవాద భావజాలమున్న వారి మద్దతుతో యూనస్ ప్రభుత్వాన్ని చేపట్టారని షేక్ హసీనా ఆరోపించారు. "నా ప్రభుత్వం పోరాటం చేసిన వారితో, అంతర్జాతీయంగా నిషేధానికి గురైన వారితో కలిసి ప్రభుత్వాన్ని చేజిక్కించుకున్నారు. ఒక్క ఉగ్రదాడి జరిగితేనే మేం కఠిన చర్యలు తీసుకున్నాం. ఎంతో మందిని అరెస్టు చేశాం. కానీ, ఇప్పుడు జైళ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. అందర్నీ విడిచిపెడుతున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం మిలిటెంట్ల రాజ్యం నడుస్తోంది" అని మాజీ ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు.బంగ్లాదేశ్ అవామీ లీగ్‌పై నిషేధం విధించడాన్ని షేక్ హసీనా తీవ్రంగా తప్పుపట్టారు. అది అక్రమమని, చట్టవిరుద్ధమన్నారు. "సుదీర్ఘ పోరాటం చేసి దేశాన్ని సాధించుకున్నాం. రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఆయనకు ఎవరిచ్చారు? ఆయనకు ప్రజా మద్దతు లేదు. ఆ పదవి కూడా ఉనికిలో లేదు. పార్లమెంటు నిర్ణయం లేకుండా చట్టాన్ని ఎలా మారుస్తారు? బంగ్లాదేశ్ అవామీ లీగ్‌ను నిషేధించడం చట్టవిరుద్ధం" అని మాజీ ప్రధాని మండిపడ్డారు.

# ఢిల్లీ కుంభవృష్టి

### దేశరాజధానిని ముంచెత్తిన వాన..
### 200 విమానాలపై ప్రభావం




న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశరాజధానిలో ఆదివారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. చాలా రోడ్లు, అండర్‌పాస్‌లు నీటితో నిండిపోవడంతో..కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. వాతావరణం అనుకూలంగా లేని కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 200 విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా మరో 49 విమానాలను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల సమయాలను సంబంధిత వెబ్‌సైట్లలో చెక్ చేసుకోవాలని సూచించింది.అటు ఎయిరిండియా, ఇండిగో కూడా ప్రయాణికులకు అలర్ట్‌లు పంపించాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించాయి. శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఢిల్లీ నగరాన్ని విమానాశ్రయానికి అనుసంధానించే ప్రధాన అండర్‌పాస్ జలమయమవ్వడంతో డజన్ల కొద్దీ కార్లు, బస్సులు నీటమునిగాయి. రానున్న కొన్ని గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

# మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశం

నేరుగా ఎప్పటికప్పుడు విచారణ వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్టు సమాచారం. కంటిస్టెంట్ లతోపాటు.. మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ నుంచి సైతం పోటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లా మాగీ పాల్గొన్న డిన్నర్‌లో ఎవరెవరు పాల్గొన్నారు, ఆరోజు ఆమెతో కూర్చున్న వారి పేర్లతో పాటు పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.'హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యా' అంటూ మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణపై గౌరవం పెరిగిందని, అతిథ్యం బాగుందని మెచ్చుకుంటూనే మేం పోటీలకు వచ్చామో, దేనికొచ్చామో అర్థం కాలేదు.. ఇవేం పోటీలని పేర్కొన్నారు. ప్రపంచ సుందరి-2025 పోటీల నుంచి అర్థాంతరంగా వైదొలిగిన ఆమె ఇంగ్లాండ్ చేరిన తర్వాత చేసిన ఈ వ్యాఖ్యల్ని బ్రిటిష్ మీడియా ప్రచురించింది. ఈ కథనాలను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో జూలియా మోర్లే ఖండించారు. ఆ వాదనలు నిరాధారమైనవని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సైతం తోసిపుచ్చారు.

# మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలి: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉందన్నారు. తాము మహిళలను గౌరవిస్తామని, వారి వృద్ధికి సమాన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మహిళలకు అవమానం జరిగితే ఈ రాష్ట్రం అంగీకరించదని పేర్కొన్నారు. ఆడపిల్ల తండ్రిగా ఇలాంటి అనుభవాలు జరగకూడదని కోరుకుంటానని చెప్పారు.

# పాక్‌కు గూఢచర్యం..

### రాజస్థాన్‌లో వ్యక్తి అరెస్టు

జైపూర్(జనంసాక్షి):భారత్‌కు సంబంధించిన సున్నిత సమాచారాన్ని దాయాది పాకిస్థాన్‌కు చేరవేస్తున్న వారిని గుర్తించి అరెస్టులు చేస్తున్నారు. తాజాగా పాక్‌కు గూఢచర్యం చేస్తున్నాడనే ఆరోపణలతో రాజస్థాన్‌లో ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు %అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ లోని డీగ్ ప్రాంతానికి చెందిన ఖాసిం (32) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఖాసీం పాక్‌లోని కొంతమందితో ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించారు. ఆ దేశంలో కూడా అతడు పర్యటించినట్లు తెలిసింది. నిందితుడికి సంబంధించిన ఫోన్‌ను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించి.. దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పాక్‌కు గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై ఇప్పటివరకు జ్యోతి మల్హోత్రా సహా పలువురిని పోలీసులు అరెస్టు చేశారు.

# మూడు నెలలకు ముందుగానే రేషన్

- జూన్, జులై, ఆగస్ట్ నెలలకు అవసరమయ్యే రేషన్ సరుకులు
- వర్షాకాలం దృష్ట్యా సర్కార్ ముందస్తు చర్యలు



*హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం మంచి వార్తను అందిస్తోంది. రానున్న వర్షాకాలంలో ప్రజలు తిండికి, రేషన్ సరుకులకు ఇబ్బందులు పడకుండేందుకు ముందుగానే పెద్దసెరిగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించింది. వర్షాకాలంలో సాధారణంగా భారీ వర్షాలు, వరదలు, రవాణా అంతరాయం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జూన్, జులై, ఆగస్ట్ నెలలకు అవసరమయ్యే రేషన్ సరుకులను ముందుగానే ఒకేసారి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.*

ప్రభుత్వం చేసిన ప్రణాళిక ప్రకారం, ఈ మూడు నెలల రేషన్ సరుకుల పంపిణీ మే నెల చివరిలో లేదా జూన్ నెల మొదటి వారం నుంచే ప్రారంభం కానుంది. ఈ చర్యల ద్వారా ప్రజలకు రేషన్ కోసం వర్షాల మధ్య తిరగాల్సిన అవసరం లేకుండా ఉంటుంది. దీనికి అవసరమైన ఏర్పాట్లను పౌర సరఫరా శాఖ ఇప్పటికే ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 89.96 లక్షల రేషన్ కార్డులు ఉండగా, వీటి ద్వారా దాదాపు 2.81 కోట్ల మందికి సబ్సిడీ రేటుతో రేషన్ సరుకులు అందుతున్నాయి. కాగా, 2024 జనవరి 26 తర్వాత ప్రభుత్వం కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులను జారీ చేయడంతో లబ్ధిదారుల సంఖ్య 3.11 కోట్లకు చేరింది.

ఈ భారీ సంఖ్యలోని లబ్ధిదారులకు బియ్యం, పప్పు, నూనె తదితర రేషన్ సరుకులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద స్థాయిలో ధాన్యం సేకరణ చేపట్టింది. ఇప్పటివరకు దాదాపు 24 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించి, మిల్లింగ్ ప్రక్రియ ద్వారా 15-16 లక్షల టన్నుల బియ్యాన్ని సిద్ధం చేశారు. ఇది రాబోయే మూడు నెలల అవసరాలకు సరిపడేలా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రతి జిల్లా కేంద్రంలో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయడం, రవాణా వాహనాల ద్వారా సరుకుల సరఫరా నిర్వహణ, బియ్యం నిల్వల నిర్వహణ, మరియు గ్రామ/పట్టణ స్థాయిలో పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఉన్న 365 రేషన్ షాపుల ద్వారా ఈ పంపిణీ జరగనుంది. రేషన్ పంపిణీలో పారదర్శకత కోసం ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణను తప్పనిసరి చేశారు. అలాగే నకిలీ రేషన్ కార్డులను గుర్తించి రద్దు చేయడానికి స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇది రేషన్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కీలకంగా ఉంటుంది.

ఈ సందర్భంగా ప్రభుత్వం కొత్తగా అర్హులైన కుటుంబాలకు కూడా రేషన్ కార్డుల పంపిణీకి అవకాశం కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు మరియు పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించని కుటుంబాలు రేషన్ కార్డు కోసం అర్హులు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాలకు వలస వచ్చిన పేద కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

అభ్యర్థులు తమ కార్డు స్టేటస్‌ను అధికారిక వెబ్‌సైట్ **https://epds.telangana.gov.in/FoodSecurityAct** ద్వారా లేదా మీసేవా కేంద్రాల ద్వారా తనిఖీ చేసుకోవచ్చు. కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఆదాయ ధ్రువీకరణ పత్రం లేకుండానే మీసేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు.

## మానవత్వం చాటుకున్న మంత్రి సీతక్క



**రేగొండ (జనంసాక్షి) :** సరస్వతీ పుష్కరాల్లో పాల్గొనేందుకు పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి , మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క, భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని చెన్నపురం గ్రామంలో రోడ్ ప్రమాదం జరగ్గా వెంటనే తన వాహనాన్ని ఆపి తన సిబ్బందిని అప్రమత్తమం చేసి అంబులెన్స్ లో బాధితులను ఆస్పత్రికి పంపించారు. ఆటో, బైక్ డికొన్న ఘటనలో పలువురు గాయాల పాలు కాగ, చిన్నారులు షాక్ కు గురయ్యారు. వారిని ఓదార్చడంతో పాటు, ధైర్యం చెప్పి ఆసుపత్రికి తరలించారు మంత్రి సీతక్క. దీంతో మంత్రి సీతక్క మానవ సేవయే మాధవ సేవ అన్న నానుడిని ఆచరించి చూపారనీ అక్కడి ప్రజలు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

## రెండు కార్లు ఢీ: మహిళ మృతి

- పలువురికి గాయాలు..





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ కాటారం, (జనం సాక్షి):** కాటారం సమీపంలో ఎదురెదురుగా రెండు కార్లు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఓ మహిళ మృతి చెందింది. పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, నస్తూరుపల్లి గ్రామాల మధ్య ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొన్నాయి. కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు హైదరాబాద్ నుండి వెళ్తున్న కారు, పుష్కరాలకు వెళ్లి వస్తున్న వరంగల్ పట్టణానికి చెందిన కారు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. కార్లు అతివేగంతో ఢీకొనడంతో హైదరాబాద్ కు చెందిన లలిత (55) అనే మహిళ తీవ్రంగా గాయాల పాలై మృతి చెందింది. డ్రైవర్ మహేందర్ క్యాబిన్లో ఇరుక్కోగా దుర్గాజి కి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు, కాటారం పోలీసులు సహాయక చర్యలో పాల్గొని క్షతగాత్రులను హాస్పిటల్ కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న లలిత వంద పడకల ఆసుపత్రిలోనే మృతి చెందినట్లు, దుర్గాజీ, డ్రైవర్ మహేంద్ర లను వరంగల్ ఎంజీఎం తరలించినట్లు వంద పడకల ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

# తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ బలంగానే ఉంది

- కేసీఆర్ కుటుంబ పంచాయితీ.. రాజకీయంగా వాళ్లకే నష్టం
- కవిత లేకతో కాంగ్రెస్‌కు వచ్చిన నష్టమేమీ లేదు. : జగ్గారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు బీఆర్ఎస్ లో నెలకొన్న కుటుంబ తగాదాలు కొత్త దిశగా మలుపుతీస్తున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో గణనీయమైన చర్చనీయాంశంగా మారాయి. జగ్గారెడ్డి వ్యాఖ్యానిస్తూ, రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ముందంజలో ఉందని, బీఆర్ఎస్ రెండో స్థానంలో, బీజేపీ మూడో స్థానంలో ఉన్నదని పేర్కొన్నారు. అయితే, బీఆర్ఎస్ లో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న కుటుంబ అంతర్గత విభేదాలు పార్టీకి రాజకీయంగా పెద్ద నష్టాన్ని తెచ్చే అవకాశం ఉందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల విడుదల చేసిన లేఖపై స్పందిస్తూ, ఆ లేఖ పార్టీ క్యాడర్‌ను తడబాటు పరిచే అవకాశం ఉందని, ఆ క్యాడర్ బీజేపీ వైపు మొగ్గు చూపే ప్రమాదం ఉందని జగ్గారెడ్డి హెచ్చరించారు. "ఎవరికి వాళ్లు, నేను ఏదో అనకూడదన్న భావన మంచిది కాదు" అని అన్నారు.

"ఎవరూ ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా కేసీఆర్ అంటే కేసీఆర్. ఆయన లేకుండా బీఆర్ఎస్ లేదు. కేటీఆర్, హరీష్ రావు, కవితల వల్ల పార్టీ నడవదు. కవిత స్వతహాగా లీడర్ కాదు" అని జగ్గారెడ్డి మండిపడ్డారు. కవిత తన లేఖతో "ఆ చెట్టును నరికేస్తున్నారు. అదే చెట్టు నీడలోనే తాము జీవిస్తున్నారని గుర్తించుకోవాలి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కవిత లేఖ వల్ల బీజేపీకి బలం చేకూరే అవకాశముందని, ఆమె బహిరంగంగా పార్టీలో విభేదాలు వెలుగులోకి తేవడం ద్వారా ప్రత్యర్థులే లాభపడతారని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. "కవిత రాజకీయ ఆత్మహత్య చేసుకుంటున్నారు. డిప్రెషన్‌లో ఉండి తొందరపడి లేఖ విడుదల చేశారు. ఇలా బీజేపీని పెంచి పోషించే పరిస్థితి సృష్టించకూడదు" అని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు అలెర్ట్ కావాల్సిన సమయం వచ్చిందని జగ్గారెడ్డి హెచ్చరించారు. "లేఖలు, లీకులు మీడియా లైవ్‌ల్లో కనిపిస్తాయి కానీ.. అసలు ప్రభావం లోతుగా ఉంటుంది. బీఆర్ఎస్ తన రాజకీయ ఆత్మహత్య చేసుకుంటూ, బీజేపీని బలోపేతం చేస్తున్నదనే విషయం కాంగ్రెస్ మర్చిపోవద్దు" అని అన్నారు.

# ప్రశాంతంగా గ్రామపాలన అధికారి పరీక్ష

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..
- 187 మంది అభ్యర్థులకు హాజరు..



**వరంగల్ ప్రతి నిధి, మే 25 (జనంసాక్షి):** గ్రామ పాలన అధికారి రాత పరీక్ష 2025 వరంగల్ జిల్లాలో ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఆదివారం వరంగల్ జిల్లాకు సంబంధించి నగరంలోని ఇస్లామియా కళాశాల లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 198 అభ్యర్థులకు గాను 187 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. 12 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్ష నిర్వహించిన ఇస్లామియా కళాశాల జిల్లా కలెక్టర్ సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంతకుముందు రెవెన్యూ శాఖలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్ఏలు గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్షను రాశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారదా దేవి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో సత్య ప్రసాద్, తహసీల్దార్ ఇక్బాల్, చీఫ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

- పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్..





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. భూపాలపల్లి మున్సిపాలిటీలోని 20, 21, 22 వార్డులు హనుమాన్ నగర్, శాంతినగర్, లక్ష్మీనగర్ కాలనీలలో నిర్వహించిన ఈ పాదయాత్రలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూ, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూల మాల వేశారు. అనంతరం అక్కడున్న నాయకులతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యాత్రనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. అదేవిధంగా, హనుమాన్ నగర్, శాంతినగర్, లక్ష్మీపూర్ కాలనీలల్లో యాత్ర మధ్యలో పలువురు కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని అక్కడున్న మున్సిపల్ ఏఈ మానస కు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంకర్ సార్విన్ రెడ్డికి అభినందన

**నిర్మల్ టౌన్, మే 24 (జనంసాక్షి) :** పట్టణంలోని సంస్కార్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న శాలిగిరి శార్విన్ రెడ్డి కి సైనిక్ ప్రవేశ పరీక్ష లో జాతీయస్థాయిలో 213 ర్యాంకు రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించారు.ఈసందర్భంగా సార్విన్ రెడ్డిని శనివారం ప్రిన్సిపల్ అయ్యన్న గారి రచన, కరస్పాండెంట్ అయ్యన గారి శ్రీధర్లు,కుటుంబ సభ్యులు, పూలమాల, శాలువ తో సన్మానించి అభినందించారు.సార్వీన్ రెడ్డిని పాఠశాల విద్యార్థులు స్ఫూర్తి గా తీసుకోవాలని కోరారు.

# 'నీరా కేఫ్' టెండర్లు రద్దు చేయాలి



- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**యాదాద్రి భువనగిరి (జనంసాక్షి) :** తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నీరా కేఫ్‌లను జిల్లాలకు విస్తరించాల్సింది పోయి, పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన దాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పాలని చూస్తున్నారని రాష్ట్ర మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తక్షణమే టెండర్లు రద్దు చేసి, కల్లుగీత కార్పొరేషన్ ద్వారా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీరా కేఫ్, దాని సంబంధిత ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని చూస్తున్నారన్న ఆందోళన నేపథ్యంలో భువనగిరి మాజీ శాసన సభ్యుడు పైళ్ల శేఖర్ రెడ్డి, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్‌లతో కలిసి యాదాద్రి జిల్లా నందనం వద్ద రూ. 7 కోట్లతో నెలకొల్పిన నీరా ఉత్పత్తుల కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సందర్శించారు. కల్లుగీత కార్మికులు, గౌడ్‌ల అభ్యున్నతి కోసం తాము నీరా కేఫ్, నందనం నీరా ఉత్పత్తుల కేంద్రాన్ని నెలకొల్పామని.. నందనం అన్ని హంగులతో పూర్తయినప్పటికీ, ఎన్నికల కోడ్ వల్ల ప్రారంభించలేకపోయామని చెప్పారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరన్నర కాలంగా ప్రారంభించకపోవడంతో యంత్రాలు తుప్పుపడుతున్నాయి ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖా మంత్రి తక్షణమే నందనం కేంద్రాన్ని సందర్శించి, జూన్ 2వ తేదీలోగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గీత కార్మికుడికి సేఫ్టీ మేకప్ ఇవ్వాలని, వైన్ షాపుల్లో గౌడ కులస్తులకు ఇస్తున్న 15 శాతాన్ని 25 శాతానికి పెంచాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కేంద్రం ఒంటెద్దు పోకడలు మానుకోవాలి

- సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి
- ఎర్రగుట్ట ఎన్‌కౌంటర్ పై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి
- రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు వెంటనే జరిగిన నిర్వహించాలి



**చిగురుమామిడి, మే 25 (జనంసాక్షి) :** కేంద్రం అవలంబిస్తున్న ఒంటెద్దు పోకడలను మానుకోవాలని సీపీఐ జాతీయ నేత వెంకట్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై శాంతి చర్చలు జరపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డీ రాజా ప్రభుత్వాన్ని మొట్టమొదటిసారిగా కోరినట్లు తెలిపారు. ఎర్రగుట్ట ఎన్కౌంటర్ పై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ డిమాండ్ చేశారు. జమ్మూ కాశ్మీర్ లో ఉగ్రవాదుల ఏరువేతకు కేంద్రం తీసుకునే చర్యలకు సీపీఐ సమర్థిస్తుందన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజాసంఘాలు, మేధావులు కోరుకున్నప్పటికీ కేంద్రం ఒంటెద్దు పోకడలతో పట్టించుకోవడం లేదన్నారు. అమాయక ఆదివాసులు ఎన్కౌంటర్లో చనిపోతున్నారని చాడ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని అన్నారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలను నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 73, 74 రాజ్యాంగం ద్వారా రావలసిన గ్రామాలకు నిధులు నిలిచిపోయాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే స్వామి, బోయిని అశోక్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, బోయిని పటేల్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

**27, 28న సిపిఐ జిల్లా మహాసభలు..**

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కరీంనగర్ జిల్లా 23 మహాసభలు 27, 28వ తేదీలలో కరీంనగర్లోని మధు గార్డెన్లో నిర్వహించడం జరుగుతుందని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సదాశివ తెలిపారు. మహాసభల కరపత్రాన్ని నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ చివర్గ సభ్యులు కలవేన శంకర్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని నాయకులను కోరారు.

## ప్రజలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



**చింతలమానేపల్లి, మే 25 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని డబ్బా గ్రామంలో ఆదివారం రోజున నిర్వహించిన కోనేరు ఆత్మీయ అభిమానుల సమావేశానికి స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరి కృష్ణ మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప ఈ సమావేశంలో ఆయన చేసిన సేవలను గుర్తుచేస్తూ అభివృద్ధిని ఉద్దేశించి మాట్లాడటం జరిగింది రానున్న రోజులలో కూడా తాను సిర్పూర్ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెల్పారు ఈ సమావేశంలో ఉమ్మడి కౌటల మండల మాజీ వైస్ ఎంపీపీ దుబ్బుల వెంకన్న చింతలమానేపల్లి కో ఆప్షన్ మెంబర్ నాజిమ్ హుస్సేన్ వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# కామ్రేడ్.. నీ కలం కన్నీరు మునీరు



మనిషి సగటు ఆయుర్దాయం పెరుగుతున్నట్టు గణాంకాలు. ఇకపై శతమానం భవతికి మించి ద్విశతమానం భవతి అని దీవెంచే దిశగా పరిశోధనల కబుర్లు. మంచి వాళ్ళే బిరాన దివికేగుతారు..పాపి చిరాయువు అంటారు కొందరు. ఇవన్నీ అటుంచితే, ఐదారు పదుల్లోనే ఆరోగ్యం క్షీణించడం చూస్తున్నాం. జీవన శైలి, పరిసరాలు సహా వాతావరణ ప్రభావం, కుటుంబ నేపథ్యం, వృత్తిపరమైన ఒత్తిళ్లు, రకరకాల రంది కర్ణుడి చావుకు వేయి కారణాలుగా ఏవో కారణాలు మృత్యువును అకాలంగా ముద్దాడిస్తున్నాయి. అంతిమ దేహ యాత్రను అనివార్యం చేస్తున్నాయి. అధునాతనం అంటున్న వైద్య చికిత్సా విధానాలు ఒక్కోసారి నిష్ఫలం అవుతున్నాయి. ఎటొచ్చీ మనిషి ప్రాణం శాశ్వతం కాదన్నది అంగీకరింపజేస్తున్నాయి. అయితే ఇంకా చాలా బతకాల్సినంత వ్యవధి ఉండగానే మధ్యలో తనువు చాలించడమే ఎంతో దుఃఖమయం చేస్తున్నాయి. హృదయాలను బరువెక్కిస్తున్నాయి.

జనంసాక్షి

సీనియర్ జర్నలిస్టు కామ్రేడ్ ఎం.డి. మునీర్ ఆరు పదుల ప్రాయంలోనే జీవితాన్ని ముగించే దాకా మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ (రెండు లేదా అంతకంటే ఎక్కువ అవయవాల వైఫల్యం) వదల్లేదు. తుదికంటా ప్రయత్నాలనూ మన్నించలేదు. కుటుంబీకులు, బంధుమిత్రులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, భావసారూప్యులు, రాష్ట్ర ప్రభుత్వం తరపున సంబంధిత శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర యువ నేత కేటీఆర్, జర్నలిస్టు సంఘాల దిగ్గజాలు కలం వీరుడు కామ్రేడ్ మునీర్ కొలుకోవాలని శతథా తపించారు. వ్యక్తికైనా, వ్యవస్థకైనా నూటికి నూరు శాతం అనుకూల ఏకాభిప్రాయం సొంతం కానేకాదు. అయితే ఆపదలో ఉన్నప్పుడు ఎందరు ఆత్మీయులు అన్నదాన్ని బట్టి మన జీవన సాఫల్యాన్ని, పరమార్థాన్ని చూడొచ్చు. తన కండిషన్ విషమంగా ఉందని తెలిసినప్పుడే మంచిర్యాల మొదలు మహానగరం దాకా వివిధ రంగాలకు చెందిన అనేక మంది గుండె తడితో చిన్నబోయారు. తన యోగక్షేమాలను గాఢంగా కోరుకున్నారు. త్వరగా నయం కావాలని ఎవరికి తోచిన విధంగా వారు ప్రార్థించారు. ఇక తాను శాశ్వతంగా సెలవు తీసుకున్నారనే దుర్వార్త విని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

సింగరేణి కొలువుకంటే తననే గొప్పగా ఆరాధించారని అవిశ్రాంత కలమూ కన్నీరు "మునీరు" అవుతోంది. అనారోగ్యం మీద పడినా, సంక్లిష్ట చికిత్సకు చివరి రోజు దాకా సమాజం పట్ల తన నిబద్ధతకు కొనసాగింపుగా ఆర్టికల్స్ ఇచ్చారు మునీర్. తన జీవన సార్థకతకు ఈ కొన్ని చాలు చిహ్నంగా, తార్కాణంగా. దేహానికి ఆఖరు తేదీ ఉంటుంది కానీ, అక్షరానికి ఉండదు. అదిగో క్షయం లేని ఆ అక్షరాల్లోనే మన మునీర్ భాయ్ కలకాలం సజీవం. పాత్రికేయమే లోకంగా దిల్ సే నా అక్షర నివాళి.

**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు**
**హైదరాబాద్, 9440850384**

# తలవాల్చిన ఉద్యమ శిఖరం

**దుఃఖ సాగరంలో కోల్ బెల్ట్**

**సీనియర్ జర్నలిస్ట్, కోల్ బెల్ట్ ఉద్యమ శిఖరం మహమ్మద్ మునీర్ తన కలాన్ని, గలాన్ని ప్రజల కోసం అంకితం చేసిన ధన్యజీవి. వామపక్ష భావజాలం కలిగి, కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా బీదలు, రైతులు, విద్యార్థి, యువజన సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు శ్లాఘనీయం. సింగరేణి గని కార్మికుల చిరునవ్వుగా మెరిసిన వాడు, నల్ల సూర్యుల కష్టాలను కోల్ బెల్ట్ ప్రజల కన్నీరు, ఆదివాసీలు, అన్నల జీవనాన్ని అక్షరబద్ధం చేసి జర్నలిస్టుగా మునీర్ నిలిచాడు. 14 డిసెంబర్ 1959 లో జన్మించిన మునీర్ తన ప్రస్థానం ముగించుకుని,ఆదివారం నల్ల నేల నుండి ఎర్ర సూర్యుడు మాయమయ్యాడు.**

మునీర్ పైన ఆయన తల్లి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆయన పలకరింపు, సమస్యను అర్థం చేసుకునే దృష్టి కోణం, బాధితుల ఎడల ప్రేమగా మెదిలే తీరు ఇందుకు నిదర్శనం. విద్యార్థి దశ నుంచి ప్రశ్నించడం నేర్చుకున్న వాడు నమ్మిన ఆశయానికి, ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేసే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా మునీర్ కు గుర్తింపు ఉంది. సినిమా హీరో దారా సింగ్ ను మునీర్ ఎక్కువగా అభిమానించేవాడు. ఆయనలాగా కండలు పెంచడం, హీరో లాగా ఫైటింగ్ చేయాలని బాక్సింగ్ నేర్చుకున్నాడు. పదవ తరగతి చదివే రోజుల్లోనే మందమర్రిలో జరిగిన ఓ గని ప్రమాదంలో కార్మికుడు గాయపడ్డాడు. బాధితుడిని బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్ కు లారీలో తరలిస్తుండగా, ఈయన వారి వెంట వెళ్లాడు. రోగికి అవసరమైన రక్తాన్ని దానం చేసింది మునీర్ కావడం గమనించాలి.

కార్మిక నాయకుడిగా పనిచేసిన వి.టి అబ్రహం సహచర్యంతో మునీర్ ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులు, ప్రజల ఎడల ప్రవర్తించాల్సిన తీరు తెన్నులను నేర్చుకున్నాడు. ఆంగ్ల భాష పై పట్టు రావడానికి కూడా అబ్రహం ఒక కారణం. మందమర్రి లోని పాఠశాలలు, మంచిర్యాల కాలేజీలో సీట్ల పెంపు,ఫీజుల తగ్గింపు, పెరిగిన ధరల అదుపు కోసం పలు పోరాటాలు నిర్వహించాడు. మందమర్రి పట్టణంలో సౌకర్యాల మెరుగు, ఉపాధి అవకాశాల కల్పన కోసం, తాగు, సాగునీటి కోసం ఆయన సిపిఐ అనుబంధ ఏఐఎస్ఎఫ్, ఏఐ వైఎఫ్ నాయకుడిగా అనేక పోరాటాలను నిర్వహించాడు. ప్రభుత్వ అధికారులను ప్రశ్నించడం, ధర్నా, ర్యాలీ, రాస్తారోకో లాంటివి నిర్వహించడంతో ఆయనపై అనేక పోలీస్ కేసులు, లాఠీ దెబ్బలను రుచి చూశాడు, కోర్టుల చుట్టూ తిరిగాడు. మునీర్ చిన్ననాటి నుండి తెలంగాణ వాదిగానే ఉన్నాడు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన మందమర్రిలో జరిగిన ఒక బహిరంగ సభ వేదిక ఎక్కి జై తెలంగాణ అంటూ నినదించడం విశేషం.

ప్రజా కంటకుడిగా ముద్రపడిన, మందమర్రి భూస్వామి హత్య కేసును ఎదుర్కొని జైలు శిక్ష అనుభవించాడు. కింది కోర్టు దోషిగా తేల్చింది. హైకోర్టులో ప్రముఖ న్యాయవాదులు కన్నాబిరాన్, సి. పద్మనాభరెడ్డిలు వాదించి మునీర్ నిర్దోషిత్వాన్ని నిరూపించారు. వరంగల్ కేంద్ర కారాగారం నుంచి బయటకు వచ్చిన అనంతరం ఆయన కొత్త జీవితాన్ని ప్రారంభించాడు. 1985లో ఈనాడు విలేఖరిగా మునీర్ తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అయితే కొద్ది కాలానికే యాజమాన్యం ఆయన వార్తలు ప్రచురించడం నిలిపివేసింది. ఆంధ్రజ్యోతి మునీర్ ను అక్కున చేర్చుకుంది. అప్పటినుండి ఇప్పటిదాకా ఆయన ఆంధ్రజ్యోతి మునీర్ గానే రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాడు.

అనేక మానవీయ కథనాలు, సంచలన వార్తలు, ప్రత్యేక కథనాలు,అవినీతిని బట్టబయలు చేసే వార్తలు రాసి తప్పు చేసేవారికి కొరకరాని కొయ్యగా నిలిచాడు.

గని కార్మికుడిగా పనిచేస్తూ ఉండటంవల్ల కార్మికుల కష్టాలను, సింగరేణి బాయి దొరల దౌర్జన్యాలను పాఠకుడికి కళ్ళకు కట్టినట్టు చూపించేవాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గోండు గుడాల గురించి, ఆదివాసి ప్రజల జీవనం గురించి, అడవి బతుకులపై ఎన్నో వరుస కథనాలు రాసి ప్రభుత్వ, ప్రజల దృష్టిని ఆకర్షించేలా చేశాడు.

ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమం బలపడుతున్న కాలములో ఉద్యమ వార్తలు, ఎన్ కౌంటర్లు,ఏకపక్ష కాల్పులు, భౌతిక దాడులు, రాజకీయ హత్యలపై మునీర్ అందించే కథనాల కోసం పాఠకులు, అధికార యంత్రాంగం ఎదురుచూసేవారు. కోల్ కోల్ బెల్ట్ ఏరియా లో మనుషులు మాయమవడం గతంలో సర్వసాధారణం. పోలీసులే ఎత్తుకెళ్లారని బాధితుల బంధువులు పేర్కొనడం మాకేం తెలియదని పోలీసులు పేర్కొనడం జరిగేది. తర్వాత రోజుల్లో వీరే ఎదురు కాల్పుల్లో మరణించినట్టు ఎక్కడో ఒక దగ్గర నుంచి వార్తలు వచ్చేవి. విపత్కర, భయానక పరిస్థితులలో బాధిత కుటుంబాల మాటలకు విలువనిచ్చి, పోలీస్ అధికారులతో సంప్రదించి వార్తలు రాసేవారు మునీర్. వార్త పత్రికలో ప్రచురించటం వలన ప్రాణాలు దక్కాయని కొంతమంది ఇప్పటికీ చర్చించుకోవడం కోల్ బెల్ట్ లో కనిపిస్తుంది. పత్రికలలో వచ్చే నక్సలైట్ నాయకుల ప్రకటనలు, ఇంటర్వ్యూల పై పోలీసులు కన్నెర్ర చేసేవారు. నక్సలైట్లు లేరు, రాడికల్స్ లేరు అంతా మునీర్ సృష్టేనని కొంతమంది పోలీసులు ఆయనపై కక్షగట్టిన సంఘటనలు ఉన్నాయి. నికార్సైన జర్నలిస్టుగా పూర్తి బాధ్యతలు నిర్వర్తించడం వలన, రాజకీయ నాయకుల బెదిరింపులు, గుండాల దాడులను మునీర్ తరచుగా ఎదుర్కోవాల్సి వచ్చేది. ఎన్ని వత్తులు ఎదురైన ప్రజల పక్షాన తన కలాన్ని నిలబెట్టాడు.






ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం కొనసాగిన ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఏర్పాటు ఒక మైలురాయి వంటిది.తెలంగాణ జర్నలిస్టుల కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ హెచ్ - 143 ఏర్పాటులో అత్యంత కీలకంగా మునీర్ పనిచేశాడు. తెలంగాణ ఉద్యమ వ్యాప్తికి గల్లీ నుంచి ఢిల్లీ దాకా జరిగిన అన్ని పోరాటాలలో కీలకంగా పని చేశారు. రాజకీయ పార్టీలను, ఉద్యమకారులను సమన్వయ పరచడం,పోరాటంలో ప్రజల్ని భాగస్వామ్యం చేయడంలో ఆయన సింగరేణి వ్యాప్తంగా ముఖ్య భూమిక పోషించారు. తెలంగాణ కల సాకారానికి సువర్ణాక్షరాలలో లిఖించదగిన పోరాటం సకల జనుల సమ్మె.ఆ సమ్మెలో సింగరేణి కార్మికులది అద్వితీయమైన చారిత్రాత్మకమైన భాగస్వామ్యం. దీనికి నాయకత్వం వహించింది సింగరేణి జేఏసీ చైర్మన్ గా మునీర్ కావటంతో చరిత్రలో నిలిచిపోయాడు.

జర్నలిస్టుగా నిప్పులాంటి నిజాలు వార్తలుగా రాయడం వల్ల కార్మికుల నుంచి మునీర్ జేజేలు అందుకున్నాడు. కానీ కొందరు కార్మిక నాయకులకు, యాజమాన్యానికి ఇతని వైఖరి మింగుడు పడలేదు. మునీర్ పైన బదిలీ వేటు వేసిన ఆయన భయపడలేదు. దీంతో ఆయనను ఉద్యోగం నుంచి తొలగించాలని కుట్ర జరిగింది. అందులో భాగంగా ఉద్యోగమా లేక జర్నలిస్టు జీవితమా తేల్చుకోవాలని ఆయన మెడపై కత్తి పెట్టారు. ఆర్థికంగా నష్టపోతానని తెలిసినా, నమ్మిన ఆశయం కోసం, ప్రజల పక్షాన నిలవడం కోసం, ఆయన జర్నలిస్టు వృత్తినే స్వీకరించాడు. సింగరేణిలో ఎనిమిది సంవత్సరాల సర్వీసు మిగిలి ఉండగానే రాజీనామా చేశారు.

వయసు రిత్యా ఆంధ్రజ్యోతిలో జర్నలిస్టుగా పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన రాష్ట్రంలోని జనం సాక్షి వెలుగు ఆంధ్రజ్యోతి సాక్షి నమస్తే తెలంగాణ ప్రతిపక్షం తొలి వెలుగు లాంటి పలు తెలుగు దినపత్రికలకు కాలమిస్టుగా విస్తృతంగా వార్తా కథనాలను అందించాడు. నిత్య విద్యార్థిగా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ ప్రధాన పత్రికలకు దీటుగా ఆయన వార్తా కథనాలను రాశాడు.ఆయన కథనాల కోసం పత్రిక చిన్నదైనా, పెద్దదైన పాఠకులు ఎదురుచూసేవారు. ఆయన మిత్రులు, బంధువులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి, రాజకీయ పార్టీ నాయకులు, విప్లవ సంస్థలు, వామపక్ష పార్టీల నాయకులు, జర్నలిస్ట్ సంఘాలు, జర్నలిస్టులు, కార్మికులు, కార్మిక నాయకులు పెద్ద సంఖ్యలో మంచిర్యాలలో ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి, మందమర్రి వరకు జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

**మాదాసి రామమూర్తి,**
**సీనియర్ జర్నలిస్ట్**

# మునీర్‌కు ప్రజలే వార్తలు - ప్రజలే జీవితం

'NEWS IS PEOPLE. PEOPLE ARE MY LIFE" ఈ కొటేషన్ సీనియర్ జర్నలిస్ట్ ఎం. డి. మునీర్ వాడే ద్విచక్ర వాహనం వెనుక నంబర్ ప్లేట్‌పై రాసి ఉంటుంది. ఆయన జీవితాంతం ఆ కొటేషన్ లోని నిబద్ధతను పాటించాడు. సింగరేణి బొగ్గుగానులు. అందులో పనిచేసే మసీబారిన కార్మికులు. వారి ఆరాటాలు, పోరాటాలు, ప్రమాదాలు, ప్రమోదాలు నాలుగు దశాబ్దాల పాటు విరామమేరుగక అక్షరీకరించిన, వార్తలు మలిచిన విలేకరి ఎం. డి. మునీర్.

జనంసాక్షి

భారత కమ్యూనిస్ట్ పార్టీలో యువజన నాయకునిగా మునీర్ తొలి యవ్వనం లో ఉండేవాడు. ఆ సమయంలో మందమర్రిలో లోడింగ్ బొగ్గులోడింగ్ కార్మికుల తిరుగుబాటు పర్యవసానంగా మందమర్రికి చెందిన భూస్వామి, ఆంధ్ర ప్రదేశ్ కాలరీస్ మాజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు శ్రీపతీరావు హత్య 1980 లో జరిగింది. అనంతరం మునీర్ అయిదు సంవత్స రాలు జైలు జీవితం గడిపి విడుదలయ్యాడు. అనంతరం ఆ పార్టీ జీవితానికి స్వస్తి పలికి విలేకరి జీవితాన్ని ప్రారంభించాడు. 1985 సంవత్సరం లో ఆయన తొలిసారి ఆంధ్ర పత్రిక విలేకరిగా వార్త వృత్తి జీవితాన్ని ప్రారంభించాడు. అట్లా మొదలయిన ప్రస్థానం ఆంధ్రప్రభ, ఈనాడు, ఆంధ్ర జ్యోతి, నమస్తే తెలంగానా పత్రికల్లో అప్రతిహతంగా కొనసాగింది. నాలుగు దశబ్దాలా ఆసిధారా వ్రతంలో ఎన్నడూ అతని వార్త వాడి తగ్గలేదు.ఆయన జర్నలిజం కోర్సులు చేయలేదు. విద్యార్థి దశలో ఉద్యమాల వల్ల చదువూ అంతంతమాత్రంగానే కొనసాగింది. అయినా ఇవేవే అతని వార్త రచనకు ఆటంకం కాలేదు. ఒక్కొక్క రోజు మెయిన్, జిల్లా పేజీల్లో ఆయన రాసిన వార్తలు ఇరవై, ఇరవై అయిదు వచ్చేవి. ఆయన న్యూస్ కంట్రిబ్యూటర్‌గా ఉన్న సమయంలో డేట్లైన్ సరిహద్దులు చెరిపేసి వంద కిలోమీటర్ల దూరం వెళ్లి కూడా స్కూప్ ఐటమ్స్ సేకరించి రాసేవాడు. కాగజ్ నగర్ సర్ సిల్క్ కార్మికుల ఆకలి చావులు మొదలుకుని గోదావరి రామగుండం సమీపంలో లోని అంతర్గామ్ మిల్లు మూసివేత గురించి వార్తలు రాసాడు.ఆర్.సి.ఇంచార్జిగా, స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేసినప్పుడు ఆయన వార్తలకు ఎల్లలు లేవు.



వార్త విలేకరిగా జీవితం ప్రారంభించినప్పుడు తెలంగాణ పల్లెలు, సింగరేణి గనులు, ఆదిలాబాద్ అడవులు నిర్భందా కల్లోలం బారినపడ్డాయి. ఆ సమయం లో వార్తలు రాయడం కట్టి మీద సాము లాంటిది. గులాం రసూల్ ను భూటకపు ఎంకౌంటర్లో చంపింది ఆ కాలం లోనే. అయినా వెరవలేదు. దేవాపూర్ సమీపంలోని మద్దిమడలో గిరిజనులపై జరిపిన కాల్పుల సంఘటనను అత్యంత ధైర్యం సాహసాలతో బయటపెట్టాడు. మందమర్రి మండలం మామిడి గట్టు చంద్రా రెడ్డి లాకప్ డెత్ బయటపెట్టిండు. సికాస కార్యదర్శి రమకాంత్ ఉన్న ఇంటిని చుట్టు ముట్టి పెట్రోల్ పోసి కాల్చి చంపితే అతని వీరోచిత పోరాటం పై మునీర్ "అతడే హీరో " అని వార్త రాసినాడు. ఈ వార్త సంచలనం కావడం తో పోలీస్ ఎస్.పి. ఈ వార్తపై ప్రెస్‌మీట్ పెట్టి మరీ అసహనం వెళ్ళగక్కాడు. నక్షలైట్లే దేశభక్తులని పొగిడి అధి కారంలోకి వచ్చిన ఎన్టీఆర్ కాలంలో నక్షలైట్లను మాయం చేసి చంపే దుర్మారగా ఒరవడి కి శ్రీకారం చుట్టినారు. ఈ మిస్సింగ్ లపై పౌర హక్కుల సంఘాల ఆందోళన నేపథ్యంలో విచారణ కోసం జస్టిస్ టీ.ఎల్.ఎన్. రెడ్డి కమీషన్ వేశారు. మందమర్రి, బెల్లం పల్లి లో కలవాలని సారయ్య, ఫాల్గుణ ను పోలీసులు మాయంచేసి చంపిన పుడు ఆ వివరాలను సాక్ష్యధారా లతో సేకరించి కమీషన్ కు రిపోర్ట్ సమర్పించారు. 1990 దశకం లో జరిగిన ప్రతీ భూటకపు ఎంకౌంటర్ జరిగిన ప్రాంతాలకు డాక్టర్ బాల గోపాల్‌తో వెళ్లి నిగ్గుతేల్చేవాడు. సింగరేణిలో పలు కుంభకోనాలపై వార్తలు రాసినాడు. ఫలితంగా సింగరేణి ఉద్యోగిగా యజమాన్యం వేధింపులనూ అనుభవించాడు. ఎల్లంపల్లి రిజర్వాయర్ నిర్మాణం లో వందల కోట్ల క్రస్ట్ గేట్ల కుంభకోణం వెలికితీసాడు.

సింగరేణి కార్మికుల వేతనాల పెంపుదలకై జరిగిన సమ్మెలు, గనుల్లో, కార్మిక వాడల్లో సౌకర్యాల కోసం జరిగిన ఆందోళనలకు వార్త రూపం ఇవ్వడమే కాదు.. ఆ ఉద్యమాలల్లో పాల్గొన్నాడు. అందుకే ఒక కార్మిక నేత"సికాస " కార్యదర్శి రమకాంత్ మరెవరో కాదు మునీరే "అని అక్కసు, అసహనం వెళ్ళగాక్కాడు. ఈ వ్యాఖ్యానం అతని వార్తల వాడిని, ధాటిని తెలియజేస్తుంది. 40ఏళ్లుగా అతని వార్తలు, వ్యాఖ్యలు, రాతలు మరణ శయ్య పై ఉంది కూడా కొనసాగించాడు. చివరి వరకూ ప్రజల మధ్య, ప్రజల కోసం నిలబడ్డవాడు. ఐసియులో చావుతో పోరాడుతూ కూడా స్నేహితులను తల్చుకుంటూ జనంసాక్షిలో రాసిన వ్యాసం ఆయనలోని మానవీయ విలువలకు అద్దం పడుతుంది. మునీర్ 69 ఏళ్ళలో ఊహ తెల్సిన కాన్నుంచి ప్రజల కోసం బతికాడు. ఆయన లాగాఆయన సహచరులు, అనుచరులు ప్రజల కోసం బతకడమే ఆయనకిచ్చే నివాళి.

**హెచ్. రవీందర్**
**9912233533**

# కలంతో వెలుగునిచ్చిన మహనీయుడు మునీర్

సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై లోతైన విశ్లేషణతో ప్రజలలో చైతన్యాన్ని కలిగించిన ప్రముఖ జర్నలిస్టు మునీర్ మీడియా రంగంలో తనదైన ముద్రవేసిన మహానుభావుడు. ఆయన రచనల్లో మానవీయత, నిజాయితీ, ప్రజల పట్ల నిబద్ధత ప్రతిబింబిస్తాయి. గ్రామీణ జీవనశైలి నుంచి ప్రపంచ రాజకీయాల వరకు విస్తారమైన పరిజ్ఞానంతో సమాజాన్ని అభివృద్ధిపథంలో నడిపించే మార్గాలను తన రచనల ద్వారా చూపించారు.సింగరేణి అంటే బొగ్గు గనులు, కష్టజీవుల జీవితాలు, మట్టిలోంచి పుట్టిన బతుకులు. ఈ మట్టి మనుషుల ఆశలు, ఆశయాలు, కష్టాలు, సంతోషాలు, స్థానిక సమస్యల నుంచి ప్రపంచ పరిణామాల వరకు ప్రతి అంశాన్ని తన కలం ద్వారా ప్రజలకు చేరవేసిన గొప్ప జర్నలిస్ట్ మునీర్. కేవలం వార్తలు రాయడమే కాదు, వాస్తవాలను తన కలంతో ప్రజల ముందుంచిన కలం యోధుడు. సామాజిక-ఆర్థిక-రాజకీయ విశ్లేషణలతో, సింగరేణి ప్రజల జీవితాలతో ముడిపడిన అనేక వ్యాసాలతో ఆయన అక్షర ప్రస్థానం ఒక మహోన్నత అధ్యాయం.మునీర్ కలం సింగరేణిపై ప్రత్యేకమైన ప్రేమను చూపింది. సింగరేణి కార్మికుల శ్రమను, వారి త్యాగాలను, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ఆయన తన రచనల్లో కళ్లకు కట్టినట్లు వర్ణించారు. కార్మికుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన గొంతుకగా ఆయన నిలిచారు. వారి జీవితాల్లో వస్తున్న మార్పులను, సింగరేణి అభివృద్ధిని, ఆ ప్రాంత సామాజిక స్థితిగతులను నిశితంగా పరిశీలిస్తూ విలువైన వ్యాసాలు రాశారు. గ్రామస్థాయి నుంచి మొదలుకొని అంతర్జాతీయ పరిణామాల వరకు, సామాజిక మార్పుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.జర్నలిజం అంటే కేవలం వార్తలు చెప్పడం కాదని, సమాజాన్ని విశ్లేషించి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడమని మునీర్ నమ్మారు. అందుకే ఆయన వ్యాసాల్లో సామాజిక అంశాలకు పెద్ద పీట వేశారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా, మానవీయ కోణంలో సమస్యలను విశ్లేషించారు. సమాజంలో అట్టడుగున ఉన్నవారి గొంతుకగా మారారు. ఆర్థిక అసమానతలు, రాజకీయ పోకడలు, సాంస్కృతిక మార్పులపై ఆయన చేసిన విశ్లేషణలు ఆలోచింపజేసేవిగా ఉండేవి.మునీర్ కేవలం ఒక జర్నలిస్ట్ మాత్రమే కాదు, ఒక సామాజిక కార్యకర్త, ఒక విద్యావేత్త. తన కలం ద్వారా ఆయన వెలుగును పంచారు. అజ్ఞానపు చీకట్లను తొలగించి, ప్రజల్లో అవగాహన, విజ్ఞానం పెంచడానికి కృషి చేశారు. సింగరేణి ప్రాంతంలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా సామాజిక స్పృహను పెంపొందించడంలో ఆయన చేసిన సేవలు అనన్యసామాన్యం. ఆయన రచనలు భావి తరాలకు స్ఫూర్తినిస్తాయి. సమాజానికి అంకితమైన ఒక జర్నలిస్ట్ ఎలా ఉండాలో మునీర్ ఆచరణలో చూపారు. వారి సేవలు అజరామరం. ఆయన కలం సామాజిక మార్పును ఊహించే ఆయుధంలా పనిచేసింది. ఆయన విశ్లేషణలు ఎప్పుడూ వాస్తవాలను ఆధారంగా చేసుకుని, విశ్వసనీయతతో నిండి ఉంటాయి. దేశ రాజకీయాలు, ఆర్థిక విధానాలు, అంతర్జాతీయ వ్యవహారాలపై కూడా ఆయన వ్యాసాలు ప్రజలకు స్పష్టమైన దిశను సూచించాయి.



జనంసాక్షి

మునీర్ గారు కేవలం ఒక జర్నలిస్టే కాదు, సమాజంపై తన కలంతో ప్రభావం చూపిన విజ్ఞానవేత్త. ఆయన రచనలు అనేక మంది యువ జర్నలిస్టులకు ప్రేరణగా నిలుస్తున్నాయి. ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా రచన చేసిన ఈ మేధావి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. అనునిత్యం ప్రజల మనస్సాక్షిని తన కలంతో జనం సాక్షితో చాలా రూపంలో పంచుకున్న మహనీయుని కోల్పోవడం చాలా బాధాకరంగా ఉంది అతను ఆత్మకు శాంతి కలగాలని ఆశిస్తూ. మీ కలం బలం నీ ఆశీస్సులు నేటి యువరాజకులపై ఉండాలని ఆశిస్తున్నాము.



**కవి సాహితీ విశ్లేషకులు**
**డా. పూసపాటి వేదాద్రి**
**9912197694**

# అడుగేయ్ ముందుకు

భయమెందుకు?
అడుగేయ్ ముందుకు
కష్టాలు కలకాలం ఉంటాయా
కరిగిపోవూ...
మన కాయకష్టం ముందు

భయమెందుకు ?
అడుగేయ్ ముందుకు
పేదరికం ఎల్లకాలం ఉంటుందా
పారిపోదూ..
మన ఆకలి పోరాటం ముందు

భయమెందుకు?
అడుగేయ్ ముందుకు
కన్నీళ్ళు నిత్యం ఉంటుందా
ఆగిపోవూ....
మన ఆత్మస్థయిర్యం ముందు

భయపడుతూ బ్రతికేస్తే
తాడు పామే కాదు
శ్వాస కూడా విషమౌతుంది

అందుకే..
భయమెందుకు ?
అడుగేయ్ ముందుకు



అవరోధాలను అధిగమిస్తూ...

**కయ్యూరు బాలసుబ్రమణ్యం**
**7780277240 ,శ్రీకాళహస్తి**

జనంసాక్షి

# సాఫ్ట్‌వేర్ కోర్సులకు సిద్ధమా..?

## తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆమోదించిన ఏఐ, డేటా సైన్స్, బిగ్ డేటా కోర్సులతో పాటు 100కిపైగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనుంది. శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ప్రోగ్రామ్ ఇంటర్ పాస్, ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ స్కిల్ అకాడమీ విద్యార్థులు సరికొత్త సాఫ్ట్వేర్ టెక్నాలజీలలో తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తోంది. దరఖాస్తుదారులు 100కి పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల నుండి ఏదైనా కోర్సు ఎంపిక చేసుకోవచ్చు. సైబర్ సెక్యూరిటీ, ఏఐ డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, మెషిన్ లెర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్ ఉన్నాయి. అదనపు కోర్సులలో ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చెయిన్, డీప్ లెర్నింగ్, సెలీనియం, సేల్స్‌ఫోర్స్, జావా, ఒరాకిల్, సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వెబ్ డిజైన్ కోర్సులతో పాటు 100కి పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల నుండి ఏదైనా కోర్సు ఎంపిక చేసుకోవచ్చు. కోర్సులు ఈ-లెర్నింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ అందించబ డుతుంది. తర్వాత పరీక్షలను నిర్వహిస్తారు. పాస్ అయిన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఆమోదించిన సర్టిఫికేట్‌ను అందుకుంటారు. కోర్సు వ్యవధి 2 నెలల నుండి 6 నెలల వరకు ఉంటుంది. సబ్జెక్ట్‌లో ఇన్‌డెప్త్ నాలెడ్జ్ పొందేందుకు విద్యార్థులకు ఇది చక్కటి అవకాశంగా నిలుస్తోంది. అప్లికేషన్ సమాచారం ఆసక్తి గల అభ్యర్థులు www.nationalskillacademy.inలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు ఫోన్ 9505800050



జనంసాక్షి

**వెంకట రెడ్డి**
**డైరెక్టర్, నేషనల్ స్కిల్ అకాడమీ**

# 16 ఏళ్లకు..ముందుగానే తొలకరి పలకరింపు...

- వారం రోజుల్లో విస్తారంగా వర్షాలు
- రోహిణి కార్తి ప్రారంభంతో ముమ్మరంగా వ్యవసాయ పనులు
- చల్లబడిన వాతావరణం భూమిలో పెరిగిన తేమ
- విత్తనాలు నాటేందుకు సర్వం సిద్ధం



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 25 (జనం సాక్షి) :** ఏరు ముందా... ఏరువాక ముందా. అన్నట్లు ఒక సామెత వాడుకలో ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏరే ముందరన్నట్లు కనిపిస్తుంది. ఏరువాక తర్వాత అన్నట్లుంది. పదహారేళ్ల తర్వాత తొలకరి చినుకులు నైరుతి పవనాల కంటే వారం రోజుల ముందే రైతులను పలకరించనున్నాయి. తొలకరి పలకరింపు రైతుకు తోడైతే రోహిణి కార్తి ప్రారంభమైంది. రోనిలో వేసిన పంట.. రోకళ్ళకు దంగదు అనే సామెత వాడుకలో ఉంది. ఈసారి అదే నిజం అనిపిస్తుంది. సకాలంలో అన్ని సమకూరుతే ఈ ఏడాది రైతులు మొదటి సీజన్ లోనే నాణ్యమైన దిగుబడి పంటలను పండించే అవకాశం ఉంది. ఈసారి మృగశిర కార్తి జూన్ 7న వస్తే ఏరువాక పౌర్ణమి ఈనెల 11న రానున్నది. వివరాల్లోకి వెళితే... వర్షాలు ఎప్పుడో ఎప్పుడో ఎదురుచూసే దిగులు రైతులకు ఈసారి తీరనున్నది. 16 ఏళ్ల తర్వాత మొదటిసారిగా వర్షాలు వారం రోజులు ముందు రానున్నాయి. బంగాళాఖాతం అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జూన్ ఒకటో తేదీ తర్వాత విస్తారంగా వర్షాలు కురువనున్నాయి. ప్రతి ఏడాది నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి రెండో వారంలో తీరం దాటేవి. కానీ ఈ ఏడాది కేరళ రాష్ట్రానికి నైరుతి పవనాలు ముందుగానే తాకిన కారణంగా అక్కడి రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దానికి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తోడు కావడంతో రుతుపవనాల కదలికలో వేగం పెరిగిన కారణంగా ఈనెల 26 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. అల్పపీడనం రుతుపవనాల కదలిక వేగం కారణంగా జూన్ 1 నుంచి రాష్ట్రంలో నైరుతి పవనాలు తాకే అవకాశం ఉన్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలియజేసింది. 2009లో నైరుతి రుతుపవనాలు మే 30న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోకి ప్రవేశించగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా నైరుతి రుతుపవనాలు వారం రోజుల ముందుగానే కేరళ రాష్ట్రంలోకి ప్రవేశించాయి దీంతో విస్తారంగా వర్షాలు కురిసే నేపథ్యంలో రైతులు వ్యవసాయ పొలాల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మే నెలలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా వాతావరణం చల్లబడింది. వాస్తవంగా మే నెలలో రోహిణి కార్తి ప్రారంభమవుతుంది. ఇదే నెలలో ఎండలు మెండుగా ఉంటాయి. రోహిణి కార్తిలో రైతులు విత్తనాలు నాటేందుకు సుముఖంగా ఉండరు. కొందరు రైతులు రోహిణి కార్తిలో మంచి నువ్వు. కొర్రల విత్తనాలను మాత్రమే వేస్తారు. రోహిణి కార్తికంటే ముందే అకాల వర్షాలు. రుతుపవనాల రాక కారణంగా వర్షాలు కురిసి భూమి చెలబడింది. దీంతో రైతులు రోహిణి కార్తిలోనే విత్తనాలు వేయడానికి వ్యవసాయ పొలాల్లో నిమగ్నమయ్యారు. విత్తనాలు వేయడానికి అనుకూలంగా భూములను సాగు చేస్తున్నారు. రైతుకు ఏడాది రెండు పండుగలు ముందుగానే పలకరిస్తున్నాయి. రోహిణి కార్తిలో తొలకరి వర్షాల పలకరింపు అయితే జూన్ నెలలో మృగశిర కార్తి ప్రారంభం ఏరువాక పౌర్ణమి రావడంతో రైతులు ఈ పర్వదినాల్లో పండగలు నిర్వహించుకుంటారు. ఏరువాక పౌర్ణమి కి పాడి పశువులను శుభ్రంగా కడిగి రంగురంగులతో వాటిని అందంగా తీర్చిదిద్ది ఎద్దుల బండి పై ఊర్లలో ఊరేగిస్తారు. ఎద్దులకు ఇష్టమైన పిండి వంటకాలను తినిపిస్తారు. వ్యవసాయ పనిముట్లను మరమ్మత్తు చేసుకొని భూమిలో తొలి విత్తనాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తారు. దీంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంటుంది. కానీ రైతు భరోసా కోసం. బ్యాంకుల్లో అప్పు పుట్టక. ప్రైవేట్ అప్పుల కోసం రైతన్న ఎదురుచూపు ఎప్పటికీ తప్పలేదు. ముందుగానే వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులందరికీ సకాలంలో రైతు భరోసా రైతు ఖాతాలో జమ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం...

## ఉద్యమకారులను విస్మరిస్తే పార్టీలు పతనమే..

- బోడుప్పల్లో 327వ వారం అంబేడ్కర్ కు జ్ఞానమాల
- తెలంగాణ అభివృద్ధి,ప్రజల ఆకాంక్షల కోసమే ప్రభుత్వాలు పనిచేయాలి
- అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య



**బోడుప్పల్, మే 25 (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 327వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ నిధులు, నియామకాల కోసం సుదీర్ఘంగా సాగిన తెలంగాణ ఉద్యమంలో వేలాదిమంది ఉద్యమకారులు తమ జీవితాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారు. కానీ కొన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారుల త్యాగాల పునాదులపై నిర్మితమై రాష్ట్రం సాధించాక తెలంగాణ ఆకాంక్షలు,ఆశయాలను పక్కనపెట్టి,ఉద్యమకారులను విస్మరించిన పార్టీ నేడు అంతర్గత కుమ్ములాటలతో,అవినీతి అక్రమాలలో కోరుకుపోయింది.ఇది నేటి చరిత్ర చెబుతున్న నిజం.ఇకనైనా రాజకీయ పార్టీలు తెలంగాణ ఆకాంక్షల కోసం కృషి చేయాలని, తెలంగాణ అమరవీరుల త్యాగాలను గుర్తించాలని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య,రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య,చిల్ల అంజయ్య బండారి సాయి,బొల్లం శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పరువును మంటగలిపిన సర్కార్

- మాజీ మంత్రి సబిత



**హైదరాబాద్, మే 25 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పరువును, భారతదేశ ప్రతిష్టను మంటగలిపిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. హైదరాబాదులో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలపై.. మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ సంచలన వ్యాఖ్యలు చేశారని తెలిపారు. మధ్య వయసు ఉన్న పురుషులను ఆనందపెట్టాలని తమపై ఒత్తిడి తీసుకువచ్చారని, తమను వేశ్య లాగా చూశారంటూ ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ పోటీల నుంచి మధ్యలోనే తప్పుకుని స్వదేశానికి వెళ్లిపోయారని చెప్పారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ పోటీల్లో ఇలాంటి ఘటనలు జరగడం.. అది కూడా మన రాష్ట్రంలో జరిగినప్పుడే తెరపైకి రావడం ప్రభుత్వ తీరుపై, నిర్వాహకుల తీరుపై అనేక అనుమానాలను కలిగిస్తున్నదని చెప్పారు. చాలా గ్రాండ్‌గా ఈ వేడుకలు నిర్వహిస్తామని, పోటీదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తామని, ఈ పోటీలతో పెట్టుబడులు వస్తాయని, యువతకు ఉద్యోగాలు వస్తాయంటూ ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు.. మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం నిర్వాహకులపై చేసిన ఆరోపణ కాదని, మన రాష్ట్ర రాజధానిలో పోటీలు జరుగుతున్నాయి కాబట్టి ఇది మన రాష్ట్ర ప్రతిష్టకు, మన దేశ పరువు, ప్రతిష్టలకు సంబంధించిన విషయమన్నారు. దీనిపై వెంటనే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన యువతులను వేధించింది ఎవరు, ఆ వేధింపులకు కారణమైంది ఎవరు, ఆ వ్యక్తులు ఎవరు అనే విషయాలు బయటకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనిపై వెంటనే రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించి విచారణ చేపట్టాలన్నారు. అలాగే జాతీయ మహిళా కమిషన్ కూడా ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, రాష్ట్ర, దేశ పరువు ప్రతిష్టలను కాపాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రపంచ దేశాల నుంచి పోటీల కోసం వచ్చిన యువతులతో అసభ్యంగా ప్రవర్తించిన వారు, వారితో అసభ్యకరమైన పనులు చేయించాలని ప్రయత్నించిన వారు ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలన్నారు.

# హాస్టళ్లపై జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక దృష్టి



**హైదరాబాద్, మే 25 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని హాస్టళ్లపై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక దృష్టి సారించింది. పలు హాస్టళ్లను తనిఖీ చేసి నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాటికి భారీగా జరిమానాలు విధించడంతోపాటు వాటి కిచెన్లను సీజ్ చేస్తూ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. రోజుల వ్యవధిలోనే 100కుపైగా హాస్టళ్లను తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలు 12 హాస్టళ్లను మూసివేయించారు. 60కిపైగా హాస్టళ్లకు నోటీసులు జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్లో నిబంధనలు పాటించని హాస్టళ్లపై జీహెచ్ఎంసీ కొరడా ఝులిపిస్తోంది. అమీర్ పేట, ఖైరతాబాద్, అశోక్ నగర్, దిల్ సుఖ్ నగర్లోని ప్రాంతాల్లో రెండు రోజులుగా ఫుడ్ సేఫ్టీతోపాటు ఇతర శాఖలతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అనేక ప్రైవేటు హాస్టళ్లు ఆహార భద్రత, పారిశుద్ధ్యం, అగ్నిప్రమాద నివారణ సహా పలు నిబంధనలు పాటించడం లేదని టాస్క్ ఫోర్స్ బృందాల తనిఖీల్లో తేలాయి. హాస్టళ్ల యాజమాన్యం సెల్లార్లను, పార్కింగ్ ప్రాంతాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడం, పెద్ద హోర్డింగ్లను ప్రదర్శించడం, అపరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని తయారు చేయడం, నాణ్యత లేని ఆహారాన్ని సరఫరా చేయడం, చిన్న గదుల్లో విద్యార్థులను పెట్టడం, సరిపోని మరుగుదొడ్లు లేకపోవడం, వీధుల్లో వ్యర్థాలను పారవేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు టాస్క్ ఫోర్స్ బృందాలు గుర్తించాయి. అశోక్ నగర్, దిల్ సుఖ్ నగర్, అమీర్ పేట ప్రాంతాల్లో సుమారు 58 హాస్టళ్లను తనిఖీ చేసి 30 హాస్టళ్లకు నోటీసులు జారీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న 5 హాస్టల్ కిచెన్ లను మూసివేయించారు. జీహెచ్ఎంసీ 1955 చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తున్న హాస్టళ్లకు రూ.2 లక్షల 45 వేల 500 జరిమానా విధించారు. అలాగే ఎల్బీనగర్ జోన్లోని శ్రీనగర్ కాలనీ, లలిత నగర్, కూకట్ పల్లి జోన్లోని కేపీహెచ్బీ, మూసాపేట, వినాయక్ నగర్, పత్రికా నగర్లో నిర్వహించిన డ్రైవ్లో 42 హాస్టళ్లను తనిఖీ చేశారు. 33 హాస్టళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసి రూ.1 లక్ష 81 వేల జరిమానా విధించారు. 7 హాస్టల్ కిచెన్లను మూసివేయించారు. హాస్టల్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం కాకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో జీహెచ్ఎంసీ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ హాస్టళ్లలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

### నిర్లక్ష్యంగా హాస్టళ్లు నడుపుతున్న వారిపై చర్యలు

ఈ తనిఖీలు మరింత ముమ్మరంగా కొనసాగుతాయని, ఇప్పటికే నోటీసులు అందుకున్న యజమానులు తమ హాస్టళ్లలో నిబంధనల ప్రకారం నాణ్యత, భద్రతా ప్రమాణాలను మెరుగుపర్చాలని, ప్రజల ఆరోగ్యానికి సహకరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా ప్రైవేటు హాస్టళ్లను నడుపుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్, మే 25 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రాజుల రామారం డివిజన్ వీనస్ రాక్స్ హైట్స్ లో దాదాపు 36 లక్షల 80 వేల రూపాయలు చేపట్టిన సిసి రోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల బి ఆర్ ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా మౌలిక వసతుల ను అన్ని ప్రాంతాల్లో కల్పించడం జరిగిందన్నారు. రానున్న రోజులలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ప్రణాళిక బద్ధంగా మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, విజయరామరెడ్డి, అడ్వకేట్ కమలాకర్, నవాబ్, చెట్ల వెంకటేష్ చెట్ల వెంకటేష్, తెలంగాణ సాయి, సమయ యాదవ్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్ రెడ్డి, శివరాం ప్రసాద్, శంకర్ రెడ్డి, మధు, బాలనాగదుర్గ, కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# దోమలపై జీహెచ్ఎంసీ యుద్ధం

- దోమల బెడద నివారణకు ముందస్తు ముమ్మరంగా ఫాగింగ్

**హైదరాబాద్, మే 25 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో దోమల బెడద నివారణకు ఫాగింగ్ చర్యలు ముమ్మరం చేశారు. వర్షాకాలం ముందే దోమల బెడద నివారణ చేసి రానున్న వర్షాకాలంలో దోమల నివారణను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దోహద పడుతుందనే ఉద్దేశ్యం తో పైలెట్ కొన్ని సర్కిల్ డివిజన్ లో ఫాగింగ్ చర్యలను పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ నేపథ్యంలో గోషామహల్ సర్కిల్ లో దత్తాత్రేయ నగర, ముసారం బాగ్ డివిజన్ లో అరోరా కాలేజ్ వెనుక భాగంలో ఫాగింగ్ చేపట్టారు. అంబర్ పేట్ డివిజన్ లో పటేల్ నగర్ న్యూ పటేల్ నగర్ చెన్నారెడ్డి నగర్, కాకతీయ లైన్, బాబు నగర్ పాలిటెక్నిక్ రోడ్డు, ఆకాష్ నగర్ కుమార్ నగర్ ఓవైసీనగర్ ప్రాంతాల్లో ఫోగింగ్ చర్యలు ఎంటమాలజీ అధికారులు సిబ్బంది పాల్గొని ముమ్మరంగా ఫాగింగ్ చర్యలు ముమ్మరంగా చేపట్టారు. కొన్ని ప్రాంతాలలో వివిఎఫ్ యంత్రాల ద్వారా మరికొన్ని ప్రాంతాల్లో పీఎంఎఫ్ యంత్రాల ద్వారా ఫోగింగ్ చర్యలు పెద్దఎత్తున చేపట్టారు అదే విధంగ సరూర్ నగర్ సర్కిల్ గడ్డి అన్నారం డివిజన్ క్యాప్రా సర్కిల్ లో వెంకటేశ్వర నగర్, మంగాపురం కాలనీ, కృష్ణ నగర్ కాలనీలో మీర్పేట్ హెచ్ బి కార్పొరేటర్ జెర్రీ పోతుల ప్రభుదాస్ ఫాగింగ్ పక్రియలో పాల్గొన్నారు ముషీరాబాద్ సర్కిల్ దోమల గూడ, ఉప్పల్ సర్కిల్ స్వరూప్ రెడ్డి నగర్ ఏరియా జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డ ఏరియా, నాగోల్ డివిజన్ శ్రీమతి అరుణ కార్పొరేటర్ పాల్గొన్నారు పటాన్ చెరువు రాఘవేంద్ర కాలనీ లో మెట్టు కుమార్ యాదవ్ పాల్గొని ఫాగింగ్ ను పర్యవేక్షించారు. మిగతా ఆయా డివిజన్ సంబంధిత కార్పొరేటర్ సహకారంతో ఫోగింగ్ ను సమర్థవంతంగా చేపట్టారు. ప్రజలు పాటించాల్సిన అంశాలు ప్రజలు కూడా దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కోరింది. ముఖ్యంగా ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిలవ లేకుండా చూసుకోవడం, ఇంట్లోకి దోమలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం. ఆర్ డబ్ల్యూఎస్ పాత్ర : రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా తమ కాలనీలో నీరు నిలువ లేకుండ చూసుకోవడం దోమల నివారణకి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు. నగరంలో దోమల బెడద నివారణకు చేపట్టుతున్న కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలందరు సహకరించాలన్నారు.



# ఎలక్ట్రిక్ బస్సులపై ఎలా ముందుకెళ్దాం..?

- రవాణా శాఖ, ఆర్టీసీ సమాలోచనలు
- అద్దె బస్సులకు ప్రైవేటు డ్రైవర్లే ఉంటారన్న కేంద్రం
- పీఎం ఈ-డ్రైవ్ పథకంపై కేంద్రం స్పష్టీకరణ




**హైదరాబాద్, మే 25 (జనంసాక్షి) :** పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద తెలంగాణకు వచ్చే ఎలక్ట్రిక్ బస్సులపై ఎలా ముందుకెళ్దామని ఆర్టీసీ, రవాణా శాఖ సమాలోచనలు చేస్తున్నాయి. కాలుష్య సమస్యకు పరిష్కారంతో పాటు ఇంధన ఖర్చును తగ్గించడానికి డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్టీసీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నాయి. తెలంగాణ ఆర్టీసీ గతేడాది ప్రధానమంత్రి ఈ-డ్రైవ్ పథకం కింద 2,800 బస్సులు కావాలని కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేయగా, ఈ నెల 22న 2 వేల బస్సులను మంజూరు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది.

### కిలో మీటరుకు రూ.57 అద్దె

పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని పర్యవేక్షిస్తున్న కేంద్ర భారీ పరిశ్రమల శాఖ బస్సులను సప్లై చేయడానికి త్వరలోనే టెండర్లు పిలవనుంది. టెండర్ దక్కించుకునే ప్రైవేటు సంస్థ వెట్ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) విధానంలో ఈ ప్రక్రియను నిర్వహిస్తుంది. బస్సు తయారీ, డ్రైవర్, నిర్వహణ బాధ్యతలు టెండరు దక్కించుకున్న సంస్థవే. ఇందుకు తెలంగాణ ఆర్టీసీ కిలోమీటర్ల వారీగా అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్టీసీ కిలో మీటరుకు రూ.57 చొప్పున కిరాయి చెల్లిస్తోంది.

ఆర్టీసీలో ఏటేటా ప్రైవేటు బస్సుల సంఖ్య పెరుగుతుంటే, తమ ఉద్యోగ భద్రతకు ముప్పు కలుగుతోందనే కార్మిక సంఘాల ఆందోళనల నేపథ్యంలో ఎలక్ట్రిక్ అద్దె బస్సులకు ఆర్టీసీ డ్రైవర్లే ఉండాలని గురు, శుక్రవారాల్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు ప్రతిపాదించారు. ఇది డ్రై జీసీసీ విధానమని, అయితే ఇది ఇప్పుడు కుదరదని, ఎలక్ట్రిక్ బస్సులకు ప్రైవేటు డ్రైవర్లే ఉంటారని కేంద్రం పేర్కొన్నట్లు తెలిసింది. కేంద్రం నుంచి లిఖితపూర్వకంగా సమాచారం వచ్చిన అనంతరమే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

### మరో రెండు ప్రతిపాదనలు

కొత్త విద్యుత్ బస్సులను అద్దెకు తీసుకోవడానికి బదులు, పాత డీజిల్ బస్సులకే ఎలక్ట్రిక్ ఇంజిన్ పెట్టే రెట్రోఫిటింగ్ ప్రతిపాదననూ కేంద్రం దృష్టికి ఆర్టీసీ అధికారులు తీసుకువెళ్లారు. ఈ ప్రక్రియకు ఒక్కో బస్సుకు దాదాపుగా రూ.50 నుంచి రూ.60 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ తరహాకు సబ్సిడీ ఇచ్చే పాలసీ ప్రస్తుతం తమ వద్ద అమలులో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రైవేటు సంస్థ నుంచి అద్దెకు తీసుకునే బదులు ఆర్టీసీయే కొనుగోలు చేయాలన్న ప్రపోజల్ కూడా ఉంది. ఈ ప్రతిపాదన రవాణాశాఖకు, అక్కడి నుంచి రాష్ట్ర ఆర్థికశాఖకు వెళ్లింది. కేంద్ర ప్రభుత్వ టెండర్ ద్వారా కాకుండా ఆర్టీసీ ద్వారా కొనుగోలు చేస్తే తయారీ సంస్థలు సకాలంలో సరఫరాను పూర్తి చేయలేవేమో అని, కేంద్ర ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చే 14 వేల బస్సుల తయారీకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయన్న అభిప్రాయాన్ని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

# తెరపైకి ఓయూ భూవివాదం

- విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ప్రొఫెసర్ క్వార్టర్స్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని ఆరోపణ
- అప్పగించిన విషయాన్ని ఒప్పుకున్న యూనివర్సిటీ వీసీ



**హైదరాబాద్, మే 25 (జనంసాక్షి) :** ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) భూ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వివాదం ఇంకా పరిష్కారం కాకముందే.. ఓయూ భూవివాదం తెరపైకి వచ్చింది. ఓయూ ప్రొఫెసర్ క్వార్టర్స్ ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు క్వార్టర్స్ ఇవ్వడంపై విద్యార్థి సంఘాలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయం నిజమేనని ఓయూ వీసీ (వైస్ చాన్సలర్) స్వయంగా అంగీకరించారు. అయితే, గతంలో ఇన్‌ఛార్జి వీసీగా ఉన్న వ్యక్తి ఈ క్వార్టర్స్‌ను అప్పగించారని ప్రస్తుతం ఉన్న వీసీ వెల్లడించారు. మినిట్స్ బుక్‌లో ఈ విషయాన్ని తనూ చూసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలు మాత్రం ఇది నిబంధనలకు విరుద్ధమని అంటున్నాయి. రూల్ ప్రకారం ఓయూ క్వార్టర్స్ ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వకూడదని స్పష్టం చేస్తున్నాయి. అదనంగా, ఓయూ ప్రొఫెసర్లు ఈ క్వార్టర్స్ లో నివాసముంటే నెలకు 40,000 కట్ చేస్తారని చెప్పుతున్నారు. దాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కేవలం 1,000కి ఇవ్వడమేంటని వారు నిలదీశారు. ఈ అంశంపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# కార్మికుల భద్రతే బీఎంఎస్ లక్ష్యం

**సదాశివపేట, మే 25 (జనం సాక్షి) :** పరిశ్రమలు పనిచేసే కార్మికుల భద్రత, శ్రేయస్సు కోసం భారతీయ మద్దూర్ సంఘం యూనియన్ గెలిపించాలని ఆల్ ఇండియా బిఎంఎస్ ఉపాధ్యక్షులు మల్లేశం అన్నారు. పట్టణ పరిధిలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో ఈనెల 28న జరగబోయే కార్మిక యూనియన్ ఎన్నికల సందర్భంగా ఆదివారం నాడు ఎంఆర్ఎఫ్ పరిశ్రమ వద్ద నిర్వహించిన గెట్ మీటింగులో ఆల్ ఇండియా బిఎంఎస్ ఉపాధ్యక్షుడు మల్లేశం పాల్గొని మాట్లాడారు. సిఐటియు కే పి ఎస్ ఇతర సంఘాల నాయకులు మాటల గారడితో కార్మికులను మోసం చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని అన్నారు. కార్మికులకు అండగా బి ఎం ఎస్ ఉంటుందని, కార్మికులకు చట్ట ప్రకారంగా ఇవ్వాల్సిన అధిక బోనస్ సాధించుటకై, కార్మికులకు మెడికల్ ఇన్సూరెన్స్ పేమెంట్ భారాన్ని తగ్గించి, ఉద్యోగ భద్రత అలాగే యాజమాన్యం వేధింపులను అరికట్టడానికి కార్మికులు బిఎంఎస్ కాగడ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌర అధ్యక్షుడు బిజెపి రాష్ట్ర నాయకుడు రాజేశ్వరరావు దేశ్పాండే, స్టేట్



జనరల్ సెక్రెటరీ రాజిరెడ్డి, బిఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు, బిఎంఎస్ జిల్లా నాయకులు శ్రావణ్ కుమార్, సుధాకర్, మోహన్ రెడ్డి ,హనుమంతు, యాదగిరి గౌడ్, జగన్మోహన్ రెడ్డి, పాండు, వీరన్న స్వామి, రామా గౌడ్,సురేష్, నరేన్ , బిజెపి నాయకులు గొర్రెల శివలింగం ,శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు

**చేవెళ్ల, మే 25 (జనంసాక్షి) :** నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు తెలిపారు. ఆదివారం పట్టణ కేంద్రంలో చేవెళ్ల డివిజన్ వ్యవసాయ రైతు వేదికగా విత్తనాలు మరియు ఎరువులుపై వానాకాలం 2025-26 అవగాహన సదస్సులో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు మాట్లాడుతూ...రైతులకు విత్తనాలు ఎరువులు మందులు విక్రయించే డీలర్లు ఇది కేవలం వ్యాపారంగానే కాకుండా ఒక సామాజిక బాధ్యతతో వివరించాల్సిన అవసరం ఉందన్నారు. డీలర్లు ఎవరైనా ప్రభుత్వ పరిధి దాటి ఉండకూడదని ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి వ్యవసాయ శాఖ చట్టాల ప్రకారం నిబంధనల ప్రకారం రైతులకు సేవలు అందించాలని సూచించారు. వ్యాపార ప్రయోజనాల కోసం అడ్డదారులు తొక్కితే కఠిన చట్టాలు ప్రయోగించాల్సి ఉంటుందని పిడి యాక్టులు కూడా నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. ప్రతి సీజన్లో డీలర్లకు అవగాహన కల్పిస్తున్నామని ఎక్కడ పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా డీలర్ల



షాపులను ఎప్పటికప్పుడు సందర్శించి తనిఖీలు నిర్వహిస్తారని, బాధ్యతగా రికార్డులు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ లోని చేవెళ్ల, శంకరపల్లి, మొయినాబాద్, మరియు షాబాద్, మండలాలలోని పలువురు ఎరువుల డీలర్లకు క్రొత్త ఎల్ వన్ ఈ పిఓఎస్ యంత్రాలలను అందచేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఓ హరినాథ్, వ్యవసాయ శాఖ చేవెళ్ల ఏడి సురేష్ బాబు, నాలుగు మండలాల ఏఓ లు మరియు కోరమాండల్ కంపెనీ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవశాలలను తక్షణమే మూసివేయాలి

- వీహెచ్ పీ ఆధ్వర్యంలో ఎస్ఐకి వినతి




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, మే 25 (జనం సాక్షి) :** గోరక్ష చట్టాలు అమలు చేయాలని కోరుతూ, విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ నారాయణపేట జిల్లా వారి ఆధ్వర్యంలో నారాయణపేట ఎస్ఐ అందే వెంకటేశ్వర్లు కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విహెచ్పి నాయకులు మాట్లాడుతూ అక్రమంలో ఉన్న గోచార భూములను విముక్తి చేయాలన్నారు. గుర్తింపు పొందిన గోశాలలకు నిధులు కేటాయించాలన్నారు.ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు.దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాలలో గోవులను పెంచాలనీ కోరారు.బక్రీద్ సందర్భంగా గో రక్షకులు ఆవులను పట్టుకొని పోలీసులకు తెలియజేసే విధంగా గోరక్షకులకు గుర్తింపు పత్రాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు.ప్రధాన నగరాలు పట్టణాల శివారులలో ప్రత్యేకంగా పోలీస్ చెక్పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా తరలించబడుతున్న గోసంతతిని రక్షించడమే కాకుండా రవాణా కొరకు ఉపయోగిస్తున్న ట్రక్కులను స్విచ్ చేసి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విహెచ్ పీ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, జిల్లా సంయోజక , వడ్ల శ్రావణ్ కుమార్, మరియు విజయ్, సందీప్, గోరక్ష ప్రముఖ అనిల్, బాలు, పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రామ పాలనాధికారి పరీక్షలు



**మెదక్ జిల్లా బ్యూరో, మే 25 (జనం సాక్షి) :** ప్రశాంతంగా జిల్లాలో గ్రామ పాలన అధికారి పరీక్ష ముగిసిందని డి.ఆర్.ఓ భుజంగరావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన. గ్రామ పాలన అధికారి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, కళాశాలలో గ్రామ పాలన అధికారి పరీక్షలు పగడబ్బందిగా నిర్వహించినట్టు తెలిపారు. డిగ్రీ కళాశాలలో గ్రామ పాలన అధికారి పరీక్షకు 104 పరీక్ష రాయాల్సి ఉండగా 79 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.25 మంది అనివార్య కారణాలవల్ల అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదని చెప్పారు. పరీక్ష రాసేందుకు వీలుగా తరగతి గదుల్లో బెంచీలు, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, తదితరాల వంటి మౌలిక వసతులను సమకూర్చినట్లు వివరించారు. పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రత ఏర్పాటు చేశారని చెప్పారు. ఏ విధమైన పేపర్ లీకేజీ గానీ, మాల్ ప్రాక్టీస్ కి తావు లేకుండా గ్రామ పరిపాలన అధికారి పరీక్ష పగడ్బందీగా నిర్వహించినట్టు తెలిపారు. మొత్తం 104 మంది అభ్యర్థులకు గాను 79 మంది హాజరైనారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంగటన జరగకుండా ప్రశాంతంగా పరీక్ష ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి,కలెక్టరేట్ ఏవో యూనస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత పోలీస్ యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన మహానేత కేసీఆర్

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్, మే 25 (జనం సాక్షి) :** నిరుపేదల సొంతింటి కలలను నెరవేర్చిన గొప్ప నేత కెసిఆర్ అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. ఆదివారం నియోజకవర్గం పరిధిలోని కైసర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల వద్ద డిగ్నిటీ హౌసింగ్ ప్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల పక్షపాతి కేసీఆర్ అని కొనియాడారు. డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు భేదాభిప్రాయాలు లేకుండా ఒక్కతాటిపై ఉండి సమస్యలను సమూలంగా పరిష్కరించుకోవాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో నెలకొని ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిష శ్రీనివాస్ యాదవ్, టిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు విజయరామరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్, తెలంగాణ సాయి, సమ్మయ్య యాదవ్, చెట్ల వెంకటేష్, దూలప్ప, చిన్న చౌదరి, బాబీ చౌదరి, సాయిబాబా, మహేష్, శివ నాయక్, నవీన్, ఆసిఫ్, ప్రసాద్, మహిళా నాయకురాలు మామి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సాదుల వేణు, సలహాదారులు ఎస్కే సాజిద్, ఉపాధ్యక్షులు ఎండి అతి రెహమాన్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె వలి, కోశాధికారి బింగి యాదగిరి, కాసిం, పివి రావు, మనోహర్, శంకర్ గౌడ్, షాబాద్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేరుతో గిరిజనుల ప్రాణాలు తీస్తున్నారు

- బికేఎంయు రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

**సంగారెడ్డి, మే 25 (జనం సాక్షి) :** మావోయిస్టుల పేరుతో గిరిజనుల ప్రాణాలను తి స్తున్నారని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య అన్నారు. ఆదివారం సదాశివపేటలో భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ సంగారెడ్డి జిల్లా నాల్గవ మహాసభలు జిల్లా కార్యదర్శి తాజుద్దీన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంతయ్య మాట్లాడుతూ.. మావోయిస్టుల పేరుతో గిరిజనుల ప్రాణాలు తీస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మావోయిస్టు లు శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్న మోడీ సర్కార్ ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు.బిజెపి ప్రభుత్వ పెద్దలు రాజ్యాంగ భద్రతకు కోసం మాట్లాడటం చూస్తుంటే విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పేద ప్రజలను కార్మికులను కూలీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశారని, పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ధ్వాజమేత్తారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ మోడీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు



అంటగడుతో దేశాన్ని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ దేశంగా మార్చే కుట్ర జరుగుతుందన్నారు. పేద ప్రజలను కూలీలను గాలికి వదిలేసిన మోడీ సర్కార్ పెత్తందారులకు, బడా బాబులకు రెడ్ కార్పెట్ వేస్తుందని విమర్శించారు . ఈ కార్యక్రమంలో సిపిఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు షఫీ అహ్మద్, పాడి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, బుజమ్మ, పాండు, ముస్తఫా, రమేష్, అనుసుజా, సాధిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కేంద్రం లక్ష్యం

- హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎంపీ అరుణ



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 25 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని పాలమూరు ఎంపి డి కే అరుణ అన్నారు.ఆది వారం నారాయణపేట జిల్లా దన్వాడ మండలం కొండాపూర్ లో 2లక్షల50 వేల ఎంపీ నిధులతో మంజూరు అయిన హైమాస్ట్ లైట్లను అరునమ్మ ప్రారంబించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామానికి వెలుగులు, రోడ్లు, పేదలకు ప్రధాని ఆవాస్ యోజన ఇల్లు మంజూరు చేస్తున్నదని అన్నారు. ప్రతి గ్రామంలో 2.50లక్షల ఎంపీ ల్యాడ్స్‌తో గ్రామంలో నూతనంగా ఎల్ఈడీ హైమ్యాక్స్ లైట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎంపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజి,కే. రతంగ్ పాండు రెడ్డి,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్‌కు విశేష స్పందన

**జవహర్‌నగర్, మే 25 (జనంసాక్షి) :** తెలంగాణ క్రీడా పాఠశాలలో మేడ్చల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం అనూహ్యంగా జరిగాయి. నిర్వాహకులు మేడ్చల్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సబ్ జూనియర్ స్థాయిలోనే ఏదో ఒక క్రీడలో నిరంతరం సాధన చేస్తూ కృషి నిశ్చయముతో ముందుకు సాగాలని విద్యుత పాటు క్రీడలు ఎంతో అవసరమని చిన్ననాటి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని మైదానంలో ఆడే క్రీడలకు సముచిత స్థానం ఇవ్వాలని మొబైల్స్ కు దూరంగా ఉండాలని తెలిపారు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి చిన్నారి బాలబాలికలు పాల్గొని పరుగు పందెం, షాట్ పుట్ జావలిన్ లాంగ్ జంప్ తదితర ఈవెంట్లలో అండర్ 8, అండర్ 10, అండర్-12 విభాగములలో అథ్లెటిక్స్



నిర్వహించి నారు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు క్రీడాకారులు జూన్ మొదటి తారీకు హైదరాబాదులో జరిగే 14వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు మేడ్చల్ జిల్లా తరఫున పాల్గొంటారని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఓ అశోక్ కుమార్, జాయింట్ సెక్రెటరీ దయాల్, టెక్నికల్ కమిటీ మెంబర్స్ తిరుమల రావు, వివిధ పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని క్రీడలను జయప్రదం చేశారు.

# ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం

- ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు



**కుత్బుల్లాపూర్, మే 25 (జనం సాక్షి) :** ప్రతి కాలనీలలో మౌలిక వసతులు కల్పించడానికి తాను కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని దుండిగల్ మున్సిపాలిటీ బహుదూర్ పల్లి 15 వార్డు ప్రణీత్ ఫ్లోరా కాలనీ వాసుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నీ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీ ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భరత్ కుమార్, కాలనీ ప్రెసిడెంట్ నాగమణి, వైస్ ప్రెసిడెంట్ హరీష్, సభ్యులు పెద్దినేని నాగరాజు, ఫ్లోరా అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీలకు గట్ల మల్యాల విద్యార్థిని

**నంగునూరు, మే 25 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షణ్ముఖ ప్రియ సాఫ్ట్ బాల్ జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈనెల రెండవ తేదీ నుంచి నాలుగవ తేదీ వరకు జగిత్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ క్రీడా పోటీలలో గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షణ్ముఖప్రియ, బి.ఈశ్వరి, ఎం.వైష్ణవి, ఎస్.కిరణ్మి, బానోతు షణ్ముఖ ప్రియ, డి.అను, బి.అశ్విని బి.హరిణి ప్రియ, బి.అఖిల అనే విద్యార్థులకు సాఫ్ట్ బాల్ క్రీడలో ఫిజికల్ డైరెక్టర్ పాఠశాల దర్శనాల రాజకుమార్ శిక్షణ ఇచ్చారు. దీంతో వీరంతా ఏప్రిల్ 26వ తేదీన గట్ల మల్యాల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితో పాటు సిద్దిపేట జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులందరికీ ఏప్రిల్ 26వ తేదీ నుంచి మే ఒకటవ తేదీ వరకు గట్ల మల్యాలలో శిక్షణ శిబిరం నిర్వహించారు. వీరంతా ఈనెల రెండవ తేదీ నుంచి నాలుగవ తేదీ వరకు జగిత్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా



పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. వీరిలో అత్యంత ప్రతిభ కనబరిచిన షణ్ముఖ ప్రియ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయింది. ఈనెల 27వ తేదీ నుండి చండీఘర్ లో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో షణ్ముఖ ప్రియ తెలంగాణ రాష్ట్రం తరపున ఆడుతుంది. షణ్ముఖ ప్రియ ప్రతిభను గుర్తించిన గట్లమల్యాల ఉన్నత పాఠశాల 1999-20 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆమె జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేందుకు చండీఘర్ వెళ్లి రావడానికి అవసరమైన రవాణా ఖర్చులకు సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. దీంట్లో భాగంగానే పూర్వ విద్యార్థులు అయిన సతీష్, ప్రవీణ్, రాజేశం, రవీందర్, యాదగిరి, సంపత్ తదితరులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ దర్శనాల రాజకుమార్, ఉపాధ్యాయుడు నోముల లింగం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బి.సరోజన సమక్షంలో షణ్ముఖ ప్రియకు ఆదివారం రూ.6,000 సహాయం అందించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభను కనబరిచి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా వారు షణ్ముఖ ప్రియను సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ భవిష్యత్తులో గట్లమల్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు తమ వంతు సహాయం చేస్తామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించి సహాయం చేసిన యువకులను అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు పాఠశాలకు, గ్రామానికి కు మంచి పేరు తెస్తారని తెలిపారు.

# రైతులకు అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

- జిల్లా వ్యవసాయ అధికారి వినయ్



**మెదక్ జిల్లా బ్యూరో, మే 25 (జనం సాక్షి) :** జిల్లాలో రైతులకు జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలపై జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మెదక్ జిల్లాకు 15 వేల క్వింటాల జనుము, 30 వేల క్వింటాల జీలుగు విత్తనాలకు సరఫరాకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది అన్నారు. ప్రస్తుతం మెదక్ జిల్లాకు 15 వందల క్వింటాల జనుము, 05 వేల క్వింటాల జీలుగు విత్తనాలు ప్రభుత్వం తరపున అందుబాటులో ఉంచామన్నారు. వరి నాట్లు ఎక్కడైతే ముందు జరుగుతాయో ఆ మండలాల్లో ప్రాథమిక సహకార సంఘాలు, రైతు ఆగ్రోస్ కేంద్రాల వద్ద పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మిగతా మండలాలకు నాలుగు రోజుల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నేలకు, పంటకు మేలు చేసే పచ్చిరొట్ట ఎరువును తయారు చేసేందుకు ప్రభుత్వం జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేస్తూ వస్తున్నది. పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు ఉన్న రైతుకు మాత్రం 50 శాతం వరకు సబ్సిడీపై అందుతుందన్నారు. రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతిలో భూసారాన్ని పెంచే దిశగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

# రైతులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

**ఆర్మూర్, మే 25 (జనంసాక్షి) :** అకాల వర్షాలతో వేలాదిమంది రైతుల ధాన్యం తడిసి రోడ్డు పాలైన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి విమర్శించారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసిన వరి ధాన్యాన్ని, నష్టపోయిన రైతులపై ఎటువంటి అలసత్వం వహించకుండా సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లకు తరలించాలన్నారు. రైతుకు క్వింటాలు వరి ధాన్యానికి 13 కిలోల తరుగు పేరుతో మోసగిస్తుందన్నారు. తెలంగాణ, ఆర్మూర్ నియోజకవర్గ వ్యాప్తంగా రైతుకు ఒక్క కిలో తరుగు లేకుండా న్యాయం చేయాలన్నారు. ఢిల్లీలో పైరవీలు, అందాల భామల పోటీలు, హెలికాప్టర్ల మీద తిరగాలన్న శ్రద్ధ కాస్త కన్నీరుపెడుతున్న రైతుల పట్ల చూపించాలన్నారు. రైతు ప్రభుత్వం అంటూ రైతులను నిండా మోసగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రపంచ అందగత్తెలు సైతం అందాల పోటీలను వ్యభిచార పోటీలుగా మార్చారని చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వ పరువు బజారుపాలైందన్నారు. సీనియర్ నాయకులకు పదవుల మీద వ్యామోహం వదిలి రైతుల గోసను




పట్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధులు జెస్సు అనిల్, కలిగోట గంగాధర్, నియోజకవర్గ కన్వీనర్ పాలెపు రాజు, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, బిజెపి నాయకులు ఆకుల రాజు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి అధికారి చిట్టా తెరుస్తా..**

ఆర్మూర్ నియోజకవర్గంలో కబ్జాలు, పైరవీలు, సంఘవిద్రోహ శక్తులు, చీకటి దందాలు నడవవని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల సొమ్ము ప్రజలకు పంచడమే సరైన న్యాయంగా భావిస్తానని చెప్పారు. కబ్జాదారుల అవినీతి చిట్టా ఆరెంజ్ బుక్ లో నోట్ చేస్తున్నామన్నారు. ఆర్మూర్ కు రక్షణ వలయంగా ఉంటానని, అవినీతి అధికారుల ఆటలు సాగవని విరుచుకుపడ్డారు. అవినీతి అధికారుల చిట్టాను ఏసీబీ డైరెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. అధికారులు అందరూ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి తమ పనులను సజావుగా సాగించాలన్నారు. అవినీతికి, లంచాలకు లొంగి స్థానిక నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తే తానేంటో చూపిస్తానన్నారు.

**ఆర్మూర్ మీడియాదే పెద్దన్న పాత్ర**

నా ఊపిరి, ధైర్యం, ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపునకు ఆర్మూర్ మీడియాదే పెద్దన్న పాత్ర అని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వ్యాఖ్యానించారు. మీడియా సహకారంతోనే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు వచ్చి రాష్ట్ర నాయకుడిగా ఎదిగానన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో జరిగే చీకటి దందాలను చీల్చి చెండాడేలా మీడియా సహాయ సహకారలు అందించాలన్నారు. వచ్చే రెండు నెలల్లో ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన అసలైన లబ్ధిదారులకు అందాయా లేదో కలిసి పరిశీలిద్దామన్నారు.

## జీవో నెంబర్ 22ను వెంటనే సవరించాలి



**హైదరాబాద్, మే 25 (జనం సాక్షి) :** జీవో నెంబర్ 22 వెంటనే సవరించి .ఒకేషనల్ డైరీ విద్యార్థులకు వెటర్నరీ అసిస్టెంట్ లకు అర్హత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, డైరీ సైన్స్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా పోవడంతో రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన విద్యార్థులు, మాసబ్ ట్యాంక్ లోని పశుసంవర్ధక కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. 1979 నుండి డైరీ కోర్సు వెటర్నరీ అసిస్టెంట్ అర్హత ఉందని పేర్కొన్నారు. పక్క రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ తో పాటు దేశవ్యాప్తంగా ఈ కోర్సుని అర్హత ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డైరీ 2023-2025 విద్యార్థులకు వెటర్నరీ అసిస్టెంట్ అర్హత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, కర్రే మహేష్, భరత్, కార్తీక్, ఆంజనేయులు, జబ్బర్, శారద, గౌతమి, సరిత, లావణ్య, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## కాటారం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

- హైదరాబాద్ చెందిన మహిళ మృతి
- సహాయక చర్యల్లో పోలీసులు, కాంగ్రెస్ నాయకులు



**కాటారం, మే 25 (జనం సాక్షి) :** కాటారం-నస్తూరుపల్లి గ్రామాల గ్రామాల మధ్య నేషనల్ హైవే 353 సి అటవీ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయం లో ఎదురెదురుగా వస్తున్న కార్లు ఢీ కొట్టుకున్నాయి. కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు వెళ్తున్న హైదరాబాద్కు చెందిన భక్తుల కారు, పుష్కరాల వెళ్లి వస్తున్న వరంగల్ పట్టణానికి చెందిన కారు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. హైదరాబాదు నుండి ఆరుగురు ప్రయాణికులతో వెళ్తున్న రెడ్ కలర్ సెవెన్ సీటర్ కారు వరంగల్ చెందిన మారుతి సుజుకి కంపెనీ చెందిన కార్లు అతివేగంతో ఢీకొనడంతో హైదరాబాద్ కు చెందిన లలిత 55 అనే మహిళ మృతి చెందింది. డ్రైవర్ మహేందర్ క్యాబిన్లో ఇరుక్కోగా దుర్గ జి కి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన సమీపంలో అన్నదాన కార్యక్రమంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కాటారం పోలీసులు సహాయక చర్యలో పాల్గొని క్షతగాత్రులను హాస్పిటల్కు తరలించారు. వరంగల్ కు చెందిన మారుతి సుజుకి కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న భక్తులు సురక్షితంగా ఉన్నారు. 108 అంబులెన్సు ద్వారా లలిత, దుర్గాజీలను భూపాలపల్లి వంద పడకల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న లలిత వంద పడకల ఆసుపత్రిలోనే మృతి చెందినట్లు, దుర్గాజీ, డ్రైవర్ మహేంద్ర లను వరంగల్ ఎంజీఎం తరలించినట్లు వంద పడకల ఆసుపత్రి వైద్యులు తెలిపారు. హైదరాబాద్ చెందిన కారు డ్రైవర్ మహేందర్ క్యాబిన్లో ఇరుక్కోవడంతో జెసిపి ద్వారా కాంగ్రెస్ నాయకులు బయటకు తీయించారు. అనంతరం కాటారం ఎస్సై అభినవ్ తన వాహనంలో ఎక్కించుకొని ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పించారు. అనంతరం వంద పడకల హాస్పిటల్ నుండి వరంగల్ ఎంజీఎం కు తరలించారు.

**సహాయక చర్యల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, పోలీసులు**

పుష్కర భక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమం సమీపంలో రోడ్డు ప్రమాదం సంభవించడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని, కాటారం పోలీసులకు సమాచారం ఇచ్చి క్షతగాత్రులకు సాయాన్ని అందించారు. కాటారం ఎస్సై అభినవ్, పోలీస్ సిబ్బంది, కాటారం మాజీ ఎంపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, ఆత్మకూరి కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## ఉద్యమకారుల ఆకాంక్ష నెరవేరడానికి మరో ఉద్యమం

- ప్రజలను చైతన్యం చేయాలని ఉద్యమకారులకు పిలుపు
- పాలకుర్తిలో ఉద్యమకారుల ఆవేదన సదస్సులో వక్తలు



**పాలకుర్తి, మే 25 (జనంసాక్షి) :** రాష్ట్రం ఏర్పాటు కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష నెరవేర్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్సీ ఆమీర్ఆలీఖాన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శుభం గార్డెన్లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆవేదన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ తోపాటు తెలంగాణ ఉద్యమకారుడు, క్రాంతిదళ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగం రెడ్డి పృధ్వీరాజ్, జర్నలిస్టు, తెలంగాణ విఠల్, లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు గత ప్రభుత్వంలో న్యాయం జరగలేదని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. అనంతరం సంగంరెడ్డి పృథ్వీరాజ్, మాట్లాడుతూ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో రాగానే ఉద్యమకారులకు న్యాయం చేస్తామని వారిని అన్ని విధాలుగా అదుకుంటామని చెప్పి కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. 14 వందల మంది ఉద్యమకారులు ప్రాణ త్యాగాలు చేస్తేనే రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. వారి కుటుంబాలను అదుకున్న దాఖలాలు లేవని అన్నారు. ఎమ్మెల్సీ కోదండరాం జూన్ 2 లోగ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో మందంజలో ఉండి రాష్ట్రంలో ఉద్యమాన్ని శిఖర స్థాయికి తీసుకెళ్లిన ప్రొఫెసర్ కోదండరాం పదవుల కోసం ఆశపడి ఉద్యమం చేసినట్లుగానే ఉందని ఎద్దేవ చేశారు. తెలంగాణను వ్యతిరేకించిన వారు ఇప్పుడు మంత్రి పదవుల్లో ఉన్నారని గుర్తు చేశారు, రాష్ట్రంలో ప్రభుత్వం నడిపేందుకు ఖజానలేదనుకుంటూనే సీఎం రేవంత్ రెడ్డి భూ బకాసురుడిలా హైదరాబాదులో భూములను కబ్జా పెడుతున్నాడని మండిపడ్డారు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులు పార్టీలకతీతంగా పోటీ చేయాలన్నారు, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష నెరవేరాలంటే పార్టీలకతీతంగా ఉద్యమ కార్యరూపాన్ని దాల్చాలన్నారు, తెలంగాణ విఠల్ మాట్లాడుతూ ప్రతి ఉద్యమంలో ప్రజలు త్యాగాలు చేశారని అన్నారు. చత్తీస్గఢ్, ఉత్తరాఖండ్, జార?ండ్, ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటుకు పోరాడిన ఉద్యమకారులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సైనికులకు సన్మానించినట్లుగానే సన్మానిం చి, వారికి నెలకు గౌరవ వేతనం రూ.25 వేలు అందచేస్తుందన్నారు. ఉద్యమాకారుల ఆకాంక్ష నెరవేరాలంటే మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సదస్సులో తెలంగాణ ఉద్యకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గోదుమల కుమారస్వామీ, మహేందర్, డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి, మామిండ్ల రమేష్ రాజా, గుమ్మడిరాజుల సాంబయ్య. చిట్యాల సంధ్యరాణి, పొలాస సోమయ్య. మూల ప్రభాకర్, సింగ మహేందర్ రాజు, జీడి హరీష్, యతిపతి శ్రీకాంత్, నారగోని సోమయ్య, తెలంగాణ వాదులు, ఉద్యమకారులు, తదితరులు ఉన్నారు.

## ప్రశాంతంగా యూపీఎస్సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష




**వరంగల్ ఎంజీఎం, మే 25 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా లోని వివిధ పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన యూపీఎస్సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 4141మంది అభ్యర్థులు పది పరీక్షా కేంద్రాలను కేటాయించగా ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకూ జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 2435 మంది అభ్యర్థుల హాజరై పరీక్ష రాశారు. 1706మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2:30 నుండి 4:30 గంటల వరకు జరిగిన రెండో సెషన్ పరీక్షకు 2422 మంది పరీక్ష రాశారు. 1719మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తున్న పలు పరీక్షా కేంద్రాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సందర్శించారు. వడ్డేపల్లి లోని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలోని ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు తీసుకున్న చర్యల గురించి ఆయా పరీక్షా కేంద్రాలకు సంబంధించిన అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

## పిచ్చికుక్క దాడిలో 15 మందికి గాయాలు

- నలుగురి పరిస్థితి విషమం
- కొంపల్లిలో ఘటన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, మే 25 (జనంసాక్షి) :** పిచ్చి కుక్క దాడిలో 15మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం కొంపల్లి ఎస్సీ కాలనిలో శుక్రవారం రాత్రి పిచ్చి కుక్క దాడికి పాల్పడింది. రెచ్చిపోయాయి. ఆరుబయట కనిపించిన సుమారు 15 మంది వెంటపడి దాడి చేసి కరిగింది. ఈ సంఘటనలో ఏకు సుకన్య, ఎడ్ల నవీన్, మోరే సరోజన, వెంకటయ్య, సడల పైడయ్య, పసుల జస్వంత్, ఎకు చిట్టి, ఎడ్ల మమత, సడల సునీల్ తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జిల్లా కేంద్రం లోని వంద పడకల ఆసుపత్రికి తరలించగా మరో నలుగురు పరిస్థితి విషమంగా ఉండటంలో వరంగల్ ఎంజీఎం కు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి పిచ్చి కుక్కల్ని నియంత్రణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఓయూలో టజీ ఈ సెట్ ఫలితాలు విడుదల



**ఓయూ, మే 25 (జనం సాక్షి) :** ఓయూలో టిజి ఈ సెట్ ఫలితాలను తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మెన్ వి. బాలకృష్ణారెడ్డి, వీసీ ప్రొఫెసర్ కుమార్. ఫలితాలను విడుదల www.https: //ecet. tgche. ac. in/ýË ర్యాంక్ కార్డులు అందుబాటులో ఉంటాయి. ఈ రిజల్ట్ ఆధారంగా పాలిటెక్నిక్ డిప్లమా, బీఎస్సీ (మ్యాథ్స్) అభ్యర్థులకు బీఈ, బిటెక్, బి ఫార్మసీ, కోర్సుల్లో లెటరల్ ఎంట్రీ విధానంలో నేరుగా రెండో ఏడాదిలో ప్రవేశాలు కల్పిస్తారన్నారు. మే 12 నిర్వహించిన పరీక్షకు దాదాపు 20 వేల మంది హాజరయ్యారన్నారు.

## వృత్తికులాల ఐక్యతకు గండ దీపం కవిత్వం ప్రతీక



**హైదరాబాద్, మే 25 (జనం సాక్షి) :** పల్లె చుట్టూ అల్లుకున్న మానవ శ్రమ జీవన సౌందర్యాత్మక వృత్తి కళలు, ప్రకృతి వస్తు ప్రపంచ నేపథ్యాన్ని అల్లుకొని రాసిన గండదీపం పుస్తకావిష్కరణ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం మెయిన్ హాల్లో జరిగింది. ఈ పుస్తకాన్ని అంబటి సురేంద్ర రాజు ఆవిష్కరించారు. కవి జర్నలిస్టు రమేశ్ హాజారి ప్రారంభోపన్యాసం చేశారు. తొలికాపిని ప్రముఖ సైంటిస్ట్ రాపాక సుభాష్ చంద్రబోస్ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత విమర్శకులు, కవి, రచయిత గండ దీపం పుస్తక ఆవిష్కర్త, డా. అంబటి సురేంద్ర రాజు మాట్లాడుతూ.. సమాజానికి నాగరికత నేర్పింది విశ్వకర్మలేనని, వారి జీవిత అనుభవాలను కవి కవిత్వంగా రాసారని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో ఆధునికంగా వినిపిస్తున్న గొప్ప కవిత్వం సరసన పుష్పగిరి కవిత్వం నిలుస్తుందని, అబ్బురపరిచే పద చిత్రాలతో వినూత్న కవిత్వాన్ని పుష్పగిరి రాస్తున్నాడని సురేంద్రరాజు తెలిపాడు. తెలంగాణ అస్తిత్వాన్ని సాంస్కృతిక సంపదను సామాజిక తాత్వికతను గండ దీపం' లో కవి పలికించాడని అన్నారు. ప్రస్తుత సామాజిక రాజకీయ వర్తమాన సందర్భంలో పుష్పగిరి కవిత్వానిది కీలక పాత్ర అని అన్నారు. వృత్తికులాల ఐక్యతకు ఈ కవిత్వం ప్రతీకగా నిలుస్తోందని, ప్రతి లైబ్రరీ లో, ప్రతి ఒక్కరి చేతిలో ఈ పుస్తకం ఉండాలని ఈ కవిత్వం పై విస్తృ తంగా చర్చ జరగాలని అసుర అన్నారు. కవి రచయిత, పాత్రికేయులు రమేష్ హాజారి ఈ సందర్భంగా ఆప్తవాక్యం పలుకుతూ... సామాజిక పద చిత్రాలతో పుష్పగిరి గండ దీపాన్ని వెలిగించాడని, తన కవిత్వం సబ్బండ కులాల గుండె దీపమని అన్నారు. తెలంగాణ ప్రతి పల్లె కుల బంధాలు, రక్తసంబంధాల కంటే మానవ జీవన ఉత్పత్తి సంబంధాలకు నిలయమని రమేష్ హాజారీ పేర్కొన్నారు. గండ దీపం కవిత్వం పల్లె, ప్రజల చుట్టూ అల్లుకున్న కవిత్వమని, ఉత్పత్తిలో భాగస్వామ్య మైన ప్రజల జీవన విధానం సంస్కృతి కవిత్వంగా వెలువడిందని అన్నారు. తరతరాల వారసత్వంగా వస్తున్న జీవన తాత్వికత ఈ కవిత్వంలో ఇమిడి ఉందన్నారు. కేసీఆర్ సారధ్యంలో తెలంగాణ మలి దశ ఉద్యమ పోరాటంలో సబ్బండ కులాలు సకలజనులు చైతన్యమై పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నారని, పదేండ్ల అనతికాలంలో సబ్బండ వృత్తి కులాల జీవితాల్లో గుణాత్మక ప్రగతి సాధించుకున్నామని, అదే స్ఫూర్తి నీ కొనసాగిస్తూ భవిష్యత్ తరాలకోసం పాటు పడాలని రమేష్ హాజారీ తెలిపారు. అనంతరం రచయిత విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ... గండదీపం కవిత్వం నిండా ఊరు, అమ్మ, ప్రకృతి, కుల వృత్తుల సౌందర్యం, పల్లె జనాల ఆత్మీయత ఉన్నాయని, ఎదుగుతున్న క్రమంలో పల్లె ఛిద్రమైన దుఃఖమే తన గండదీపం.. కవిత్వమని అన్నారు. ఈ కవిత్వానికి ముందు మాట రాసిన ప్రముఖ కవి వాగ్గేయకారులు గోరేటి వెంకన్న కు, ఆప్తవాక్యంగా కవిత్వాన్ని సమీక్షించి దానికో సైద్ధాంతికత దృక్పథాన్ని అద్దిన రమేష్ హాజారి, పుస్తక అంకితాన్ని స్వీకరించి ఆవిష్కరణ చేసిన డా. అంబటి సురేంద్ర రాజుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తల్లి రూపశిల్పి బివిఆర్ చారి, ఏ సి పి కిరణ్ కుమార్, డా. హరికాంత్, అనుముల ప్రభాకరాచారి, డా. నరసింహా చారి, రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం పరిమళించింది

- లక్షా పదిహేను వేలు అందించి ఆదుకున్న గ్రామస్తులు



**బెల్లంపల్లి, మే 25 (జనంసాక్షి) :** పేద కుటుంబంలో ఇంటిపెద్ద అనారోగ్యంతో అకాల మృత్యువాత పడ్డాడు. అనారోగ్యం కారణంగా ఉన్న స్థిర, చర ఆస్తులు అమ్ముకున్నా ఆరోగ్యం కుదుట పడక అర్ధాంతరంగా తనువు చలించాడు. ఇది చూసి చలించిన గ్రామస్తులు అందరు కలిసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కృత నిశ్చయం తీసుకోని చందాలు పోగు లక్షా పదిహేను వేల రూపాయలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వివరాల్లోకి వెళితే బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం కోణంపేట గొల్లగూడెం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన అల్ల గట్టయ్య ఈనెల 18న రెండు కిడ్నీలు పాడై మరణించాడు. కిడ్నీ చికిత్స కోసం గట్టయ్య భూములు, ఇతరత్రా అమ్ముకున్నా ఆరోగ్యం కుదుట పడక మృత్యువాత పడ్డాడు. అసలే పేదరికంలో మగ్గుతున్న ఆకుటుంబం దిక్కుతోచని స్థితిలో బేలగా ఎదురు చూస్తున్న తరుణంలో గట్టయ్య కుటుంబ పరిస్థితి గమనించిన గ్రామస్తులు ఎవరో రావాలి, ఆదుకోవాలి అని ఎదురుచూడకుండా పేద కుటుంబానికి తామే బంధువులం అని ముందుకు వచ్చి ఎవరికి వారు వారికి తోచినంత సాయం చేశారు. గ్రామస్తులు, వారికి తెలిసిన వారి సహాయంతో లక్షా పదిహేను వేల రూపాయలు పోగు చేసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ప్రతి ఇలా ఆదర్శంగా తీసుకుంటే మంచిదని పలువురు అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో తాజా మాజీ ఉపసర్పంచ్ ఏనుగుల రమేష్, కానిస్టేబుల్ గుంటి సురేష్, ఉపాధ్యాయుడు మేకల కుమార్, కదారి దక్షపతి, మేకల రాజం, గ్రామస్తులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
26 మే 2025

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పట్టాల పంపిణీ

- త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకోవాలి
- పెట్టుబడి లేని నిరుపేదలకు మెప్మా నుంచి రుణం
- ఇండ్ల నిర్మాణాలకు ఇసుక ఉచితం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**సిరిసిల్ల టౌన్, మే 25 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన వారంతా త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఆదివారం రెండో విడత కింద 764 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ మంజూరు ఉత్తర్వులు సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానం ఆవరణ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, కే కే మహేందర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సిరిసిల్లలో 764 మందిని పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలని స్పష్టం చేశారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయలు, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు,ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ వెల్లడించారు.

### మంజూరు పత్రాలు ఇవ్వడం సంతోషం

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతి వారం నిర్వహించే ప్రజావాణికి ప్రజలు వచ్చి తమకు ఇండ్లు ఇప్పించాలని కోరేవారని కలెక్టర్ గుర్తు చేశారు. అలాంటి పేదలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఇవ్వడం సంతోషంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయాన్ని పొంది తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు.

### పురోగతి ప్రకారం నిధుల విడుదల

ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని, ఎక్కడా పైరవీ చేయాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

### ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఇసుక అందుబాటులో పెడతామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం సంబంధిత వార్డ్ ఆఫీసర్లు తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. రవాణా ఛార్జీలు చెల్లించాలని కలెక్టర్ సూచించారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో మెప్మా నుంచి రుణం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ వెలుముల స్వరూపారెడ్డి, సెస్ ఛైర్మెన్ చిక్కాల రామారావు, హౌసింగ్ పీడీ శంకర్, డిఆర్డిఓ శేషాద్రి, మున్సిపల్ కమిషనర్ వాణి, సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంథనిలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన



**మంథని, మే 25 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ కేంద్రంలో సోమవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పర్యటించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 8:30 ని.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ మంథని కార్యాలయం నందు గుంజపడుగు గ్రామంలో 2.90 కోట్లతో ఏర్పాటు చేయబోయే సోలార్ ప్రాజెక్ట్ ( పీఎం కుసుమ్) కు సంబంధించిన అనుమతి పత్రాలను మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా మంథనిలో పి ఎస్ సి ఎస్ చైర్మన్ పాలకవర్గానికి అందజేయనున్నారు. ఉదయం 9:00 గంటలకు మంథని బస్ డిపో సమీపంలో తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రీమ్, స్టార్ట్, రైజ్ ఇన్నోవేషన్ నెట్వర్క్ లో భాగంగా మంథని టౌన్ గ్రామీణ ప్రోటోటైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు కొయ్యూరులోని సరస్వతీ పుష్కరాలకు వెళుతున్న భక్తులకు అన్నదానం కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొననున్నారు.

## సరస్వతి పుష్కరాలకు ఉచిత బస్సుల సౌకర్యం కల్పించిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, మే 25 (జనంసాక్షి) :** 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పవిత్ర, పుణ్య కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, వారి సోదరుడు శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు ఆధ్వర్యంలో మంథని డివిజన్ వ్యాప్తంగా ఉచిత బస్సు సౌకర్యాలను కల్పించారు. ఇందులో భాగంగా ఆదివారం మంథని మండల వ్యాప్తంగా భక్తుల కోసం ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు మంథని మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మంథని మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మంథని మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సరస్వతి పుష్కరాలకు సంబంధించిన ప్రసాదాన్ని ఈ ఉచిత బస్సులో ప్రయాణిస్తున్న భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంథని మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుడుదుల వెంకన్న, ఎరుకల ప్రవీణ్, మంథని సత్యం, పార్షవేన మోహన్, మబ్బు తిరుపతి యూత్ కాంగ్రెస్ నాయకులు దాడి క్రాంతి, రాగం శ్రీను, బూడిద రమేష్, చెన్నూరీ విజయ్, ఆరెల్లి వరుణ్, ఎరుకల సురేష్, సాధుల సతీష్, ఆర్ల వికిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాభిశిల బొడ్రాయి తృతీయ వార్షికోత్సవ వేడుకలు



- కొండమల్లేపల్లి గ్రామంలో భక్తి శ్రద్ధలతో బొడ్రాయికి పూజలు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్

**కొండమల్లేపల్లి, మే 25 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి గ్రామంలో బొడ్రాయి తృతీయ వార్షికోత్సవంలో భాగంగా రెండవ రోజు వేడుకలు ఆదివారం గ్రామస్తులు, గ్రామ పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున బొడ్రాయి వద్ద వేద పండితులు పాలా గణపతి శర్మ, సదాశివశర్మ, దేరం జయప్రకాష్ శర్మల ఆధ్వర్యంలో బొడ్రాయి తృతీయ వార్షికోత్సవ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు బొడ్రాయికి, ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. బొడ్రాయి తృతీయ వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. రాష్టంలో దేవాలయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్ రెడ్డి, పసునూరి యుగేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, నాయిని సుభాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్, నీలా లక్ష్మయ్య, పార్ బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సముద్రాల వెంకటేశ్వర్లు, మైలా బుచ్చిరెడ్డి, బూడిద వెంకటయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ గంధం సురేష్, బొడిగె శంకర్ గౌడ్, కొడిదాల వెంకటయ్య, కోట్ల జగదీష్ పటేల్, మంగ్యా నాయక్, తోటపల్లి కిరణ్, తోటపల్లి కృష్ణ, బొడ్డుపల్లి శంకర్, బూడిద మల్లేష్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

**చౌటుప్పల్, మే 25 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని చందన ప్లే స్కూల్లో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. విద్యార్థి ఉద్యమ తరగతులు కల్లూరి మల్లేశం, ఎస్ఎఫ్ఐ నిర్మాణం విశిష్టత తరగతులను తాళ్ల నాగరాజు బోధించారు. ఈ సందర్భంగా తాళ్ల నాగరాజు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో అధికారులను వచ్చి 16 నెలలు గడుస్తున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నియమించని దద్దమ్మ ప్రభుత్వమని, విద్యాశాఖ మంత్రి లేక సమస్యలు చెప్పుకుందామంటే వినే నాథుడు లేదన్నారు. పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని నాలుగు సంవత్సరాల నుంచి స్కాలర్షిప్ విడుదల కాక విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రైవేట్ విద్య సంస్థలో లక్షలాది రూపాయలు దోపిడీ కొనసాగుతుందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ,ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెడబోయిన మమత, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి మల్లేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ, లావుడియ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు ,కాసుల నరేష్, ఈళ్ల రాహుల్, జిల్లా సహాయ కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు నరేందర్, భవాని శంకర్, నేహాల్, గాయత్రి, భారత్, శ్రీమాన్, సిద్దు, వరుణ్,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రఫెల్ ఫాథర్ సేవలు చిరస్మరణీయం



**కొండమల్లేపల్లి, మే 25 (జనంసాక్షి) :** సంజీవని కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషనల్ కరెస్పాండెంట్ రఫెల్ ఫాదర్ మరణించడం బాధాకరం అని శ్రీ వెంకటేశ్వర బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ భాష అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఫెల్ ఫాదర్ వరంగల్ జిల్లా తొర్రూరు మండలం తిమ్మారావుపేటలో జన్మించి గిరిజన మారుమూల ప్రాంతమైన దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండలం చిన్న అడిశర్లపల్లి పరిధిలో సంజీవన ట్రస్ట్ ను ఏర్పాటు చేసి సంజీవని కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, సంజీవని ఐటిఐ కాలేజ్, సంజీవని హై స్కూల్ లను ఏర్పాటు చేసి విద్యకు ప్రాధాన్యమిచ్చారన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి నిరుపేద పిల్లల చదువులకు, స్కాలర్షిప్స్, నిరుపేద కుటుంబాలకు ఇండ్లు, మరుగుదొడ్లు, ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు వాటర్ ప్లాంట్ల ఏర్పాటులో ఆర్థిక సహాయం అందించారు. మారుమూల గ్రామాల పేదల పిల్లల వివాహాలకు తగిన ఆర్థిక సహాయం అందించారు. సంజీవని ట్రస్ట్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది ప్రభుత్వ ఉద్యోగులుగా సహకారం అందించారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో ఎన్నో గ్రామాల ప్రజలకు నిత్యవసర సరుకులు, తక్షణ ఆర్థిక సహాయం సంజీవని ట్రస్ట్ ద్వారా అందించారు. పేద ప్రజలకు, అణగారిన వర్గాలకు రఫెల్ ఫాదర్ ఆర్థికంగా ఎంతో కృషి చేశారన్నారు. సంజీవని ట్రస్టు ద్వారా ఎంతో మంది విద్యార్థులకు విద్యాదానం చేశారని విద్యార్థులకు, సమాజానికి వారు చేసిన సేవలను కొనియాడుతూ వారి అకాల మరణం తీరని లోటు అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. సోమవారం సంజీవని కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రస్టులో అంత్యక్రియలు ఉంటాయని తెలిపారు.

## జీవాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం అందించాలి



**ఖమ్మం రూరల్, మే 25 (జనం సాక్షి) :** తమ జీవనాధారమైన జీవాలను కోల్పోయిన గిరిజనులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెకోడు తండా గ్రామంలో విషతుల్య మేతను తిని మృతి చెందిన జీవాలను పరిశీలించారు. అలాగే బాధిత గిరిజనులను పరామర్శించి, ఓదార్చారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 8 మందికి చెందిన సుమారు 50 వరకు జీవాలు మృతి చెందినట్లు తెలిపారు. మరికొన్ని జీవాలు మేత మేసి అడవిలో ఎక్కడ పడిపోయాయో కూడా తెలియని పరిస్థితి ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఇలా జరిగిన నష్టం సుమారు 10 నుంచి 15 లక్షల వరకు జరిగి ఉండొచ్చు అన్నారు. ఇది ఇంకా పెరిగే అవకాశం కూడా ఉందని అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. జరిగిన నష్టం అత్యంత విషాదకరమైన ఘటన అన్నారు. జీవాలు మృతి చెందడంతో అగమ్య గోచరంగా వారి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిని కోల్పోయిన నిరుపేద గిరిజనులకు సీఎం సహాయ నిధి నుంచి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవ చూపి ప్రభుత్వం ద్వారా బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున నష్టపోయిన బాధితులకు తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని సైతం అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీర రామ్మూర్తి నాయక్ , జిల్లా సమితి సభ్యులు ఎడ్లపల్లి శంకరయ్య, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు ఏలూరి భాస్కర్, గ్రామ నాయకులు బానోతు మల్సూర్, కొరివి విరన్న, సుసన్, బాధిత గిరిజనులు పాల్గొన్నారు.

## తాటిచెట్టుపై నుండి పడి గీత కార్మికుడి మృతి



**చౌటుప్పల్, మే 25 (జనంసాక్షి) :** చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తంగడపల్లికి చెందిన గీతకార్మికుడు మృతిచెందినట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. గీత వృత్తిలో భాగంగా చెరుకు సత్తయ్య (54) ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లుగీసి దిగుతుండగా మోకు జారి ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి క్రిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సత్తయ్యను సమీపంలో ఉన్న గట్టు యాదయ్య ,కొండూరి ధర్మేందర్‌లు చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుని కొడుకు చెరుకు మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి చేయని వారే విమర్శలు చేయడమా..?

- మాజీ ఎమ్మెల్యేపై ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు ఆగ్రహం



**మంచిర్యాల ప్రతినిధి, మే 25 (జనంసాక్షి) :** మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మంచిర్యాల ను అన్ని విధాలుగా వెనుకబాటుకు గురి చేసి ఆయనే అభివృద్ధి గురించి మాట్లాడడం హాస్యస్పదంగా ఉందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు అన్నారు. ఆదివారం నాడు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అనారోగ్యంతో మరణించిన సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ ఆత్మ శాంతికై రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ... రెండు దశాబ్దాలుగా ఎమ్మెల్యేగా పని చేశానని చెప్పుకునే దివాకర్ రావు మంచిర్యాలలో అభివృద్ధి ఎక్కడ చేసాడో వెల్లడిస్తే బాగుంటుందని కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సవాల్ చేశారు..మంచిర్యాల లో విద్య, వైద్య సేవలు విస్తృత పరుస్తూ రహదారులను విస్తరింప చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. నా ఇంటి ముందు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంకు ఏర్పాట్లు జరగడం దివాకర్ రావు సహించడం లేదని మండిపడ్డారు. వేంపల్లిలో పరిశ్రమల నిలయం కావడం దివాకర్ రావుకు కంటగింపుగా ఉందని అన్నారు. ఐటీ పార్కును అడ్డుకుంటామని అనడం అభివృద్ధి నిరోధకమే అవుతుందని అన్నారు. ఐటీ పార్కు అయితే వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని గుర్తు చేశారు. భూ నిర్వాసితులకు సంతోషకరమైన ప్యాకేజి ఇస్తానని భరోసా ఇచ్చారు.. మాట్లాడితే నా ఇంటి గురుంచి దివంగత హాజీపూర్ హన్మంతరావు గురుంచి మాట్లేడే దివాకర్ రావుకు వాస్తవాలు వెల్లడిస్తే మైండ్ బ్లాక్ అవుతుందని అన్నారు. అంతే కాకుండా నీ కుమారుడు విజిత్ రావు చేష్టల గురుంచి ప్రజలకు తెలిస్తే నీ పరిస్థితి ఎలా ఉంటుందో ఆత్మవలోకనం చేసుకోవాలని సూచించారు. నీవు ఎన్ని విమర్శలు, ఆరోపణలు చేసిన మంచిర్యాలను విద్య, వైద్య పరంగా అభివృద్ధి చేసి తీరితానని స్పష్టం చేశారు. ఎల్లంపల్లి భూ నిర్వాసితులకు ఎంతవరకు న్యాయం చేసావో బహిరంగంగా చెప్పాలని సవాలు విసిరారు. అభివృద్ధి పనుల్లో ఎలా కమీషన్లు వస్తాయో దివాకర్ రావుకు బాగా తెలుసని అన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నామీద పై చేసిన ఆరోపణలు నిరూపించాలని దివాకర్ రావుకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సవాల్ విసిరారు.

## చదరంగంతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుంది

- జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్



**సూర్యాపేట ప్రతినిధి, మే 25 (జనంసాక్షి) :** చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టిటిడి కళ్యాణ మండపంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్-11,17 విభాగాలలో బాలబాలికలకు చెస్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల విజేతలకు షీల్డ్ లు, మెమెంటోలు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. విద్యార్థులు నేడు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అండర్ -17 బాలుర విభాగంలో ప్రథమ బహుమతి లోకమాన్య చారి, ద్వితీయ బహుమతి అఖిలేష్, తృతీయ బహుమతి శ్యాముల్, నాలుగో బహుమతి లక్ష్మీనరసింహ, బాలికల విభాగంలో ప్రథమ బహుమతి ఇందిర, ద్వితీయ బహుమతి అనంత లక్ష్మి, తృతీయ బహుమతి రమ్య గెలుపొందారు. అండర్-11 బాలుర విభాగంలో ప్రథమ బహుమతి దక్షిత్, ద్వితీయ బహుమతి జతిన్ రెడ్డి, తృతీయ బహుమతి దేవాన్ష్, బాలికల విభాగంలో ప్రథమ బహుమతి సింధు సునన్య, ద్వితీయ బహుమతి ఆరాధ్య గెలుపొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీసాయి కుమార్, సంయుక్త కార్యదర్శి గడ్డం లింగారెడ్డి, కోశాధికారి వెంకట మురళి, బాణాల వెంకటేశ్వర్లు, మాద రమేష్, ఎస్.మురళీ, బిక్షం, సందీప్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.




## ఆ ఒక్క రాష్ట్రంలోనే ఐదు లక్షల కార్లు

సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ తయారీదారుల డేటా ప్రకారం.. 2024-25లో భారతదేశంలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలలో 'మహారాష్ట్ర' మొదటి స్థానంలో ఉండగా, ఉత్తరప్రదేశ్ ద్విచక్ర వాహనాల అమ్మకాలలో ముందుంది.డేటా ప్రకారం.. 2024-25లో మహారాష్ట్రలో ప్యాసింజర్ వాహనాల ( అమ్మకాలు 5,06,254 యూనిట్లు (11.8 శాతం)గా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ 4,55,530 యూనిట్లు (10.6 శాతం), గుజరాత్ 3,54,054 యూనిట్లు (8.2 శాతం) అమ్మకాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆ తరువాత నాల్గవ స్థానంలో కర్ణాటక 3,09,464 యూనిట్లతో (7.2 శాతం), హర్యానా 2,94,331 యూనిట్లతో (6.8 శాతం) ఐదవ స్థానంలో ఉన్నాయి.ద్విచక్ర వాహన విభాగంలో.. ఉత్తరప్రదేశ్ 28,43,410 యూనిట్ల అమ్మకాలతో (14.5 శాతం వాటా) అగ్రస్థానంలో ఉంది. మహారాష్ట్ర 20,91,250 యూనిట్లతో (10.7 శాతం), తమిళనాడు 14,81,511 యూనిట్లతో (7.6 శాతం) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. నాలుగు, ఐదు స్థానాల్లో కర్ణాటక (12,94,582 యూనిట్లు), గుజరాత్ (12,90,588 యూనిట్లు) ఉన్నాయి.త్రిచక్ర వాహనాల విభాగంలో.. ఉత్తరప్రదేశ్ అత్యధికంగా 93,865 యూనిట్లు (12.7 శాతం) అమ్మకాలు జరపగా, గుజరాత్ 83,947 యూనిట్లు (11.3 శాతం), మహారాష్ట్ర 83,718 యూనిట్లు (11.3 శాతం) అమ్మకాలు జరిపాయని డేటా తెలిపింది. కర్ణాటక 70,417 యూనిట్లతో (9.5 శాతం) నాల్గవ స్థానంలో, బీహార్ 47,786 యూనిట్లతో (6.4 శాతం) ఐదవ స్థానంలో నిలిచాయి.

## జపాన్‌ను అధిగమించిన భారత్

**: మరో మూడేళ్ళలో..**

2047 నాటికి వికసిత భారత్ సాధ్యమవుతుందని 'నరేంద్ర మోదీ' చాన్నాళ్లకు ముందే పేర్కొన్నారు. ఈ దిశగానే కేంద్రం కూడా అడుగులు వేస్తోంది. కాగా ఇప్పుడు..జపాన్‌ను అధిగమించి.. భారతదేశం ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ 'బీవీఆర్ సుబ్రహ్మణ్యం' పేర్కొన్నారు.నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశం తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ.. మొత్తం భౌగోళిక, రాజకీయ, ఆర్థిక వాతావరణం భారతదేశానికి అనుకూలంగా ఉన్నాయని సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం.. ప్రస్తుతం భారతదేశం కంటే.. అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే పెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాయి.మనం ఇప్పటికే వేసుకున్న ప్రణాళికలకు కట్టుబడి ముందుకు సాగితే.. మరో మూడేళ్ళలో మనం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తామని సుబ్రహ్మణ్యం వెల్లడించారు. తయారీ రంగం అభివృద్ధి, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం వంటివి మాత్రమే కాకుండా.. ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటివి దేశాభివృద్ధికి కీలకమని ఆయన అన్నారు.భారతదేశం జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. వికసిత భారత్‌లో ఇది పెద్ద అడుగు. ఇలా జరిగేలా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు అంటూ కేంద్ర మంత్రి 'జితేంద్ర సింగ్' తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

# ఇలా అయితే బంగారం అందరూ కొనుక్కోవచ్చు..!హాయిగా

**జనంసాక్షి:** బంగారం ధర రోజురోజుకూ పెరుగుతూ సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరింది. నెల రోజుల క్రితం అయితే ఏకంగా రూ.లక్షను దాటేసింది. ఆ తర్వాత కాస్త తగ్గినా ఇప్పటికీ రూ.లక్షకు చేరువలోనే ఉంది.దీంతో బంగారం కొనుక్కోవాలని ఆశ ఉన్నప్పటికీ సామాన్యులు మనం కొనలేములే అని ఆగిపోతున్నారు.సాధారణంగా బంగారం అంటే ఆభరణాల రూపంలోనే ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అసలే పెరిగిపోయిన ధరకు తోడు ఆభరణాలకు విధించే తరుగు, తయారీ చార్జీలతో కొనుగోలుదారులపై మరింత భారం పడుతోంది. దీంతో కాస్తంత బంగారం కొనాలన్నా అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అయితే దీనికో పరిష్కారం ఉందంటున్నారు నిపుణులు.అధిక బంగారం ధర ద్రవ్యోల్బణం వంటిది. డబ్బులు అవే కానీ వాటికి వచ్చే వస్తు ప్రతిఫలం తగ్గిపోతుంది. 2020లో మీ దగ్గర రూ.50,000 ఉంటే పది గ్రాముల బంగారాన్ని కొనుక్కునేవారు. కానీ ఇప్పుడు 5 గ్రాములు మాత్రమే వస్తుంది. బంగారం కొనడం



అనేది ఒక్కసారి చేసే వ్యాయామం కాదు. ఆర్థిక ప్రణాళికలో భాగంగా కాలక్రమేణా దానిని కూడబెట్టుకుంటూ ఉండాలి. అయితే బంగారాన్ని ఎందుకు కొనాలనుకుంటున్నారో స్పష్టత ఉండాలి. అంటే పెట్టుబడి ప్రయోజనాల కోసమా లేదా నగల కోసమా లేకుంటే వివాహ నిమిత్తమా అన్నది ఎరుక ఉండాలి. బంగారాన్ని ఆభరణాల రూపంలో కొంటే 5 నుండి 20 శాతం 'మేకింగ్ ఛార్జీలు' ఉంటాయి. అదే నాణేల రూపంలో కొంటే ఈ అనవసరమైన భారం ఉండదు.బంగారు నాణేలు కొంటే ప్రయోజనాలు బంగారు నాణేలు ధ్రువీకరించిన స్వచ్ఛతతో వస్తాయి. సాధారణంగా ఇవి 24 కేరట్లు (99.99 శాతం స్వచ్ఛత)లలో లభిస్తాయి.కావాల్సినప్పుడు అమ్మి నగదుగా మార్చుకోవచ్చు. వీటిని సులువుగా విక్రయించుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా వీటిని తీసుకుంటారు.బంగారం ఆభరణాలతో పోలిస్తే వీటిని భద్రపరచుకోవడం సులువు.బంగారు నాణేలు ధ్రువీకరణతో రావడం వల్ల స్వచ్ఛత, బరువుకు సంబంధించి ఎలాంటి భయం ఉండదు.ఆర్థిక అనిశ్చితి సమయాలలో బంగారం విలువకు ఢోకా ఉండదు.బంగారు నాణేలు అర గ్రాము నుంచి 100 గ్రాముల వరకు వివిధ బరువుల్లో లభిస్తాయి. కాబట్టి స్తోమతను బట్టీ ఎవరి ఎంత కావాలో అంత కొనుక్కోవచ్చు.నగల దుకాణాలు, ప్రభుత్వ సంస్థల నుంచి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో బంగారు నాణేలను కొనుగోలు చేయవచ్చు.

## పరుపు కింద జేమ్స్ బాండ్.. వంకరగా కూర్చుంటే కొడుతుంది!

**పిండేసిన శరీరాన్ని హీల్ చేస్తుంది**


ఎంతో హుషారుగా కొత్తగా జిమ్ జాయిన్ అయితే, ఆ తర్వాతి రోజే వర్కౌట్స్ నొప్పులు, 'ఇంకా ఒక్క అడుగు కూడా వేయలేం' అంటూ మిమ్మల్ని మొండికేసున్నాయా? అయితే, ఆ నొప్పుల పోరు తీర్చడానికి వచ్చింది ఈ 'థెరాగన్ రిలీఫ్'. ఇది వర్కౌట్స్ చేయగా వచ్చే కండరాల నొప్పుల నివారణకు ఉపయోగపడే ఒక సరైన మసాజ్ థెరపీ. సాధారణ మసాజ్ గన్ కంటే ఎంతో మెరుగ్గా పనిచేస్తుంది. ఇందులోని మూడు రకాల అటాచ్‌మెంట్లు శరీర భాగాలకు తగ్గట్టుగా ప్రొఫెషనల్ మసాజ్ చేస్తూ చాలా త్వరగా నొప్పిని పోగొడతాయి. ఒక్కసారి దీనిని వాడిన తర్వాత, శరీరం 'ఇంకా చేద్దాం వర్కౌట్.. థెరాగన్ ఉందిగా' అంటుంది. ధర 149 డాలర్లు (రూ. 12,725) మాత్రమే!వాచ్ వేసుకోమని బలవంతం చేయదు, రింగ్ పెట్టుకోమని అడగదు. కాని, మెల్లగా మీరు పడుకునే పరుపు కింద ఉండి, గుట్టుగా మిమ్మల్ని గమనిస్తూనే ఉంటుంది. చూడ్డానికి ఒక సాధారణ ప్యాడ్‌లాగా కనిపిస్తుంది. కాని, దీని పనితీరు చూస్తే ఎంతటివారైనా షాక్ తింటారు. ఎందుకంటే, మీ నిద్ర చరిత్ర అంతా ఒక్కసారికే చెప్పేయగలదు ఈ 'వితింగ్స్ స్లీప్ అనలైజర్'. సాధారణ స్లీప్ ట్రాకర్ మాదిరి కాకుండా, నిద్ర ఎప్పుడు మొదలైంది, ఎప్పుడు ముగిసింది, మధ్యలో మీకు వచ్చే కలలు, వాటి వలన మీలో కలిగే మార్పులు, హార్ట్ బీట్, ఒత్తిడి, నిద్రలో మీరెలా ఫీల్ అవుతున్నారు, గురక పెడుతున్నారా, గురక శబ్దం ఎంత గట్టిగా ఉంటోంది- ఇలా నిద్రకు సంబంధించిన మరెన్నో విషయాలను విశ్లేషించి వివరాలను అందిస్తుంది. అవసరమైన సలహాలు, సూచనలను కూడా ఇస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది నిద్ర ర హస్యాలను



బయటపెట్టే ఒక జేమ్స్‌బాండ్. ధర 129 డాలర్లు (రూ. 11,011) మాత్రమే! అందరికీ తెలిసిన రహస్యం, కుర్చీలో ఎలా పడితే అలా వంకరగా కూర్చోవడం కారణంగానే వెన్ను నొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని. మరి, తెలిసిన విషయమే అయినా, సరిగ్గా కూర్చోలేకున్నారా? అయితే, ఇకపై ఎప్పుడైనా వంకరగా కూర్చుంటే వెంటనే మీ వీపు పై 'టప్'మని కొట్టి, హెచ్చరిస్తుంది ఈ 'పోశ్చర్ ట్రైనర్'. చిన్న లాకెట్ రూపంలో చైన్‌తో పాటు ఉంటుంది. దీనిని మెడకు ధరించి లాకెట్‌ను వీపుకు వేలాడదీసుకుంటే, చాలు ఎప్పటికప్పుడు మీ కూర్చునే పోశ్చర్‌ను వైబ్రేషన్స్‌తో సూచిస్తూ, కుర్చీలో మీరు ఒక రాజులా ఠీవిగా కూర్చునేలా చేస్తుంది. ఒక్కసారి చార్జ్ చేస్తే దాదాపు ముప్పయి గంటలపాటు పనిచేస్తుంది.

## హెూండా నుంచి రెండు కొత్త బైకులు.. స్టన్నింగ్ లుక్‌తో..

గురుగ్రాం: హెూండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తన ప్రీమియం పోర్ట్‌ఫోలియోలో సీబీ750 హార్నెట్, సీబీ1000 హార్నెట్ ఎస్పీ పేర్లతో రెండు మోటార్స్‌సైకిళ్లను విడుదల చేసింది.వీటి ఎక్స్ షోరూం ధరలు రూ.8,59,500లు, రూ.12,35,900గా ఉన్నాయి. ఈ రెండు మోడళ్లకు బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి.హెూండా సీబీ750 హార్నెట్755సీసీ, సీబీ1000 హార్నెట్ ఎస్పీ 999సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్లు కలిగి ఉన్నాయి. ఈ బైకుల్లో 6-స్పీడ్ గేర్‌బాక్స్, అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్ ఉన్నాయి. డ్యూయల్ చానల్ ఏబీఎస్ ఫీచర్ ఉంది. అయిదు అంగుళాల కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఉంది. బ్లూటూత్ కనెక్టివిటీ, టర్న్ -బై -టర్న్ నావిగేషన్, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ (హెూండా రోడ్‌సింక్), యూఎస్‌బీ చార్జింగ్ పోర్ట్ ఉన్నాయి. రెండు బైకుల్లో స్పోర్ట్, స్టాండర్డ్, రెయిన్, యూజర్ అనే నాలుగు రైడింగ్ మోడ్‌లు ఉన్నాయి. హెూండా సెలెక్టబుల్ టార్క్ కంట్రోల్‌తో 3 స్థాయిల ట్రాక్షన్ కంట్రోల్ కూడా ఉంటుంది. సీబీ750 హార్నెట్ బిగ్‌వింగ్ టాప్‌లైన్, బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌లో అందుబాటులో ఉంచగా, సీబీ 1000 హార్నెట్ ఎస్పీ మాత్రం ప్రత్యేకంగా బిగ్‌వింగ్ టాప్‌లైన్ డీలర్‌షిప్‌ల ద్వారా మాత్రమే విక్రయిస్తుంది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.80 | ₹ 4.82 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 90,750 (22 క్యారెట్లు) | ₹ 99,000 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,11,000

# మానవాళిని కష్టాల కడలిలోకి నెట్టేస్తున్న పోరాటాలు, యుద్ధాలు

వాషింగ్టన్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొద లు హమాస్, ఇజ్రాయెల్ పోరు, ఎర్రసముద్రంలో హౌతీల క్షిపణి దాడులదాకా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న పోరాటాలు, యుద్ధాలు, ఉద్యమాలు, సైనిక చర్యలతో ప్రపంచ జనాభాలో సగం మంది సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నారని అంతర్జాతీయ నివేదిక ఒకటి వెల్లడించింది.ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాక్‌ల కారణంగా దక్షిణాసియాలోనూ ఉద్రిక్త వాతావరణం నెలకొందని "సాయుధ సంక్షోభాలు, ప్రాంతాలు, సంఘటనలు(ఏసీఎల్ఈడీ)"సంస్థ తెలిపింది.స్వతంత్ర్యంగా పనిచేసే లాభాపేక్షలేని ఏసీఎల్ఈడీ సంస్థ ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, సంక్షోభాల వివరాలతో ఒక నివేదికను రూపొందించింది. చాలా సంవత్సరాలుగా ఊహించనంతగా చాలా దేశాల్లో సంక్షోభాలు ఉన్నప్పటికీ కేవలం గత 12 నెలల్లో పరిణామాలను గమనిస్తేనే 50 దేశాల్లో 423 కోట్ల మంది ప్రజలు పలు రకాల సంక్షోభాలకు బాధితులుగా మిగిలిపోయారని గణాంకాలు ఘోషించాయి.2024 డిసెంబర్‌నాటి 'సంక్షోభ సూచీ'గణాంకాల ప్రకారం 10 దేశాలు అత్యంత సంక్షుభిత దేశాలుగా, 20 దేశాలు అతి, మధ్యస్థ స్థాయి సంఘర్షణలకు కేంద్రస్థానాలుగా తయారయ్యాయి. పాలస్తీనా 2024 ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా అత్యంత దయనీయమైన ప్రాంతంగా మారింది. మయన్మార్‌లో ఏకంగా 170 సాయుధ గ్రూప్‌లు క్రియాశీలకంగా ఉన్నాయి. ఉక్రెయిన్ సైతం దారుణమైన యుద్ధసంక్షోభాన్ని చవిచూస్తోంది.పలు దేశాల్లో బలహీనమైన నాయకత్వం, మిత్రదేశం కోసం అప్పటికే జరుగుతున్న యుద్ధంలో కలగజేసుకోవడం, దేశాల మధ్య చెడిన సఖ్యత,మారిన ప్రభుత్వాల అంతర్జాతీయ విధానాలు, పొరుగు దేశాల పట్ల శత్రుభావన స్థాయిలో మార్పులు, దేశంలో చెలరేగిన విద్వేషాలను పొరుగుదేశాలు సొమ్ముచేసుకోవడం, ఉద్దేశపూర్వకంగా వైషమ్యాలను రెచ్చగొట్టి ఉద్యమాలకు తెరతీయడం వంటి పలు రకాల ఉదంతాలతో ఆయా దేశాల్లో ప్రజాజీవనంఅస్తవ్యస్తమవుతోంది. నిత్యావసరాలూ మృగ్యమయ్యాయి. 1960 దశకంలో కలహాలతో సమస్యల వలయంలో చిక్కుకున్న దేశాల సంఖ్య 15గా ఉండేది. 1991 ఏడాదికి వచ్చేసరికి ఈ సంఖ్య ఏకంగా 53 దేశాలకు పాకింది. తర్వాత 2000 సంవత్సరానికి వైషమ్యాలు బాగా సమసిపోయాయి. ఆ తర్వాత మళ్లీ పుంజుకుని 2010 ఏడాదికల్లా 31 దేశాల్లో ఘర్షణలు, యుద్ధమేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. ఇక 2023 ఏడాదికల్లా సమరంలో కత్తులు దూసుకుంటున్న దేశాల సంఖ్య రికార్డ్‌స్థాయిలో 59కి పెరిగింది.మరణాల సంఖ్య సైతం ఇదే పంథాలో కొనసాగింది. 1960 ఏడాదిలో యుద్ధాలు, పోరాటాలు, ఉద్యమాల్లో 64,873 మంది ప్రాణాలు కోల్పోయారు. 1990 ఏడాదిలో ఏకంగా 80,297 మంది అమాయకులు చనిపోయారు. 2005 ఏడాదికి వచ్చేసరికి ఈ జగడాల్లో మరణాల సంఖ్య 12,150కి దిగివచ్చింది. ఇక ఉక్రెయిన్, రష్యా యుద్ధంసహా ప్రపంచవ్యాప్తంగా



వైషమ్యాలు, దేశాల మధ్య కలహాలు కట్టుతప్పడంతో 2022 ఏడాదిలో మరణాలు రికార్డ్ స్థాయిలో 2.77 లక్షలను దాటేశాయి. "ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాతి నుంచి చూస్తే విశ్వావ్యాప్తంగా దేశాల మధ్య రణాల గొణ ఇప్పుడే ఎక్కువగా ఉంది. దేశాల మధ్య గొడవలకు తోడు దేశీయంగానూ ఉద్యమాలు, అల్లర్లు, హింస కారణంగా మృత్యువు ఒడిలోకి చేరుతున్న అమాయక ప్రజల సంఖ్య ఏటికేడు పెరిగిపోతోంది"అని ఓస్లోలోని పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ ప్రొఫెసర్ సిరి అసద్ రుస్తాద్ ఆందోళన వ్యక్తంచేశారు."ఇప్పటికే సగం ప్రపంచ జనాభాకు సమరాల సెగ తగులుతోంది. ఈ విద్వేషాగ్ని ఇప్పట్లో చల్లారేలా లేదు. దాదాపు ఏడాదిన్నర యుద్ధం తర్వాత కూడా ఇజ్రాయెల్ ఆదివారం గాయాల గాజాపై మరింతగా క్షిపణులను ఎక్కుపెట్టడమే ఈ దారుణపర్వానికి ప్రబల తార్కాణం"అని రుస్తాద్ వ్యాఖ్యానించారు.

## పాకిస్తాన్‌కు అసదుద్దీన్ ఒవైసీ స్ట్రాంగ్ వార్నింగ్

**మనామా:** దాయాది దేశం పాకిస్తాన్‌పై ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ ఓ విఫల దేశమని ఘాటు విమర్శలు చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదం కారణంగా ప్రపంచమే ముప్పును ఎదుర్కొంటోందన్నారు.ఇదే సమయంలో భారత ప్రభుత్వం.. ప్రతీ భారతీయుడి ప్రాణాలను రక్షించడానికి అన్న చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.ఒడిశా బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలో వచ్చిన ఏడుగురు సభ్యుల అఖిల బృందం శనివారం బహ్రెయిన్‌కు చేరుకుంది. ఈ బృందంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా బహ్రెయిన్‌లో ఎంపీ అసద్ మాట్లాడుతూ.. 'చాలా సంవత్సరాలుగా భారత్ ఎదుర్కొంటున్న ముప్పును ప్రపంచానికి తెలియజేసేలా మా ప్రభుత్వం మమ్మల్ని ఇక్కడికి పంపింది. దురదృష్టవశాత్తు పాకిస్తాన్ కారణంగా మేము చాలా మంది అమాయకుల ప్రాణాలను కోల్పోయాం. పాకిస్తాన్ ఉగ్రవాద గ్రూపులను ప్రోత్సహించడం, వారికి సహాయం చేయడం, స్పాన్సర్ చేస్తోంది. ఇలాంటి కార్యక్రమాలను పాకిస్తాన్ ఆపకపోతే ఉగ్రవాద సమస్య తొలగిపోదు.ప్రతీ భారతీయుడి ప్రాణాలను రక్షించడానికి మా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఒకవేళ పాకిస్తాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే భారత్ మరింత దూకుడుగా వ్యవహరించేందుకు, మర్నిని దాడులు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈసారి ప్రతిదాడి మామూలుగా ఉండదు. పాకిస్తాన్‌కు సరైన బుద్ధి చెబుతాం. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయంతో ముందుకు వెళ్తోంది. పాకిస్తాన్ రెచ్చగొట్టే ప్రయ?త్నాలు చేస్తున్నప్పటకీ భారత్ సంయమనం పాటించింది. పహల్గాంలో జరిగిన ఉగ్రవాది విషయమై అందరూ ఆలోచించండి. ఆరు రోజుల క్రితం వివాహం చేసుకున్న ఒక మహిళ ఏడో రోజున వితంతువు అయ్యింది. కేవలం రెండు నెలల క్రితం వివాహం చేసుకున్న మరో మహిళ కూడా ఈ దాడిలో తన భర్తను కోల్పోయింది. ఇలాంటి దారుణాలు పాకిస్తాన్ వల్లే జరుగుతున్నాయి.మేమంగా వేరువేరు రాజకీయ పార్టీలకు చెందినప్పటికీ దేశం విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నాం. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ.. దేశ సమగ్రత విషయానికి వస్తే అందరం ఒక్కటయ్యాం. పాకిస్తాన్‌న గ్రే లిస్ట్‌లోకి తీసుకురావడంలో బహ్రెయిన్ ప్రభుత్వం మాకు సహాయం చేస్తుందని నేను ఆశిస్తున్నాను. అంటూ చెప్పుకొచ్చారు.ఇదిలా ఉండగా.. రాజకీయంగా భిన్నమైన అభిప్రాయాలను కలిగిన ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ నేత నిశికాంత్ దూబేలు ఒక అంశంలో కలిసి పనిచేయాల్సి రావడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. భిన్న ధ్రువాలుగా ఉండే ఈ ఎంపీలు పాకిస్తాన్ ఉగ్రవాద ఉన్మాదాన్ని ఎండగట్టేందుకు పాక్ దుర్మార్గాలను వివరించేందుకు సౌదీ అరేబియాతో పాటు కువైట్, బహ్రెయిన్ దేశాల పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే.



## ఉక్రెయిన్-రష్యా మధ్య 390 మంది యుద్ధ ఖైదీల మార్పిడి

కీవ్: తుర్కియే చర్చల సమయంలో కుదిరిన అంగీకారం మేరకు ఉక్రెయిన్, రష్యా యుద్ధ ఖైదీల మార్పిడి ప్రక్రియ మొదలైంది. ఉక్రెయిన్-బెలారస్ సరిహద్దుల్లో శుక్రవారం చెరో 390 మంది యుద్ధ ఖైదీలను పరస్పరం అప్పగించుకున్నాయి.2022లో రష్యా దురాక్రమణ మొదలయ్యాక ఈ స్థాయిలో యుద్ధ ఖైదీల మార్పిడి జరగడం ఇదే మొదటిసారి. ఉక్రెయిన్ అప్పగించిన తమ 390 మంది సైనికులు, పౌరులను వెంటనే బెలారస్‌కు వైద్య పరీక్షల నిమిత్తం పంపించినట్లు రష్యా అధికారులు వెల్లడించారు. రష్యా సైతం తమ 390 మంది సైనికులను అప్పగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు.మొత్తం వెయ్యి మంది యుద్ధ ఖైదీలను పరస్పరం మార్చుకునేందుకు 16న తుర్కియేలో ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందులో మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, ఈ వారాంతంలో మరికొందరిని ఇచ్చిపుచ్చుకునే అవకాశాలున్నాయని జెలెన్‌స్కీ వివరించారు. కాగా, తదుపరి చర్చల విషయంలో ఎలాంటి అంగీకారం కుదరలేదని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ పేర్కొంది. ఖైదీల మార్పిడి పూర్తయ్యాక దీర్ఘకాల, సమగ్ర శాంతి ఒప్పందం కోసం రూపొందించిన షరతుల ముసాయిదాను ఉక్రెయిన్‌కు అందజేస్తామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ చెప్పారు.యుద్ధ ఖైదీల మార్పిడి ప్రక్రియ ఒక వైపు కొనసాగుతుండగానే రష్యా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై శుక్రవారం రాత్రి పెద్దసంఖ్యలో క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. సైరన్ మోతలు, పేలుళ్ల శబ్దాలతో కీవ్ వాసులు బాంబు షెల్టర్లలో రాత్రంతా గడిపారు.

## అప్పుడు రూ.1.25 లక్షల జీతం.. ఇప్పుడు ఫుడ్ డెలివరీ ఉద్యోగం..

జీవితం అందరికీ ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎత్తుపల్లాలు.. ఒడిదుడుకులు ఉంటాయి. ఒక్కోసారి నిచ్చెనెక్కించి గొప్ప స్థాయికి తీసుకెళ్తుంది. కొన్నిసార్లు ఊహించని విధంగా కిందకు పడేస్తుంది.ఉన్నత స్థాయికి చేరి ఉత్తమ జీవనం గడుపుతున్నప్పటికీ ఎప్పుడేం జరుగుతుందో తెలీదు. అందుకే అన్నింటికీ సిద్ధమై ఉండాలి. ఏది ఎదురైనా ఆనందంగా స్వీకరించాలి.. సంతోషంగా ఆస్వాదించాలి.. ఈ ఫుడ్ డెలివరీ ఉద్యోగి జీవితం చెబుతున్న పాఠం ఇదే.. ఒక ఫుడ్ డెలివరీ రైడర్ తనకు ఆహారం మాత్రమే కాదు.. జీవిత పాఠాన్ని అందించారంటూ ఆయన స్ఫూర్తిదాయకమైన కథను ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు పుణెకు చెందిన శ్రీపాల్ గాంధీ. ఈ జీవితగాథ సోషల్ మీడియాలో నెటిజనులను హత్తుకుంటోంది. ప్రశంసలు వెల్లువను అందుకుంటోంది. ప్రస్తుతం ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలు మన దైనందిన జీవితంలో భాగమయ్యాయి. చాలా మంది ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి ఆహారం తెప్పించుకుంటుంటారు. ఏదైనా మిస్ అయినా, పొరపాటు జరిగినా ఆ తెచ్చిన వ్యక్తి మీద అరుస్తుంటారు. కానీ శ్రీపాల్ గాంధీ డెలివరీ రైడర్‌ను మెల్లగా కదిలించి అతని జీవితం గురించి తెలుసుకునే ప్రయత్నం చేశారు. శ్రీపాల్ గాంధీ సబ్‌వే నుండి లంచ్ ఆర్డర్ పెట్టారు. ఫుడ్ డెలివరీ రైడర్ ఆహారాన్ని తీసుకొచ్చాడు. కానీ పాకెట్ చూడగానే



అందులో శాండ్‌విచ్ మాత్రమే ఉందని, మిగిలిన పదార్థాలు మిస్ అయ్యాయని శ్రీపాల్ గుర్తించి డెలివరీ రైడర్‌కు చెప్పారు. కాసేపు కంగారు పడిన డెలివరీ రైడర్ "రెస్టారెంట్ లేదా జొమాటోకు కాల్ చేయండి సార్" అంటూ వినయంగా జవాబిచ్చాడు. దీంతో శ్రీపాల్ సబ్‌వే వారిని సంప్రదించగా క్షమాపణలు చెప్పి 'రైడర్‌ను వెనక్కి పంపగలరా?' మిస్ అయిన వాటిని తిరిగిపంపుతాం.. అతనికి రూ.20 చెల్లిస్తాం' అని బదులిచ్చారు.ఫుడ్ అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్ జొమాటో ఆదేశిస్తే తప్ప డెలివరీ భాగస్వాములు రెస్టారెంట్‌కు తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే తమ రైడర్లకు చెల్లించేది జొమాటో. రెస్టారెంట్ కాదు. అయినా ఈ డెలివరీ ఏజెంట్ ఏమాత్రం వెనుకాడలేదు. "సార్, అది నా బాధ్యత. కస్టమర్ సంతోషమే తాను కోరుకుంటాను" అంటూ మళ్లీ రెస్టారెంట్‌కు వెళ్లి మిస్ అయిన వాటిని తిరిగి తీసుకొచ్చాడు. సబ్‌వే వాళ్ల నుంచి రూ.20 పరిహారాన్ని కూడా ఆయన తీసుకోలేదు. "దేవుడు నాకు ఎ0తో ఇచ్చాడు. ఒకరు చేసిన పొరపాటుకు నేను ఈ డబ్బు ఎందుకు తీసుకోవాలి? అంటూ అతను శ్రీపాల్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. రైడర్ తన గతం గురించి శ్రీపాల్ గాంధీ వద్ద ఓపెన్ అయ్యాడు. షాపూర్జీ పల్లోంజీలో కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ నెలకు రూ.1.25 లక్షల జీతం అందుకునేవారు. కానీ ఒక కారు ప్రమాదం అతని జీవిత గమనాన్ని మార్చేసింది. ఎడమ చేయి, కాలు పక్షవాతానికి గురయ్యాయి. తన ఉద్యోగాన్ని, స్థిరత్వాన్ని, కొంతకాలానికి ఆశను కోల్పోయాడు. ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో అతనికి తోడ్పాటు అందించింది. ఫుడ్ డెలివరీ పార్ట్‌నర్‌గా అవకాశమిచ్చింది. తన కుమార్తె ఇప్పుడు దంతవైద్యం చదువుతోందని శ్రీపాల్‌తో ఫుడ్ డెలివరీ రైడర్ అన్నారు. కేవలం ఆదాయం కోసమే కాకుండా తన కలను సజీవంగా ఉంచుకోవడానికి ఆయన రైడ్ చేస్తున్నారని శ్రీపాల్ గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "అతను జీవితాన్ని నిందించలేదు. ఫిర్యాదులు చేయలేదు. సాకులు చెప్పలేదు" అని రాసుకొచ్చారు. స్వామి సమర్థ్‌ను విశ్వసించే అతను 'దేవుడు నాతో ఉన్నాడు. నేనెందుకు కంగారు పడాలి?" అని నవ్వుతూ అన్నాడని శ్రీపాల్ వివరించారు."ఈ రోజు నాకు శాండ్ విచ్ వచ్చింది. కానీ కృతజ్ఞత, స్థిరత్వం, ఆశావాదం నా దగ్గరే నిలిచిపోయాయి" అంటూ తన పోస్ట్ ను ముగించారు. అతనికి ఉపాధి కల్పించిన జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోస్ట్ వైరల్‌గా మారి నెటిజనుల ప్రశంసలు అందుకుంది. అలాంటి వారికి సెల్యూట్.. వావ్, అద్భుతం.. నిజంగా స్ఫూర్తిదాయకం అంటూ కామెంట్లు పెట్టారు.

## మూడొంతుల భాషలు ఇక్కడివే..

ఆఫ్రికాఖండం పేరు వినగానే మనకు వలసవాదం, వర్ణవివక్షకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు గుర్తుకువస్తాయి. ఆఫ్రికాలో విభిన్న సంస్కృతులు, భాషలు కనిపిస్తాయి.అలాగే ఇక్కడి చరిత్ర ఎంతో ప్రత్యేకమైనది. ఈ రోజు(మే 25) ఆఫ్రికా దినోత్సవం. ఈ సందర్భంగా ఈ ఖండానికి సంబంధించిన పలు ఆసక్తికర అంశాలను ఇప్పుడు తెలుసుకుందాం.ఆఫ్రికా ఖండంలోని విభిన్న సంస్కృతులు, చరిత్ర, విజయాలను గుర్తు చేసుకునేందుకు ప్రతియేటా మే 25న ఆఫ్రికా దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1963 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఆర్గనైజేషన్ ఆఫ్ ఆఫ్రికన్ యూనిటీ (ఓఏయూ) స్థాపనకు సూచికగా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

## సంక్షిప్తంగా..



### ఎడపల్లి సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులుగా పోల మల్కారెడ్డి

**ఎడపల్లి, మే 25 ( జనంసాక్షి ) :** ఎడపల్లి మండల సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులుగా ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఎడపల్లి సహకార సంఘం భవనంలో సీనియర్ సిటిజన్ ఫోరం బోధన్ డివిజన్ అధ్యక్షులు మురహరి, స్టేట్ కార్యదర్శి పి.విశ్వనాథం ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ మేరకు అధ్యక్షులుగా పోల మల్కారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెరిక రాజలింగం, కోశాధికారిగా జనగం వెంకట రెడ్డి, ఉపాధ్యక్షులుగా యస్.గంగాధర్, సి.నారాయణ, కె.శంకర్ గౌడ్ సహాయ కార్యదర్శులుగా కల శంకర్, జె. మోహన్ కార్యవర్గ సభ్యులుగా బి.సత్యనారాయణ, సి.గంగారెడ్డి, బి.నరసింహ రాజు, వి.సత్యనారాయణ స్వామి, గెంటె మల్కన్న, ప్రధాన సలహాదారులుగా బంజ కామప్ప, కె.పండరినాథ్ రావులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ మూడు సంవత్సరాల పాటు కొనసాగనుంది.

### రేణుక ఎల్లమ్మ రెండవ వార్షికోత్సవ వేడుకలు



**ఎడపల్లి, మే 25 ( జనంసాక్షి ) :** ఎడపల్లి మండల కేంద్రంలోని నయాబాదీలో గల రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ రెండవ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం కౌండిన్య గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మ వారికి పంచామృత అభిషేకాలు, వింజరా సేవ, పుష్పబి షేకం మరియు కుంకు మఅర్చన, గ్రామ దేవతలకు పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ ఎల్లా గౌడ్, కేసరి రవీందర్ గౌడ్, నటరాజ్ గౌడ్, కేసరి ప్రభా కర్ గౌడ్, నాగ గౌడ్, ఆర్ స్వామి గౌడ్, రాజా గౌడ్, కేసరి రమణ గౌడ్, పెంటా గౌడ్, పుట్ట అశోక్ గౌడ్, ఆకుల నర్సా గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**బోధన్, మే 25 ( జనంసాక్షి ) :** బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రధానంగా ఏడాది పదవీ విరమణ చేయుచున్న పూర్వ ఉపాధ్యాయురాలు ప్రస్తుత డిగ్రీ లెక్చరర్ శ్రీదేవిని విద్యార్థులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఆమె ఇక్కడే ఉపాధ్యాయులుగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు ఆమెను సన్మానించి వీడ్కోలు పలికారు. వివిధ హోదాలో స్థిరపడిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు కిషోర్, శర్మ, మంథజొద్దీన్, అరిఫోద్దీన్, ముఖీమ్, నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ముగిసిన సమ్మర్ క్యాంప్



బోధన్, మే 25 ( జనంసాక్షి ) : రాష్ట్ర విద్యా సంచాలకుల ఆదేశాల మేరకు బోధన్ మండలంలోని అర్బన్ మరియు రూరల్ పాఠశాల ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఈనెల 10వ తేదీ నుండి నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ఆదివారం ఉప విద్యాశాఖ అధికారి బోధన్ కార్యాలయంలో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ మండల విద్యాధికారి నాగయ్య మాట్లాడుతూ, సమ్మర్ క్యాంపులో నేర్చుకున్నటువంటి కరాటే ద్వారా భవిష్యత్తులో జీవితంలో బాలికల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించు కొనుటకు ఉపయోగపడుతుందన్నారు. బోధన్ మండల విద్యాధికారి నాగయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ అశోక్ కుమార్ రోడే, డ్రాయింగ్ టీచర్ అవంతి, సంగీత ఉపాధ్యాయురాలు సరళ, డాన్స్ మాస్టర్ శ్రీకాంత్, సి ఆర్ పి బాబు, విజయ్, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా ఇందిరమ్మ ఇళ్లు

**త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకోవాలి.**
**పెట్టుబడి లేని నిరుపేదలకు మెప్మా నుంచి రుణం.**
**ఇండ్ల నిర్మాణాలకు ఇసుక ఉచితం.**
**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



సిరిసిల్ల టౌన్ మే 25 జనంసాక్షి:ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన వారంతా త్వరిత గతిన ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఆదివారం రెండో విడత కింద 764 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ మంజూరు ఉత్తర్వులు సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానం ఆవరణ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, కే కే మహేందర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సిరిసిల్లలో 764 మందిని పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలని స్పష్టం చేశారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయలు, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు,ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ వెల్లడించారు.

**మంజూరు పత్రాలు ఇవ్వడం సంతోషం**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతి వారం నిర్వహించే ప్రజావాణికి ప్రజలు వచ్చి తమకు ఇండ్లు ఇప్పించాలని కోరేవారని కలెక్టర్ గుర్తు చేశారు. అలాంటి పేదలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఇవ్వడం సంతోషంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయాన్ని పొంది తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు.

పురోగతి ప్రకారం నిధుల విడుదలలి ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని, ఎక్కడా పైరవీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

**ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఇసుక అందుబాటులో పెడతామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం సంబంధిత వార్డ్ ఆఫీసర్లు తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. రవాణా ఛార్జీలు చెల్లించాలని కలెక్టర్ సూచించారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో మెప్మా నుంచి రుణం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ వెలుముల స్వరూపారెడ్డి, సెస్ ఛైర్మెన్ చిక్కాల రామారావు, హౌసింగ్ పీడీ శంకర్, డిఆర్డిఓ శేషాద్రి, మున్సిపల్ కమిషనర్ వాణి,సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మునీర్ మరణం తీరనిలోటు



**సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్..**

**గోదావరిఖని, జనంసాక్షి :**సింగరేణి మాజీ ఉద్యోగి, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమ సమయంలో సకలజనుల సమ్మెలో సింగరేణి విభాగానికి కన్వీనర్గా, పలు సమాజ హిత ఉద్యమాలలో కీలక భూమిక పోషించిన మునీర్ మరణం పాత్రికేయ రంగానికే గాక తెలంగాణ సమాజానికి తీరని లోటని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు.మునీర్ పాత్రికేయుడిగా పనిచేస్తూ, కార్మిక పక్షపాతిగా అనేక సింగరేణి కార్మిక సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారని,చివరి వరకు పాత్రికేయులుగానే కొనసాగుతూ అనేక సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ప్రజాసేవ చేశారన్నారు. ఆయన అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం తెలుపుతూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

**మునీర్ మరణం సింగరేణికి తీరనిలోటు..**

గోదావరిఖని, జనంసాక్షి : మునీర్ ఆకస్మిక మరణం సింగరేణి కార్మిక వర్గానికి తీరనిలోటని ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ నెటవర్క్ (ఐడి జెఎన్) ఛైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మంద జనార్దన్, కో -కన్వీనర్ ఎడ్ల సంజీవ్ అన్నారు. అనారోగ్యంతో శనివారం రాత్రి మునీర్ ఆకస్మిక మరణం చెందారు. మునీర్ మరణించాడంటే నమ్మలేక పోతున్నాము.తండ్రి కార్మికునిగా పనిచేయడంతో మొదట అటువైపు అడుగులు వేశారు.ఆలా కార్మికుని కొడుకుగా, కార్మికుడిగా పని చేస్తూనే కార్మిక సమస్యలపై విప్లవ కార్యకర్తగా పని చేశారు.మరోవైపు ప్రజా సమస్యలను వెలికి తీస్తూ, కార్మిక సమస్యపై స్పందిస్తూ జర్నలిస్టుగా కొనసాగారు. తెలంగాణ ఉద్యమకారుడిగా అన్ని భాద్యతలను ప్రేమతో, సమర్థవంతంగా నిర్వహించిన గొప్ప నాయకుడు.అటువంటి నాయకుడు, మా మిత్రుణ్ణి కోల్పోవడం భవిష్యత్ సమాజానికి ఎనలేని నష్టం.ముఖ్యంగా సింగరేణి కార్మిక వర్గానికి తీరనిలోటు.ఈ సందర్భంగా ఐడిజెఎన్ రాష్ట్ర కమిటీ తరుపున మునీర్ కుటుంబానికి సంతాపం తెలిపారు.

# ప్రోటోకాల్ వివాదం..

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టని బిఆర్ఎస్ నాయకులు**
**జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మునిగేల రాజు..**



తంగళ్ళపల్లి మే 25 (జనంసాక్షి):నెలకు ఒకసారి సిరిసిల్లకు వచ్చే కేటీఆర్ కు ప్రోటాకాల్ ఎందుకని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగేల రాజు తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటో పెట్టని మీరా ప్రోటోకాల్ గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రజల్లో ఉండని నాయకుడికి ప్రోటోకాల్ ఎందుకని ప్రశ్నించారు. బిఆర్ఎస్ లీడర్ సైతం ఆలోచన చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలవకపోయినా అధికార పార్టీ నేతగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలే తన ప్రోటోకాల్ గా పనిచేస్తున్న వ్యక్తి సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి అని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన కేటీఆర్ బాధ్యత మరిచి గాలికి తిరుగుతుంటే ప్రజల పట్ల తనకున్న బాధ్యతను కేకే మహేందర్ రెడ్డి నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బర్త్డే పార్టీలకు, మందు బాబులకు అడ్డగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు అండగా ఉంటే బిఆర్ఎస్ నేతల కళ్ళు మండుతున్నాయని వెల్లడించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టకపోతే కాంగ్రెస్ నేతలందరూ కదిలోచ్చి ప్రోటోకాల్ ప్రకారం సీఎం ఫోటో పెడతామని హెచ్చరించారు. అధికార పార్టీ కార్యక్రమంలో కెసిఆర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నప్పుడు ఎక్కడికి పోయింది ఈ ప్రోటాకాలని ప్రశ్నించారు. ఇకనైనా బిఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేదంటే ప్రజలే ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు చోటు, వినోద్, శ్రీనివాస్, అనిల్, దేవదాస్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



### జీఎం సూర్యనారాయణను సన్మానించిన జీఎం లలిత్..

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి సంస్థ కొత్తగూడెం కార్పొరేట్లో జనరల్ మేనేజర్ (సివిల్)గా విశిష్ఠ సేవలందించి ఈ నెల చివరిలో పదవీ విరమణ పొందనున్న తిరుకోటి సూర్యనారాయణను ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ లలిత్కుమార్ అధ్యక్షతన వివిధ విభాగల అధికారులు పూలమాలలు, బొకెలు అందజేసి..శాలువాలతో ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కంపెనీలోనే కీలకమైన జీఎం(సివిల్)గా ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు, అభివృద్ధి పనులను కొనియాడారు.పదవీ విరమణ తరువాత ఆయన ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం గోపాల్సింగ్, డీజీఎం (పర్సనల్) కిరణ్బాబు, ఇతర అధికారులు వెంకటేశ్వర్రావు, ఆంజనేయులు, సాయిప్రసాద్, కర్ణ, నాగేశ్వర్రావు, వరప్రసాద్, ధనలక్ష్మిబాయి, వీరారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నియామక పరీక్షను సమీక్షించిన కలెక్టర్



**కరీంనగర్ బ్యూరో, మే 25 (జనంసాక్షి)**
కరీంనగర్ సప్తగిరి కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రామ పాలన అధికారుల(జి. పి.ఓ) నియామక పరీక్షను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం సమీక్షించారు. గత ప్రభుత్వం రద్దు చేసిన వీఆర్వో, వీఆర్ఏలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు, గ్రామాల్లో రెవిన్యూ సేవల పునరుద్ధరణ కోసం గ్రామ పాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఈ మేరకు జిపిఓ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వీఆర్వో, వీఆర్ఏలకు ఆదివారం సప్తగిరి కాలనీలోని జడ్పీహెచ్ఎస్ లో రాత పరీక్ష నిర్వహించారు. 189 మంది వీఆర్వో, వీఆర్ఏలు ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోగా 172 మంది పరీక్షకు హాజరయ్యారు. రాత పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న, హాజరైన అభ్యర్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్వో పవన్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, డివైఎస్ఓ శ్రీనివాస్, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.



### అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం

**20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు**

**సుల్తానాబాద్,మే 25(జనంసాక్షి) :** మండలంలోని నారాయణపూర్ గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం 2004 ,2005 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం అలరించింది. గత 20 సంవత్సరాల,స్మృతులను నెమరు వేసుకొని, ఆటపాటలతో తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించి సంతోషంతో పొంగిపోయారు. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చిన ఆదుకోవాలని పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పలువురు వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్ కిషన్ రావు,శ్రీనివాస్ ,జగత్ పాల్ భరత్ కుమార్ ,చంద్రమౌళి ,లక్ష్మి ,నారాయణ జ్యోతి , పూర్వ విద్యార్థులతో పాటు,తదితరులు పాల్గొన్నారు.



### మై గ్రోమోర్ షాప్ ఏర్పాటు

గంభరావుపేట మే 25 (జనంసాక్షి):గంభరావుపేట మండల కేంద్రంలో ఆదివారం రోజు నూతనంగా మైగ్రోమోర్ షాపు ప్రారంభోత్సవం నిర్వహించారు, జనరల్ మార్కెట్ మేనేజర్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ, మండలంలోని రైతులకు, నాణ్యమైన విత్తనాలతో పాటు, మందులు, ఎమ్మార్పీ రేటు ప్రకారం ఇవ్వబడుతుందనిసద్వినియోగం చేసుకోగలరని చెప్పారు, మై గ్రోమోర్ యాప్ ద్వారా డోర్ డెలివరీ, ఇస్తామని , ఇందులో విత్తనాలు తీసుకున్న మందులు తీసుకున్న రైతులకు ఇన్సూరెన్స్ ఇస్తామని, చెప్పారు, ఈ కార్యక్రమంలో గ్రోమోర్ జనరల్ మార్కెట్ మేనేజర్ వరద రాజేశ్వరరావు, ఏరియా మార్కెటింగ్ రూరల్ ఆఫీసర్ నరేష్, ఆర్ ఎ సి శ్రీనివాస్, స్టోర్ మేనేజర్ హరికృష్ణ, తో పాటు వివిధ గ్రామాల రైతులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం నగరపాలక సంస్థ పరిధి గాంధీనగర్లోని గీతాంజలి హైస్కూల్లో 2000-2001 బ్యాచ్లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు 25 సంవత్సరాల పూర్తిఅయిన సందర్భంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఓ ప్రైవేట్ బంకెట్హాల్లో నిర్వహించారు.ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ కంది రవీందర్రెడ్డి, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.అనంతరం వారి జ్ఞాపకాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు పంచుకున్నారు.విద్యార్థిని, విద్యార్థులు చదువుకున్న రోజుల్లో కొన్ని సంఘటనలను గుర్తు చేసుకొని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



### ముచ్చర్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించిన పొన్నం, కేకే...

**గంభీరావుపేట మే 25(జనంసాక్షి):**
మండల కేంద్రంలోని ముచ్చర్ల గ్రామానికి బస్సు లు లేకపోవడంతో గ్రామస్థులు ఎదురుకొంటున్న సమస్యలను గ్రామ శాఖ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ప్రజాప్రతి నిధులకు, రవాణా శాఖ అధికారులకు దృష్టి కి తీసుకవెళ్లారు,దీంతో సానుకాలంగా స్పందించిన సిరిసిల్ల డిపో కు పల్లె వెలుగు బస్సును ఆదివారం ప్రారంభించారు.రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి ప్రజా రవాణా కోసం బస్సులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు.దీంతో బస్సుల పునః ప్రారంభం కోసం కృషి చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కెకె మహేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మాజీ ఏంపీటీసీ అవునూరి లక్ష్మయ్య, కార్యకర్తలు గుమ్ముల రాజాం, యడారాపు పోషయ్య, కుంట రాజా మల్లయ్య, అవునూరి రమేష్,మెతుకు నర్సింలు, సుధాకర్ రెడ్డి, నర్సయ్య,శంకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



### పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం అందజేత

మంథని, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన ఎండి పాహీం కూతురు పర్వీన్ వివాహం సందర్భంగా పేదింటి చెందిన వారి ఆర్థిక పరిస్థితి బాగా లేక హెల్పింగ్ హ్యాండ్స్ మహిళా అధ్యక్షురాలు నారగోని సరిత నీ సంప్రదించగా, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులం అంతా కలిసి జమ చేసిన మొత్తం రూపాయలు 32,525, క్వింటాల్ రైస్ కోలేటి శేఖర్, మచ్చగిరి రామన్న, కొయ్యడ సతీష్, బొజ్జ సాగర్, మల్లరపు అరుణ్ కుమార్, యూసఫ్ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకి ఆదివారం అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్ కి హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోలేటి శేఖర్ , మచ్చగిరి రాము, బొజ్జ సాగర్, కొయ్యడ సతీశ్, మల్లరపు అరుణ్, మెడగోని విజయ్, మల్యాల విజయ్ ,గీసగోని శ్రీనివాస్,నారగోని సరిత,కుమార్, సయ్యద్ జాకీర్, షాబాజ్ ఖాన్, ప్రశాంత్,మహేష్, వంశీ, అనిల్ పాల్గొన్నారు.

# పంచాయతీలకు నిధుల కొరత

**ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామపంచాయతీ కార్యదర్శిలు...**



ముత్తారం మే 25(జనంసాక్షి): ముత్తారం మండలంలోని 15 గ్రామపంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది.పారిశుధ్యం నిర్వహణ సహా ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కొద్ది నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల నిలిచిపోవడంతో ఖజానా ఖాళీగా దర్శనమిస్తోంది.కొన్ని గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ల నెలవారీ కిస్తీలు చెల్లించలేక బ్యాంక్ లలో అసలు వడ్డీ నేలనేలకు పేరుకుపోతుండగా, మరోవైపు కార్మికులకు వేతనాలు చెల్లించలేక ఇబ్బందులు తప్పడంలేదు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.దాదాపు సంవత్సరం పైగా నిధులు మంజూరు కావడంలేదు.చిన్న పెద్ద పంచాయతీల్లో పాలన కార్యదర్శులకు భారంగా మారుతోంది. పారిశుధ్యం, తాగునీటి అవసరాలకు డబ్బులు సర్దుబాటు చేస్తున్నా..నెలల తరబడి బిల్లులు విడుదల కాకపోవడంతో వారు కూడా చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది.ఇప్పటికే మండలంలో నిధుల లేక నిర్వహణ భారమై పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులు పెట్టె అవకాశాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. కార్యదర్శుల బాటలో గ్రామ ప్రత్యేకధికారులు సైతం అదేబాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నారనే సమాచారం తెలుస్తుంది. ఇప్పటికే గ్రామపంచాయతీలో ప్రత్యేకాధికారులు వారంలో ఒకసారి కూడా పంచాయతీలను దర్శించడం లేదని, దానితో బాధ్యత మొత్తం పంచాయతీ కార్యదర్శులపైనే పడుతోందని వాపోతున్నారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీలో బిల్లులు రాక తప్పని ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా పంచాయతీల్లో పన్నులను మార్చి నెలాఖరులో వసూలు చేస్తారు.పాలకవర్గాల పదవీకాలం ముగిసి సంవత్సరం పైగా అవడంతో మెజార్టీ గ్రామ పంచాయతీ లతోపాటు చిన్న పంచాయతీ ముందుగానే పన్నులు వసూలు చేశారు.ఇలా సమకూరిన సొమ్మును మాజీ సర్పం చ్లు పంచాయతీ అవసరాల కోసం వెచ్చించిన సామగ్రికి బిల్లులు పెట్టిన కొంతమంది సర్పంచ్ డబ్బులు తీసుకున్నారు గ్రామాల్లో పారిశుధ్య పనులు పగడ్బందీగా నిర్వహించాలంటే ప్రతి గ్రామపంచాయతీకి పూర్తిస్థాయిలో నిధులను తప్పనిసరిగా విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

### జిపి కార్మికులకు దుస్తులు, నిత్యవసర సరుకులు పంపిణీ



మంథని, (జనంసాక్షి) :
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామనికి చెందిన బండి మల్లేష్ వారి భార్య బండి లక్ష్మీ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారి జ్ఞాపకర్థంగా బండి మల్లేష్ కల్వచర్ల, లొంకకేశరం గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికులు 16 మంది సిబ్బందికి దుస్తులు, నెలకు సరిపడా నిత్యవసర సరుకులు మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి తో కలిసి అందజేశారు. గ్రామ పంచాయతీ సపాయి సిబ్బంది బండి మల్లేష్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వేము కనకయ్య, వెన్నం శ్రీనివాస్, బండి శ్రీకాంత్, సురాం శ్రీనివాస్, బండి సంపత్, కుందరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నరేందర్‌రెడ్డికి ప్రతిష్టాత్మక పురస్కారం

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడికి వెంకట్ ఫౌండేషన్ వై.రఘునాథం ఎక్సలెన్స్ అవార్డు**



కరీంనగర్ బ్యూరో, మే 25 (జనంసాక్షి) :తెలంగాణ రాష్ట్ర విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నందుకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.వి. నరేందర్ రెడ్డి కి ఆదివారం స్థానిక కరీంనగర్ శివారులోని ఒక ప్రైవేటు వేడుక మందిరంలో వెంకట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకలో వి వి లక్ష్మీ నారాయణ రిటైర్డ్ పూర్వ జాయింట్ డైరెక్టర్, సిబిఐ గంప వెంకట్ ఫౌండర్ చైర్మన్ వెంకట్ ఫౌండేషన్ , ఇతర అతిధుల చేతుల మీదుగా వెంకట్ ఫౌండేషన్ వై రఘునాథం ఎక్సెంట్ అవార్డు ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి మార్గదర్శకంగా నిలుస్తున్నందుకుగాను , ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ విద్యను అందిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యారంగాలలో సమూలమైన మార్పులు తెస్తున్నందుకుగాను ఆదివారం రోజు వై.రఘునాథం ఎక్సెంట్ అవార్డు ప్రదానం చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 35 సంవత్సరాలుగా విద్యారంగానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని ఎంతోమంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కాకుండా వారిని ప్రతిష్టాత్మక స్థానాలలో స్థిరపడేందుకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. ఈ అవార్డు బాధ్యత మరింత రెట్టింపు చేసిన గాని , ఈ అవార్డు రావడానికి కృషి చేస్తున్న సిబ్బందికి, ప్రోత్సాహాన్ని అందిస్తున్న తల్లిదండ్రులకు అంకితమిస్తున్నానని తెలుపుతూ సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు పేస్ అస్త్రం

- ఫుల్ ఖుషీలో ఆర్సీబీ



హైదరాబాద్ (జనంసాక్షి) : ఐపీఎల్ 18వ సీజన్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)కి గుడ్‌న్యూస్ వచ్చింది. తొలి టైటిల్ కలను సాకారం చేసుకోవాలనుకుంటున్న ఆ జట్టు పేస్ బలం మరింత పెరగనుంది. టోర్నీ పునరుద్ధరణ తర్వాతి రెండు లీగ్ మ్యాచ్‌లకు దూరమైన ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ తిరిగి స్క్వాడ్‌తో కలిశాడు. ఆదివారం ఈ విషయాన్ని ఆర్సీబీ హెడ్‌కోచ్ దినేశ్ కార్తిక్ వెల్లడించాడు. 'హేజిల్‌వుడ్ మళ్లీ ఆర్సీబీతో కలవడం పట్ల యావత్ బెంగళూరు సంతోషంగా ఉంది. ఎందుకంటే.. పవర్ ప్లే, డెత్ ఓవర్లలో తాను ఎంత ప్రమాదకరమైన బౌలరో హేజిల్ నిరూపించాడు. ఇప్పుడు అతడు మాతో ఉన్నాడు. ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండడం నిజంగా మాకు ప్లస్ పాయింట్' అని కార్తిక్ తెలిపాడు. మే 17న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షార్పణం కావడంతో.. ఆఖరి రెండింటిలో అయినా విజయంతో ఆత్మవిశ్వాసంతో నాకౌట్ మ్యాచ్‌లకు సిద్ధం కావాలని భావించింది. అయితే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ షాక్ ఇవ్వడంతో 42 పరుగుల తేడాతో ఓడిపోయింది. దాంతో, చివరిదైన లీగ్ మ్యాచ్‌లో మే27 లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆర్సీబీ తలపడనుంది.

### భుజం గాయం నుంచి కోలుకొని..

తొలి టైటిల్ వేటలో ఉన్న ఆర్సీబీ 18వ సీజన్‌లో అదరగొట్టడంలో హేజిల్‌వుడ్ పాత్ర ఉంది. పవర్ ప్లే, డెత్ ఓవర్లలో నిప్పులు చెరుగుతూ పరుగులను నియంత్రించే ఈ స్పీడ్‌స్టర్.. బెంగళూరుకు ప్రధాన పేస్ అస్త్రంగా మారాడు. అయితే.. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా టోర్నీ వాయిదా పడడంతో జోష్ హేజిల్‌వుడ్ స్వదేశం వెళ్లపోయాడు. భుజం గాయంతో బాధపడుతున్న అతడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆడాల్సి ఉంది. కాబట్టి..కొన్నిరోజులు విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నాడు. కానీ, ప్లే ఆఫ్స్ పోరులో రజత్ పాటిదార్ బృందానికి తన సేవలు అవసరమని భావించిన ఈ పొడగరి పేసర్ తిరిగి స్క్వాడ్‌లో కలిశడు. ఇప్పటివరకూ హేజిల్‌వుడ్ ఐపీఎల్ 18వ సీజన్‌లో 17. 27 సగటుతో 18 వికెట్లు పడగొట్టాడు.

# వీడ్కోలుపై నాలుగు నెలల్లో నిర్ణయం



హైదరాబాద్ (జనంసాక్షి) : ఐపీఎల్ 18వ సీజన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) విజయంతో ముగించింది. లీగ్ దశ చివరి పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో గుజరాత్ టైటాన్స్‌కు మహేంద్ర సింగ్ ధోనీ సేన చెక్ పెట్టింది. ఇప్పుడు అందరి మెదళ్లలో తాలా మరో సీజన్ ఆడతాడా? అనే ప్రశ్నే ఉత్పన్నమవుతోంది. రెగ్యులర్ సారథి రుతురాజ్ గైక్వాడ్ గాయంతో తప్పుకోగా.. మళ్లీ పగ్గాలు అందుకున్న మహీ వీడ్కోలుపై మరో నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. అంతేకాదు వచ్చే సీజన్‌కు కెప్టెన్ ఎవరు? అనే విషయంపై కూడా స్పందించాడీ లెజెండ్. గుజరాత్‌పై గెలుపు అనంతరం ధోనీ మాట్లాడుతూ మాట్లాడుతూ సీఎస్కే భవితవ్యం.. వీడ్కోలు విషయాలపై గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'ఈ సీజన్ మాకు అనుకూలంచలేదు. బ్యాటింగ్ యూనిట్‌గా విఫలయం అయ్యాం. కానీ, ఈరోజు మా కుర్రాళ్లు ఖతర్నాక్ ఆడారు. నా విషయానికొస్తే ఇంకా నాలుగైదు నెలల సమయం ఉంది. రిటైర్మెంట్ నిర్ణయంపై నేను తొందరపడడం లేదు. అలా అనీ నేను మరో సీజన్ ఆడుతాను అనిగానీ, ఆడను అనిగానీ చెప్పలేను. ఎందుకంటే.. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవాలి. ప్రదర్శనను బట్టే వీడ్కోలు పలకాలి అనుకుంటే.. కొందరు క్రికెటర్ల కెరియర్ 22 ఏళ్లకే ముగుస్తుంది. అందుకే.. నేను హడావిడిగా ఏ నిర్ణయం తీసుకోను. సీజన్ ముగిసింది కాబట్టి.. రాంచీకి వెళ్తాను. నాకు నచ్చినట్టుగా గడపాలనుకుంటున్నా. నాకెంతో ఇష్టమైన బైక్‌ల మీద చక్కర్లు కొడుతాను' అని ధోనీ వెల్లడించాడు.

### రుతురాజ్‌కే పగ్గాలు

'తర్వాతి సీజన్‌లో సీఎస్కే సారథి ఎవరు?' అనే ప్రశ్నకు ఇంకెవరు రుతురాజ్ ఉన్నాడుగా అని బదులిచ్చాడు ధోనీ. రుతురాజ్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. అతడి గురించి ఆందోళన అవసరం లేదు. వచ్చే సీజన్ గురించి మేము మరీ ఎక్కువగా ఆలోచించడం లేదు. కెప్టెన్‌గా అతుడు సీఎస్కేను మళ్లీ గాడిలో పెడుతాడని నమ్మకం నాకుంది అని మహీ భాయ్ తెలిపాడు. 17వ సీజన్ ముందు కెప్టెన్సీ వదులుకున్న ధోనీ.. తన వారసుడిగా రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేశాడు. అయితే.. 18వ ఎడిషన్ మధ్యలో గైక్వాడ్ ఎడమచేతి బొటనవేలి గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. దాంతో, మళ్లీ సీఎస్కే సారథ్యాన్ని చేపట్టిన తాల.. కుర్రాళ్లలో ఆత్మవిశ్వాసం నింపుతూ జట్టులో స్ఫూర్తి రగిలించాడు. ఈ సీజన్‌లో ఫినిషర్‌గానూ రాణించిన ధోనీ.. 13 ఇన్నింగ్స్‌ల్లో 196 రన్స్ కొట్టాడు. అందులో 12 ఫోర్లు, 12 వఉన్నాయి.

# శ్రీకాంత్‌కు నిరాశ..

- మలేసియా మాస్టర్స్ ఫైనల్‌లో బోల్తా



హైదరాబాద్ (జనంసాక్షి) : మలేసియా మాస్టర్స్ టైటిల్ దిశగా సాగిన భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ ఫైనల్‌లో బోల్తాపడ్డాడు. ఆరేళ్ల తర్వాత ఓ టోర్నీలో ఫైనల్‌కు చేరుకున్నాన్న ఆనందం టైటిల్ పోరులో ఆవిరైంది. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్‌లో శ్రీకాంత్ 11-9, 21-9 తేడాతో చైనా ఆటగాడు లీ షిఫెంగ్ చేతిలో పరాజయం పాలయ్యారు. ఫైనల్‌కు ముందు వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో నెగ్గి శ్రీకాంత్ ఎదురులేకుండా కనిపించాడు. అయితే, టైటిల్ పోరులో మాత్రం అతను దారుణంగా నిరాశపరిచాడు. ప్రత్యర్థిని ఎదుర్కోవడంలో తడబడ్డాడు. కనీసం పోటీ ఇవ్వలేకపోయాడు. కేవలం 36 నిమిషాల్లోనే రెండు గేములను కోల్పోయి రన్నరప్‌గా సరిపెట్టాడు. 2017లో శ్రీకాంత్ చివరిసారిగా ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గాడు. ఆ తర్వాత మరో టైటిల్ సాధించలేకపోయాడు. 2019లో ఇండియా ఓపెన్‌లో ఫైనల్‌కు చేరుకున్నా అక్కడా బోల్తాపడ్డాడు. ఇన్నేళ్ల తర్వాత ఓ టోర్నీలో ఫైనల్‌లో అడుగుపెట్టగా శ్రీకాంత్‌కు నిరాశే ఎదురైంది. అయితే, కొంతకాలంగా పేలవ ప్రదర్శన చేసిన శ్రీకాంత్‌కు మలేసియా మాస్టర్స్‌లో ఫైనల్ వరకు చేరుకోవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే.

# ప్లే ఆఫ్ జట్లకు చుక్కలు చూపిస్తున్న ఎలిమినేటర్ జట్లు



న్యూఢిల్లీ (జనంసాక్షి) : ఐపీఎల్ 2025 చివరి దశకు చేరుకుంది. క్వాలిఫైయర్, ఎలిమినేటర్ మ్యాచులకు ఒక్క అడుగు దూరంలో 18 సీజన్ నిలిచింది. ఈ సీజన్ లో ఎవరూ ఊహించని విధంగా భారీ విజయాలతో గుజరాత్, పంజాబ్, ఆర్సీబీ, ముంబై జట్లు ప్లే ఆఫ్ చేరుకున్నాయి. ఎన్నో ఆశలు ఉన్న ఢిల్లీ, లక్నో, చెన్నై, కేకేఆర్, రాజస్థాన్, సన్ రైజర్స్ జట్లు ఫేలవమైన ఆట తీరుతో టోర్నీ నుంచి ఎలిమినేట్ అయ్యాయి. కానీ చివరి మ్యాచ్‌లలో ప్లే ఆఫ్స్‌కు క్వాలిఫై అయిన జట్లకు ఎలిమినేటర్ జట్లు చుక్కలు చూపిస్తున్నాయి. కీలక సమయంలో టాప్2 పొజిషన్‌ల కోసం గుజరాత్, పంజాబ్, ఆర్సీబీ జట్లు పోటీ పడుతుండగా.. వరుసగా మూడు మ్యాచుల్లో ఆ జట్లకు ఎలిమినేటర్ జట్లు ఓడించి షాక్ ఇచ్చాయి. దీంతో చివరి మ్యాచ్ వరకు టాప్ 2 జట్లు ఎవరో తేలే పరిస్థితి కనిపించడం లేదు. కాగా ఈ రోజు గుజరాత్, చెన్నై జట్లు మధ్య మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ లో గెలిస్తే గుజరాత్ జట్టు నేరుగా టాప్ 1 పొజిషన్ కన్ఫామ్ చేసుకుంటుంది. ఒకవేళ ఓడిపోతే మాత్రం ఆర్సీబీ, పంజాబ్, ముంబై జట్లకు ఈ అవకాశం దక్కుతుంది. కాగా ఈ సీజన్ లో ఎమ్ఎస్ ధోని ఈ రోజు ఆడబోయేది చివరి మ్యాచ్ కావడంతో తప్పక విజయం సాధించాలనే కసితో ప్లేయర్లు కనిపిస్తున్నారు. ఈ మ్యాచ్ ఫలితం పాయింట్ల పట్టిక, క్వాలిఫైయర్, ఎలిమినేటర్ మ్యాచులను నిర్ణయించనుంది.

## అయోధ్యలోని హనుమాన్ గర్హిలో విరాట్ దంపతుల పూజలు



హైదరాబాద్ (జనం సాక్షి) : భారత స్టార్ క్రికెటర్, టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ, ఆయన భార్య అనుష్క శర్మ అయోధ్యలోని ప్రముఖ హనుమాన్ గర్హి దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. అక్కడ హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూలమాలలతో కోహ్లీ, అనుష్క శర్మ దంపతులను సత్కరించారు. ఇద్దరికీ నుదుట తిలకం దిద్దారు. ఆ తర్వాత స్వామివారి చిత్రపటాలను అందజేశారు. కాగా ఇటీవలే విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ దంపతులు ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక గురువైన ప్రేమానంద్ గోవింద్ శరణ్ జీ మహరాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత విరాట్ కోహ్లీ ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తున్నాడు. అనుష్కశర్మతో కలిసి పలు క్షేత్రాలు సందర్శిస్తున్నాడు.

## ఈసెట్‌లో కేశనపల్లి వాసికి 5వ ర్యాంక్



ముత్తారం, మే 25 (జనంసాక్షి) : తెలంగాణ ఉస్మానియా యూనివర్శిటీ నిర్వహించిన ఈ సెట్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన బండారి మణిదీప్ మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో 5వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. మొత్తం 200 మార్కులకుగాను 109 మార్కులు సాధించాడు. ఈ సెట్‌లో మంచి ర్యాంక్ సాధించిన బండారి మణిదీప్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## నేటితో ముగియనున్న పుష్కరాలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/మహాదేవపూర్/ కాళేశ్వరం, (జనంసాక్షి): సరస్వతి పుష్కరాలు నేటీ సోమవారంతో ముగియనున్న సందర్భంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఆదివారం అన్ని శాఖల అధికారులతో పుష్కరాలు ముగియనున్న చివరిరోజు ఏర్పాట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాకి టాకీ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చివరి రోజు కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని యంత్రాంగం అలర్ట్ గా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో స్నానఘట్టాలు, రహదారులు, పార్కింగ్ స్థలాలు, ఇతర సదుపాయాల వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భద్రత, పారిశుధ్య, ఆరోగ్య సేవల కల్పన కోసం అవసరమైన వసతులన్నీ కల్పించబడినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. చివరి రోజైన రేపు భారీ రద్దీని దృష్టిలో పెట్టుకుని భక్తుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు కొనసాగించాలని సూచించారు. భక్తులు జిల్లా యంత్రాంగం సూచించిన మార్గదర్శకాలను పాటించాలని ఆయన కోరారు.

# తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపాన్ని పునర్మించాలి

- మరొకచోట కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- లేకుంటే స్వయంగా మేమే తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని నిర్మిస్తాం
- అమరవీరుల స్మారక పిల్లర్ వద్ద ఉద్యమకారుల హెచ్చరిక



పాలకుర్తి, మే 25 (జనంసాక్షి) : తెలంగాణ అమరవీరుల స్మారకార్థం కోసం నిర్మించిన పిల్లర్ వద్ద తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని పున నిర్మాణం చేయాలని, అందుకు స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చొరవ చూపాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్మారకార్థం రాజీవ్ చౌరస్తాలో నిర్మించిన పిల్లర్ వద్ద తెలంగాణ ఉద్యమకారులు తమ నిరసనను వ్యక్తం చేశారు. కొద్ది మంది కావాలని విచ్ఛిన్నకర శక్తులు తెలంగాణ అమరవీరుల స్మారక పిల్లర్ ను ఆక్రమించి మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇది దుర్మార్గపు చర్య అని తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన త్యాగం మరువలేని అని ఆయన విగ్రహం మరొకచోట పెట్టి, చౌరస్తాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆయనను గౌరవించుకోవాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే కొద్ది మంది తమ స్వార్ధ ప్రయోజనాల కోసం.. ప్రభుత్వం నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్మారక పిల్లర్ ను ఆక్రమించడం సరికాదని హితవు పలికారు. పాలకుర్తి ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉందని అలాంటి ఈ ప్రాంతానికి చెడ్డ పేరు తీసుకురావద్దని సూచించారు. తెలంగాణ కోసం 1500 మంది ప్రాణాలర్పించిన అమరవీరుల కోసం నిర్మించిన స్మారక పిల్లర్ ఆక్రమణ గురైనప్పటికీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, వెంటనే స్పందించి దానిని స్వాధీనం చేసుకొని స్థూపాన్ని పునర్నిర్మానం చేయాలని, ప్రారంభించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారులు స్పందించకపోతే.. ఉద్యమకారులుగా తాము స్పందిస్తామని తాము స్మారక స్థూపాన్ని నిర్మిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక రాష్ట్ర అధ్యక్షులు గోధుమల కుమారస్వామి, తెలంగాణ ఉద్యమకారుడు బద్రి, వివిధ జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు, జనగామ జిల్లా కన్వీనర్ పోలాస సోమయ్య, జిల్లాలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల పలు మండలాల ఉద్యమకారులు పాల్గొన్నారు.

# రాజోలి ఎస్ఐపై చర్యలు తీసుకోండి

- ఎస్సై దాడి చేశాడంటూ వీడియో వైరల్ చేసిన బాధితుడు
- ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్
- అతని ఆరోపణలో ఏమాత్రం వాస్తవం లేదు : ఎస్సై



రాజోలి, మే 25 (జనంసాక్షి) : రాజోలి ఎస్సై స్టేషన్‌కు పిలిపించి బూటుకాలితో తన్ని అకారణంగా తనను కొట్టిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మాట్లాడిన వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజోలి మండలంలోని చిన్న ధన్వాడ గ్రామానికి చెందిన మూగ రాజశేఖర్ పై దాడి చేసిన ఎస్సై పై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. చిన్న ధన్వాడ గ్రామానికి చెందిన సుదర్శన్, మూగ రాజశేఖర్ ఇద్దరి మధ్య పొలం విషయంలో వివాదం కొనసాగగా సుదర్శన్ ఈ నెల 22న రాజశేఖర్ పై రాజోలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజున ఎస్సై పోలీస్ స్టేషన్ పిలిపించి నాపై బూటు కాలుతోదాడి చేసి, కులం పేరుతొ దారుణంగా ప్రవర్తించారని బాధితుడు వీడియోలో పేర్కొన్నాడు. ఎస్ఐపై జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందని బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై ఎస్ఐ జగదీశ్వర్ వివరణ కోరగా..రాజశేఖర్ పోలీస్ స్టేషన్ పిలిపించింది వాస్తవమే కానీ, సివిల్ పంచాయతీ కావడంతో గొడవలు లేకుండా శాంతియుతంగా చర్చించుకోండి అని హెచ్చరించి, ఎమ్మార్వో కార్యాలయంకు పంపడం జరిగింది. గత 4 నెలల క్రిందట నా కాలుకు గాయం కావడంతో ఇప్పుడిప్పుడే కోలుకొంటున్న, అతడిపై దాడి ఎలా చేస్తాను? అతని ఆరోపణలో ఏమాత్రం వాస్తవం లేదు. కావాలనే నాపై ఆరోపణలు చేస్తున్నారని ఎస్సై వివరించారు.




## తడిసిన ధాన్యంపై ఆందోళన చెందొద్దు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): తడిసిన ధాన్యంపై రైతులు ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం చెల్పూర్, గొల్లపల్లి, బస్వరాజుపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సివిల్ సప్లై, పోలీస్, మిల్లర్ల యజమానులు, లారీ ట్రాన్స్పోర్ట్ యజమానులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని సెంటర్లకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ యజమానులకు సూచించారు. మిల్లర్లు సన్న వడ్లను దింపుకునేలా అధికారులు మానిటరింగ్ చేయాలని, మాయిశ్చర్(తేమ)తో సంబంధం లేకుండా మిల్లర్లను వడ్లను దింపుకోవాలని ఆదేశించారు. హన్మకొండ, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని మిల్లర్లు ఇక్కడి వడ్లను దిగుమతి చేసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని రెండు జిల్లాల కలెక్టర్లను ఎమ్మెల్యే కోరారు.

## కోటగుళ్లలో స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ పూజలు



గణపురం, మే 25(జనం సాక్షి): కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో ఆదివారం స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ ఏం సత్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి గణపతి నందీశ్వరుడు గణపేశ్వరునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు పూల మాలలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కోటగుళ్లను సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందని ఆలయ శిల్ప సంపద ఎంతో అద్భుతమని కొనియాడారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
26 మే 2025

# కలం యోధునికి కన్నీటి నివాళి



*కలం యోధునికి ప్రముఖులు కన్నీటి నివాళి అర్పించారు. సింగరేణి ప్రాంతం బోరున విలపించింది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆయన చేసిన కృషి గుర్తు చేసుకున్నారు. జర్నలిస్టుగా ఆయన రచనలను మననం చేసుకున్నారు. సింగరేణి కార్మికునిగా ఆయనతో ఉన్న చెలిమిని యాది చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు మునీర్ మరణంపై మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సంతాపాలు ప్రకటించారు.*

*-జనంసాక్షి, మంచిర్యాల ప్రతినిధి*



సకలజనుల సమ్మె సందర్భంగా కోదండరాంతో మునీర్ (ఫైల్)



నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

## టీయూడబ్ల్యూజే సంతాపం

మునీర్ మరణం తెలంగాణ సమాజానికి, జర్నలిస్టు కమ్యూనిటీకి తీరని లోటని, ప్రజా జర్నలిస్ట్ మునీర్‌కు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే) నివాళులు అర్పించింది. మునీర్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని టీయూడబ్ల్యూజే అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్, టెంజు అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, టెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్ టీయూడబ్ల్యూజే కోశాధికారి పి.యోగానంద్ తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు జర్నలిస్టుగా, ప్రజా ఉద్యమకారుడిగా, సింగరేణి కార్మికులకు నాయకునిగా, తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ నాయకుడిగా మునీర్ పనిచేశారని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్రపోషించాడని గుర్తు చేశారు. జర్నలిస్టుగానే కాకుండా, సింగరేణి కార్మికులకు నాయకునిగా పనిచేశారని, సకల జనుల సమ్మె సమయంలో మునీర్ సింగరేణి కార్మిక జేఏసీకి నాయకత్వం వహించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యంలో టీజేఎఫ్ నాయకునిగా కీలకపాత్ర పాత్ర పోషించారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీయుడబ్ల్యూజే నాయకునిగా కూడా పనిచేశారని, మునీర్ కొద్దిరోజులుగా కాన్సర్ వ్యాధితో బాధపడుతూ, ఆదివారం ఉదయం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారని తెలిపారు.

## కలం యోధునికి కన్నీటి వీడ్కోలు

**బెల్లంపల్లి, మే 25, (జనంసాక్షి) :** కలం యోధుడు, అలుపెరుగని కమ్యూనిస్ట్, సీనియర్ జర్నలిస్ట్ మునీర్‌కు ఎంసీపీఐయూ నాయకులు అఖిల భారత కార్మిక సంఘాల జాతీయ కార్యదర్శి సబ్బని కృష్ణ, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్ ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మునీర్ స్వగృహంలో నివాళులు అర్పించారు. ఆయన పార్థివ దేహం వద్ద విప్లవ నినాదాలతో విప్లవ గేయాలతో జోహార్లు అర్పించారు. నేటి తరానికి ప్రముఖ జర్నలిస్టుగా మాత్రమే మునీర్ తెలుసని, మునీర్ చేసిన సేవకు కొలమానం లేదని, ఆయన నిబద్ధత, నిజాయితీ, ఆశయాలు ఉన్నతమైనవని, ఆయన జీవితం తెరిచిన పుస్తకం అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, సింగరేణి జేఏసీ కన్వీనర్ గా పనిచేశారని, తెలంగాణ సాధనలో ఆయన పాత్ర అమోఘమైనదని అన్నారు. ఆయన ఆశ బాటలో ప్రతి ఒక్కరూ పయనించినప్పుడే ఆయనకు సరైన నివాళులు అర్పించిన వాళ్లమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబోజి సురేష్, ఆకాష్ తదితర పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆత్మీయున్ని కోల్పోయిన మంచిర్యాల పాత్రికేయులు

**మంచిర్యాల ప్రతినిధి, మే 25 (జనంసాక్షి) :** సింగరేణి జేఏసీ కన్వీనర్‌గా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ జర్నలిస్ట్ , నిరంతరం ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం చేసిన కలం యోధుడు, సామాజిక చైతన్యం కోసం అహర్నిశలు కృషిచేసిన అక్షరయోధుడు మునీర్ మరణ వార్త విని మంచిర్యాల జిల్లా పాత్రికేయ లోకం ఒక ఆత్మీయుని కోల్పోయామని ఆయన పార్థివదేహాన్ని సందర్శించి కన్నీటితో సంతాపం తెలియజేశారు. సమసమాజ నిర్మాణం కోసం కలం చేతబట్టి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు, నిత్య చైతన్య శీలి, తెలంగాణ ఉద్యమకారుడు, సింగరేణి కార్మిక ఉద్యమాల్లో ఊపిరిగా నిలిచిన జర్నలిస్టు మునీర్ పార్థివదేహాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గౌతమ్ నగర్ లో ఆయన నివాసంలో ప్రజల సందర్శనార్థం మూడు గంటల పాటు ఉంచారు. జిల్లాలోని పాత్రికేయులు,పాత్రికేయ సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు బొగ్గు గనుల ట్రేడ్ యూనియన్ నాయకులు సింగరేణి కార్మికులు తరలి వచ్చి కలం యోధుడికి కన్నీటి వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంచిర్యాల జిల్లా టీయూడబ్ల్యూజే(ఐజెయు) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగిళి సంపత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్ రెడ్డి, నాయకులు ఎర్రం ప్రభాకర్, చొక్కారపు శ్రీనివాస్ తదితరులు పార్థీవ దేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ,బిఆరెస్ రాష్ట్ర నాయకుడు విజిత్ రావు, కాగజ్ నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప మునీర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ప్రముఖ పాత్రికేయుడు ఎం డి మునీర్ పార్థివ దేహానికి సీపీఐ పార్టీ జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ అనుబంధ ట్రేడ్ యూనియన్ ఐఎన్టీయూసీ నాయకులు జనక్‌ప్రసాద్,కార్మిక నాయకులు కెంగర్ల మల్లయ్య ఏనుగు రవీందర్‌రెడ్డి తదితర కార్మిక నాయకులు మునిర్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ కృష్ణ, ఎమ్మెల్సీ కోదండరామ్ పార్టీ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మందమర్రి పట్టణం లోని మసీదులో ఐదు గంటల నమాజ్ అనంతరం మునీర్ అంతిమ యాత్ర కు మందమర్రి పట్టణ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

## టియుడబ్లుజే (ఐజేయు) నిర్మల్ శాఖ నివాళి

**నిర్మల్ బ్యూరో, మే 25,(జనంసాక్షి) :** ఉద్యమకారుడు సీనియర్ జర్నలిస్ట్ ఎండి మునీర్ అకాల మరణం పత్రిక రంగానికి తీరని లోటని నిర్మల్ జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు కొండూరు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్యలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్రపోషించాడు. ఆయన మరణం జర్నలిస్టు కమ్యూనిటీకి తీరని లోటన్నారు.

## మునీర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

**ఖమ్మం, (జనం సాక్షి) :** సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు మునీర్ కు టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించింది. 'న్యూస్ ఈజ్ పీపుల్...పీపుల్స్ ఆర్ మై లైఫ్' అనే సరికొత్త నినాదాన్ని ఎత్తుకున్న మునీర్... లేకపోవడం జర్నలిస్టు లోకానికి తీరని లోటని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ప్రకటించింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మునీర్ స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రిలో నిర్వహించిన అంతిమ యాత్రలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకుడు, వి6 ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో సయ్యద్ ఖదీర్, టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకుడు, జనం సాక్షి ఖమ్మం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ షేక్ సుభాన్, కూసుమంచి గ్లోబల్ రెయిన్బో స్కూల్ కరస్పాండెంట్ మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్, షేక్ అజీజ్ పాల్గొన్నారు.





మునీర్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న కోనేరు కోనప్ప



మునీర్ పాడె మోస్తున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



సకలజనుల సమ్మెలో మునీర్ (ఫైల్)





మునీర్ భౌతికకాయానికి పూలమాల వేస్తున్న నడిపల్లి దివాకర్‌రావు





మంచిర్యాల జర్నలిస్టుల నివాళి

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370